మనం

జనం కోసం.. అక్షర యజ్ఞం..

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | AMARAVATHI | TIRUPATI | KURNOOL | TADEPALLIGUDEM | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA

హైదరాబాద్ | సంపుటి: 2 • సంచిక: 58 • పేజీలు:12+16 • వెల: రూ.5 | శనివారం • 27-1-2018 | www.manamnews.com | /manamnews

దశదిశలా ఘనకీర్తి

హస్తినలో వైభవంగా గణతంత్ర వేడుకలు.. హాజరైన 10 ఏషియాన్ దేశాల అధినేతలు

- భారతీయ సైనిక పాటవాన్ని చాటిన పరేడ్
- 23 శకటాలతో రాష్ట్రాల సాంస్కృతిక వైవిధ్యం
- 8 కిలోమీటర్ల మేర గంటన్నర సంరంభం
- త్రివిధ దళాల ప్రదర్శనలతో జనం కళ్లు మిరుమిట్లు
- గణతంత్ర వేడుకలకు హాజరైన అతిరథులు





న్యూఢిల్లీ, జనవరి 26:

గణతంత్ర దినోత్సవాల్లో మునుపెన్నడూ లేని విధంగా ఏకంగా 10 ఏషియాన్ దేశాల అధినేతలు అతిథులుగా వచ్చి అంబరాన్నంటిన సంబరాలను చూసి మురిసిపోయారు. 69వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా భారతదేశ అపార సైనిక సంపత్తితో పాటు.. సుసంపన్నమైన సాంస్కృతిక వైవిధ్యమంతా రాజ్‌పథ్ వీధుల్లో కళ్లకు కట్టినట్లు కనిపించింది. ఇప్పటివరకు ఏదో ఒక దేశానికి చెందిన **మిగతా 7లో..**



బంగారు తెలంగాణ

అదే మన లక్ష్యం.. సాధనకు శ్రమిద్దాం

- విద్యుత్ సంక్షోభాన్ని అధిగమించాం
- గణతంత్ర వేడుకల్లో గవర్నర్ నరసింహన్
- ఆకట్టుకున్న త్రివిధ దళాల కవాతు
- హాజరైన సీఎం.. పలువురు మంత్రులు

హైదరాబాద్, జనవరి 26 (మనం ప్రతినిధి):

బంగారు తెలంగాణ సాధనే మనందరి లక్ష్యమని.. అందుకు శాయశక్తులా శ్రమిద్దామని తెలంగాణ **మిగతా 6లో..**



గవర్నర్ నుంచి అవార్డు అందుకుంటున్న పీసీబీ సభ్య కార్యదర్శి సత్యనారాయణ రెడ్డి



ఆస్పత్రిలో అగ్నిప్రమాదం

41 మంది దుర్మరణం

80 మందికి తీవ్ర గాయాలు

దక్షిణ కొరియాలో ఘోరం

7లో..



కోవింద్ కంటతడి

శౌర్య పతకాల ప్రదానంలో రాష్ట్రపతి భావోద్వేగం

ఇదీలోకం!



పెద్దగా తేడా ఏమీ ఉండదు..
ఇక్కడా నటించడమేగా..!



భరతమాతకు సప్తహారతులు

- కాశీ నుంచి పురోహితుల రాక
- 2వేల మంది చిన్నారుల సందడి

హైదరాబాద్, జనవరి 26 (మనం న్యూస్):

భిన్న జాతులు, భాషల సమాహారంగా, అత్యున్నతమైన సంస్కృతీ సంప్రదాయాలకు ఆలవాలంగా, శాంతిదూతగా విలసిల్లుతున్న తల్లి భారతికి హృదయపూర్వక కృతజ్ఞతాభివందన సమర్పణే 'భరతమాత మహాహారతి' అని బీజేపీ ఎమ్మెల్యే, భారతమాత **మిగతా 6లో..**

• **బస్సు బుగ్గి..**



మెదక్ జిల్లా కొల్చారం బస్టాండు వద్ద ఆర్టీసీ బస్సులో చెలరేగిన మంటలు.. ఈ ప్రమాదం నుంచి 48 మంది ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు

3లో..



మూడు రోజుల్లో పాస్‌పోర్టు

తత్కాల్ విధానంలో మంజూరు

- అదనంగా రూ.2 వేల రుసుం
- కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు

విశాఖపట్నం, జనవరి 26 (మనం న్యూస్ బ్యూరో):

గణతంత్ర దినోత్సవం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం.. త్వరితగతిన పాస్‌పోర్టు పొందాలనుకొనే వారికి ఊరట నిచ్చింది. తత్కాల్ విధానంలో మూడు రోజుల్లో పాస్‌పోర్టు మంజూరు చేసేందుకు వీలుగా తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. తత్కాల్ పద్ధతిలో దరఖాస్తు చేసుకునేవారి నుంచి రూ.2000 అదనపు రుసుము వసూలు చేసి పాస్‌పోర్టులు మంజూరు చేయనున్నట్లు విశాఖ ప్రాంతీయ పాస్‌పోర్టు కార్యాయలం అధికారి ఎన్.ఎల్.పి చౌదరి చెప్పారు. మామూలుగా పాస్‌పోర్టు కోసం చెల్లించాల్సిన 1500 రూపాయలకు ఇది అదనం. 18 సంవత్సరాల **మిగతా 6లో..**



జంపన్నవాగులో అబ్బియా..

అడవిబాట పడుతున్న పల్లెలు.. ముందే మొదలైన కోలాహలం

- రెండు రోజుల్లో పారామోటార్
- గోవిందరాజు దారిలో వన్ వే
- జాతరకు అత్యాధునిక భద్రత
- మేడారం పేరుతో 2 యాప్‌లు
- ప్రత్యేకంగా ఫేస్‌బుక్ పేజీ కూడా

హైదరాబాద్, జనవరి 26 (మనం ప్రతినిధి):

అదిగదిగో మేడారం మహా జాతర.. పల్లెలన్నీ ముందుగనే అడవిబాట.. భక్తజన సంద్రంగా మారుతున్న మేడారం.. 'జంపన్నవాగులో అబ్బియా.. జలకాలాడుదాం.. అబ్బియా' అంటూ పల్లెలన్నీ అడవిబాట పడుతున్నాయి. రోజురోజుకీ ఇతర రాష్ట్రాల నుంచి భక్తుల రాక పెరగడంతో మేడారం భక్తజనంతో నిండిపోతోంది. జాతర జరిగే జనవరి 31, ఫిబ్రవరి 1, 2, 3 తేదీల్లో ఇసుక వేస్తే రాలనంత జనం రానున్న నేపథ్యంలో **మిగతా 6లో..**



వాతావరణం

తెలుగు రాష్ట్రాల్లో శనివారం పొడి వాతావరణం నెలకొంటుంది. పగటి ఉష్ణోగ్రత స్వల్పంగా తగ్గుతుంది. రాత్రి ఉష్ణోగ్రతలో మార్పులేదు. గాలుల నేపథ్యంలో చలి తీవ్రత పెరుగుతుంది.

గరిష్ఠ ఉష్ణోగ్రత: 30 డిగ్రీలు

కనిష్ఠ ఉష్ణోగ్రత: 15 డిగ్రీలు

గాలిలో తేమ: 44 శాతం

ముహూర్తం

శ్రీహేవిళంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, మాఘమాసం, శుక్లపక్షం, తిథి: దశమి ఉ.11.15 తదుపరి ఏకాదశి; నక్షత్రం: రోహిణి తె.4.03 తదుపరి మృగశిర; వర్జ్యం: రా.8.42–10.10; దుర్ముహూర్తం: ఉ.6.53–8.22; రాహుకాలం: ఉ.9.41–11.05; అమృతఘడియలు: తె.3.48–5.18; శుభసమయం: ఉ.11.06–1.00.

సూర్యోదయం: 6.53

సూర్యాస్తమయం: 6.05

రాజ్యాంగంలో లోపం లేదు

- **ఐపీసీ సెక్షన్ 506, 507 మార్పులకు వ్యతిరేకం**
- **రాజకీయ కక్ష సాధింపునకే ఇలాంటి నిర్ణయాలు**
- **పార్టీ ఏర్పాటుపై వచ్చే నెలలో ప్రకటన: కోదండరాం**

హైదరాబాద్, జనవరి 26 (మనం ప్రతినిధి): రాజ్యాంగంలో ఎలాంటి లోపం లేదని, పాలిస్తున్న పాలకుల్లోనే లోపం ఉందని టీజేఏసీ చైర్మన్ కోదండరాం అభిప్రాయపడ్డారు. అందుకే రాజ్యాంగాన్ని మారుస్తామని ప్రకటించిన ప్రతిసారీ ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తోందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఐపీసీ సెక్షన్ 506, 507లో తీసుకువచ్చిన మార్పులకు తాము తీవ్ర వ్యతిరేకమని అన్నారు. టీజేఏసీ కార్యాలయంలో జెండా ఆవిష్కరణ కార్యక్రమం అనంతరం కోదండరాం మీడియాతో మాట్లాడారు. ఈ మార్పుల ద్వారా కోర్టుల అనుమతి, జోక్యం లేకుండానే సామాజిక మాధ్యమాల్లో ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఎవరు వ్యాఖ్యానించినా, అభిప్రాయాలు వెలిబుచ్చినా కేసు నమోదు చేసి అరెస్టు చేసే అవకాశం ఉందని అన్నారు. పరుష పదజాలం అంటే కొలమానం అంటే ఏమిటి? అని ప్రశ్నించారు. ఇలాంటి మార్పులను తాము తీవ్రంగా వ్యతిరేకిస్తామని వెల్లడించారు. మందకృష్ణ, మాదిగ, ఒంటేరు ప్రతాప్‌రెడ్డి, అద్దంకి దయాకర్‌పై రాజకీయ కక్షతోనే కేసులు పెట్టారని ఆరోపించారు. వచ్చే నెలలో పార్టీ ఏర్పాటుపై ఓ నిర్ణయం తీసుకుని తుది నిర్ణయం ప్రకటిస్తామని చెప్పారు.



రాజ్యాంగాన్ని కాపాడుకోవాలి

- **విపత్కర పరిస్థితుల వైపు దేశం**
- **అడ్డుకోవాల్సిన బాధ్యత అందరిదీ**
- **రాజ్యాంగ పరిరక్షణ సదస్సులో జస్టిస్ సుదర్శన్‌రెడ్డి**

హైదరాబాద్, జనవరి 26(మనం ప్రతినిధి): రాజ్యాంగం పదిలంగానే ఉన్నప్పటికీ అది నిర్దేశించిన వ్యవస్థలను పరిరక్షించుకోవాల్సి ఆవశ్యకత ఏర్పడిందని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి బి.సుదర్శన్‌రెడ్డి అన్నారు. ప్రస్తుతం దేశంలో పార్లమెంటరీ ప్రజాస్వామ్యం, న్యాయ సమీక్ష, పౌరసత్వం అసాధారణమయ్యాయని, తాము చూపిందే చూస్తావా.? చస్తావా అనే పరిస్థితి ముందున్నదని, ఆ విపత్కర పరిస్థితి దిశగా దేశం పయనిస్తోందని ఆయన హెచ్చరించారు. బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్‌లో ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్(ఐఏఎల్) ఆధ్వర్యంలో 'రాజ్యాంగ పరిరక్షణ' అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ.. త్రేతాయుగంలో ముక్కుకోసిన ఘటనను గుర్తు చేస్తూ.. తమకు వ్యతిరేకంగా మాట్లాడిన వారి ముక్కు కోస్తే కోట్ల రూపాయలు బహుమతులిస్తామని ప్రకటిస్తున్నారని, పిల్లలను కూడా వదలని అరాచకం దేశంలో కొనసాగుతుందని ఆవేదన వ్యక్తంచేశారు. రాష్ట్రపతి, గవర్నర్ వ్యవస్థలకు రాజకీయాల్లో తావు లేదన్నారు. గవర్నర్లు, రాష్ట్రపతి పౌరులందరి ప్రతినిధులని ఆయన స్పష్టంచేశారు. ఎంతమంచి రాజ్యాంగాన్ని రూపొందించుకున్నా అది దుర్మార్గుడి చేతిలో పడితే ప్రమాదమేనన్నారు. ఆదేశిక సూత్రాలు, రాజ్యాంగంలో పొందుపర్చిన ప్రజల ప్రతిష్ట, భావ ప్రకటన సక్రమంగా అమలు జరగాల్సిన అవసరముందన్నారు. ఏ వ్యవస్థలో పనిచేస్తున్నవారైనా తాము చేస్తున్న ప్రమాణాలకు కంకణబద్ధులుగా ఉండి, రాజ్యాంగ విలువలను కాపాడాలన్నారు. ప్రతిపక్షంలో ఉండి ప్రభుత్వాలను నిలదీసే వారిని పనిగట్టుకుని హింసించడం ప్రసారమాధ్యమాలు మానుకోవాలని ఆయన హితవుపలికారు. కార్యక్రమంలో వీక్షణం సంపాదకులు ఎన్ వేణుగోపాల్, ప్రముఖ పాత్రికేయులు సి రాఘవాచారి, తదితరులు మాట్లాడారు. సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి, చాడ వెంకటరెడ్డి, ఐఏఎల్ జాతీయ ప్రధాన కార్యదర్శి బొమ్మగాని ప్రభాకర్, మన తెలంగాణ పత్రిక సంపాదకులు కె శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మల్లన్నసాగర్‌పై పునరాలోచించండి

- **సీఎం కేసీఆర్‌కు చాడ వెంకటరెడ్డి లేఖ**

హైదరాబాద్, జనవరి 26(మనం ప్రతినిధి): మల్లన్నసాగర్ రిజర్వాయర్ సామర్థ్యం పెంపు, నష్టపరిహారం, తదితర అంశాలపై అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. మల్లన్నసాగర్ ప్రాజెక్టు ఎత్తు పెంపును నిరసిస్తూ వేములఘాట్ గ్రామ ప్రజల రిలే దీక్షలు శుక్రవారం నాటికి 600ల రోజులకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా చాడ వెంకట్‌రెడ్డి శుక్రవారం సీఎం కేసీఆర్‌కు ఓ లేఖ రాశారు. మల్లన్నసాగర్‌ను 50టీఎంసీల సామర్థ్యంతో నిర్మించడం సరికాదని రిటైర్డ్ ఇంజనీర్ల సంఘం తప్పుబట్టారని లేఖలో పేర్కొన్నారు. అయినాకూడా ప్రభుత్వం పరిశీలనకు సిద్ధపడకుండా ముంపునకు గురయ్యే గ్రామాల ప్రజలను మభ్యపెట్టి, భయపెట్టి భూసేకరణ చేయడం సరికాదన్నారు. ఇకనైనా ప్రభుత్వం పంతంవీడి ఇంజనీరింగ్ నిపుణుల సలహాతో నష్టనివారణ చర్యలు చేపట్టాలని కోరారు.

యాచారంలో ఆరుగురు ఆర్‌ఎంపీల అరెస్ట్

హైదరాబాద్, జనవరి 26(మనం ప్రతినిధి): యాచారంలో లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్న ఆరుగురు ఆర్ఎంపీ డాక్టర్లను పోలీసులు అరెస్ట్ చేశారు. వెంకటేశ్వర క్లినిక్‌లో సరితా స్కానింగ్ సెంటర్ పేరుతో లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్న ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. వీరిలో ఆరుగురు ఆర్ఎంపీ డాక్టర్లు, మరో మహిళ ఉంది. పోలీసులు స్కానింగ్ మిషన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన సూత్రధారి పరారీలో ఉన్నాడు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడి కోసం గాలింపు కొనసాగిస్తున్నారు.

నెలసరికి వాయు కాలుష్యం పొగ



బోస్టన్, జనవరి 26: టీనేజ్ యువతుల నెలసరిపై వాయుకాలుష్యం ప్రభావం చూపిస్తోందని తాజా అధ్యయనంలో వెల్లడైంది. నెలసరి గతి తప్పడానికి ఇదీ ఓ కారణమని తేల్చింది. అంతేకాదు.. మహిళల్లో సంతాన లేమికీ వాయు కాలుష్యం కారణమవుతోందని బోస్టన్ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ మెడిసిన్ పరిశోధకుల అధ్యయనంలో తేలింది. ఆరోగ్యంపై వాయు కాలుష్య ప్రభావాన్ని పరిశీలిస్తుండగా ఈ విషయం బయటపడిం దని వర్సిటీకి చెందిన శృతి తెలిపారు. కలుషిత గాలిని పీల్చడం వల్ల నెల సరి ఆలస్యమయ్యే ప్రమాదం ఉందని వివరించారు. ముఖ్యం 14 నుంచి 18 ఏళ్ల మధ్య వయస్కులలో ఈ ప్రభావం స్పష్టంగా కనిపిస్తుందని పేర్కొన్నారు. శరీరంలోని హార్మోన్లపై ఈ కలుషిత గాలి తీవ్ర ప్రభావం చూపిస్తుందన్నారు. ఫలితంగా హార్మోన్ల అసమతుల్యత ఏర్పడి నెలసరి ఆగిపోవడం, ఆలస్యంగా రావడం, ముందే రావడం తదితర ఇబ్బందులు ఎదురవుతాయని వివరించారు. దీని ఫలితం దీర్ఘకాలంగానూ ఉంటుందని చెప్పారు. మెనుస్ట్రువల్ సైకిల్ గతితప్పడం వల్ల దీర్ఘకాలంలో సంతానం పొందే భాగ్యానికి దూరమయ్యే ముప్పు కూడా ఉందన్నారు. వాయు కాలుష్యం వల్ల హృద్రోగ ముప్పు ఉందనే విషయం ఇప్పటికే తెలిసిందే!

60 పశువుల మృత్యువాత

- **విష గుళికలు చల్లిన గడ్డి తినడంతో ఘోరం**
- **మహబూబాబాద్ జిల్లా మరిపెడలో విషాదం**

మరిపెడ, జనవరి 26 (మనం న్యూస్): పచ్చటి గడ్డి నేలపాలు అవుతుందనే ఉద్దేశంతో దాన్ని కోసుకువచ్చి.. ఓ రైతు తన రెండు మూగ జీవాలకు వేశాడు. ఆ గడ్డిలో ఉన్న విష గుళికలను గ్రహించని ఆ రైతే.. తన పశువులను చేజేతులారా చంపుకున్నాడు. ఆ ఒక్క రైతే పశువులే కాదు.. ఆ తండాలోని రైతుల పశువులన్నీ విగతజీవులయ్యాయి. దాదాపు 60 పశువులు మృత్యువాత పడ్డాయి. ఈ హృదయవిదారక సంఘటన మహబూబాబాద్ జిల్లాలోని మరిపెడ మండలం వీరారం శివారులోని దుబ్బతండాలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం అదే తండాకు చెందిన బానోత్ మంగు తనకు ఉన్న వ్యవసాయ భూమిలో 10 గుంటలలో కంద గడ్డల పంటను సాగు చేశాడు. ఇదే క్రమంలో గత 20 రోజుల క్రితం గుళికలు వేశారు.పంట చేతికి రావటంతో పైన ఉన్న గడ్డిని కోసి పశువులకు మేతగా వేశారు. తనతో పాటు తండాలోని రైతులు చుట్టు పక్కల ఉన్న పోలాల వారు మిరప తోటలకు కూలీకి వచ్చిన మహిళలు కూడా ఆగడ్డిని తమ ఇండ్లకు తీసుకెళ్లారు. అయితే ఆ గడ్డిలో గుళికలు ఉండటాన్ని రైతులు, మహిళలు గమనించలేదు, ఆగడ్డిని పుశవులకు మేతగా వేశారు. ఆ గడ్డిని తింటున్న క్రమంలో మంగుకు చెందిన రెండు కాడెద్దులతో పాటు తండాలోని సుమారు 60 పశువులు మృత్యువాతపడ్డాయి. పరిస్థితిని గమనించిన తండా వాసులు పశువైద్యులకు సమాచారం అందించటంలో 1962 వాహనాలు



మహబూబాబాద్, మరిపెడ నుండి వచ్చి పశువులకు చికిత్స నిర్వహించిన ఫలితం లేకుండా పోయింది. మరో 50 పశువుల పరిస్థితి విషమంగా ఉంది. దీంతో తండాలో విషాదచాయలు అలుముకున్నాయి. రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. చనిపోయిన వాటిలో 30 ఆవులు, 16 ఎడ్లుతో పాటు బర్రెలు, గొర్రెలు ఉన్నాయి.

ఎవరెవరితో జత కడతారో?

రాష్ట్రంలో మొదలైన కూటముల సందడి

- **బీఎల్ఎఫ్‌లో సీపీఎం చేరికకు సీపీఐ నిరాకరణ**
- **కోదండరాంతో దోస్తీకి పార్టీల యత్నాలు**
- **కాంగ్రెస్, టీడీపీతో జట్టుకు సీపీఐ రెడీ**

హైదరాబాద్, జనవరి 26(మనం ప్రతినిధి): సాధారణ ఎన్నికలు సమీపిస్తుండడం, ముందస్తుకైనా తాము సిద్ధమంటూ అధికార పార్టీ నేతల ప్రకటనలతో రాష్ట్రంలోని వివిధ రాజకీయపార్టీలు అలర్ట్ అవుతున్నాయి. రాష్ట్రంలో కూటములు సందడి మొదలయ్యింది. టీఆర్ఎస్‌ను గద్దె దించడమే ప్రతిపక్ష, వామపక్ష పార్టీల ప్రధాన లక్ష్యం అన్నది బహిరంగ రహస్యం. అయితే కాంగ్రెస్, టీఆర్ఎస్ దొందూదొందే.. రాష్ట్రంలో ప్రత్యామ్నాయ రాజకీయం అవసరమని కొన్ని పార్టీలు భావిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే ప్రధాన కమ్యూనిస్టు పార్టీలైన సీపీఐ, సీపీఎం మధ్య అంతరం పెరుగుతోంది. ఇప్పటికే 21 పార్టీలు, ప్రజాసంఘాలతో కలిసి సీపీఎం బహుజన లెఫ్ట్ ఫ్రంట్‌ను ఏర్పాటు చేసింది. సామాజిక ఉద్యమకారుడు ప్రొఫెసర్ కంచ ఐల య్య నేతృత్వంలోని టీ మాస్, ప్రజాయుద్ధనౌక గద్దర్ వంటివారు బీఎల్ఎఫ్‌కు మద్ధతు ప్రకటించారు. వచ్చే ఎన్నికల్లో బీఎల్ఎఫ్ అనుబంధంగా 119 సీట్లలో పోటీ చేస్తామని ఫ్రంట్ కన్వీనర్ తమ్మినేని వీరభద్రం ఇప్పటికే ప్రకటించారు. సీపీఐ కూడా మాతో కలిసి రావాలని సీపీఎం అంటుంటే, మీరే మాతో రండని సీపీఐ అంటోంది. రెండ్రోజుల క్రితం సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డితో భేటీ అయ్యారు. బీఎల్ఎఫ్‌లో భాగస్వాముల వ్వాలని ఏచూరి కోరగా, సురవరం తిరస్కరించినట్టు సమాచారం. బీఎల్ఎఫ్‌తో ప్రభుత్వ వ్యతిరేక ఓట్లు చీలి టీఆర్ఎస్‌కు లాభం చేకూరుతుందని సీపీఐ భావిస్తుండడం, సీపీఎం, సీపీఐల మధ్యనున్న అంతర్గత ఆధిపత్యపోరు ఈ తిరస్కరణకు కారణమంటున్నారు.

సీపీఐ సొంత కూటమి !

బీఎల్ఎఫ్ మాదిరిగా ప్రజాతంత్ర, లౌకిక, వామపక్ష శక్తులతో తాము ఓ కూటమిని ఏర్పాటు చేస్తామని సీపీఐ ప్రకటించింది. అయితే సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ మినహా సీపీఐ చెబుతున్న లౌకిక, వామపక్ష శక్తులన్నీ దాదాపు బీఎల్ఎఫ్‌లో చేరిపోయాయి. ఇక కూటమి ఎవరితో ఏర్పాటు చేస్తారని సీపీఎం నేతలు ప్రశ్నిస్తున్నారు. కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకోకూడదని ఇటీవల సీపీఎం అధిష్టానం నిర్ణయించింది. కానీ సీపీఐ తాము ఏర్పాటు చేయబోయే కూటమిలో కాంగ్రెస్‌ను ముందుంచాలని భావిస్తోంది. రాష్ట్ర బీజేపీ నేతలు తాము ఒంటరిగానే బరిలోకి దిగుతామని ప్రకటిస్తుండడంతో, టీడీపీని కూటమిలోకి తీసుకురావాలని యోచిస్తోంది. కమ్యూనిస్టులు గతంలో టీడీపీతో పొత్తు పెట్టుకున్న సంగతిని వారు ఇప్పుడు నెమరేస్తున్నారు. గత ఎన్నికల్లో టీఆర్ఎస్ గాలిలో కూడా టీడీపీకి 19.5 శాతం ఓట్లు పడ్డాయి. 2014 ఎన్నికల్లో ఆ పార్టీ నుంచి గెలిచిన 15 మంది ఎమ్మెల్యేల్లో బీసీ ఉద్యమ నేత ఆర్ కృష్ణయ్య, సండ్ర వెంకటవీరయ్య తప్ప 12 మంది టీఆర్ఎస్‌లో చేరగా, రేవంత్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరారు. ప్రధాన నేతలు పార్టీ మారినప్పటికీ టీడీపీకి బలమైన కేడర్ ఉందని సీపీఐ నేతలు నమ్ముతున్నారు. టీడీపీ తమతో కలిసివస్తే కనీసం 5-10 శాతం



ఓట్లు కూటమికి దక్కుతాయని సీపీఐ భావిస్తోంది.

కోదండరాం దోస్తీకి పోటీ

సీపీఐ, కాంగ్రెస్‌తో దోస్తీ కోరుకుంటుంటే, కాంగ్రెస్ మాత్రం టీజేఏసీ చైర్మన్ కోదండరాం దోస్తి కోరుకుంటోంది. ఆయన తమతో కలిస్తే ఉద్యమకారుల ఓట్లు, యువత, విద్యార్థుల ఓట్లు పడతాయని గట్టిగా నమ్ముతోంది. అంతేకాక మరో పక్క రేవంత్ టీడీపీ, కాంగ్రెస్‌తో కలవాలని చూస్తున్నారు. ఏపీలో టీడీపీ-బీజేపీ పొత్తు విషయంపై స్పష్టత వస్తే కానీ రాష్ట్రంలో టీడీపీ పయనం ఏటో తెలియదు. కాగా, కాంగ్రెస్ నేతలు మాత్రం కుదిరితే ఒకటో, రెండో సీట్లిచ్చి సీపీఐతో పొత్తుపెట్టుకుంటాం తప్ప కూటమిలో చేరే అవకాశాలు లేవంటున్నారు. మరో పక్క బీసీ ఉద్యమ నేత ఆర్.కృష్ణయ్యను తమతో కలుపుకుంటే బీసీల ఓట్లు దక్కుతాయని సీపీఐ నేతలు భావిస్తున్నారు. కూటమి ఏర్పాటు విషయంలో కోదండ రాం ఇప్పటికే కృష్ణయ్యతో చర్చించినట్టు సమాచారం. సీపీఐ కూటమిలో చేరేందుకు కాంగ్రెస్ విముఖత చూపితే సీపీఐ, బీఎల్ఎఫ్‌తో కలిసే అవకాశముందుని విశ్లేషకులు భావిస్తున్నారు..

2014 ఎన్నికల్లో వివిధ పార్టీ ఓట్ల శాతం

టీఆర్ఎస్-34
ఏఐఎంఐఎం-3.7
కాంగ్రెస్-25
టీడీపీ-19.5
సీపీఎం-1.5
సీపీఐ-0.9
బీజేపీ-7
ఇతరులు-8.4

కోదండరాం కూటమిలోకొస్తారా!

టీజేఏసీ చైర్మన్ కోదండరాం వారం రోజుల క్రితం సీపీఐ నేత సురవరం సుధాకర్‌రెడ్డిని కలిసినప్పుడు కూటమి విషయమై చర్చించినట్టు సమాచారం. సీపీఐ కూటమిలో చేరేందుకు కోదండరాం సిద్ధంగా ఉన్నా కాంగ్రెస్‌తో కలిసే విషయంలో ఆయన సందిగ్ధంలో ఉన్నారు. ఒకవేళ కలిస్తే టీఆర్ఎస్ ఆరోపిస్తున్నట్టు రెడ్డి సామాజిక వర్గాన్ని అధికారంలోకి తీసుకొచ్చేందుకే కోదండరాం ఇదంతా చేశాడన్న అపవాదు మీదపడుతుందని ఆయన భావిస్తున్నారు. బీఎల్ఎఫ్‌లో కోదండరాంను కలుపుకునేందుకు గద్దర్ ద్వారా సీపీఎం యత్నిస్తోంది. ఇలా వామపక్షాలు వేటికవే ప్రయత్నాలు చేస్తున్నాయి. అయితే సీపీఐ కూటమిలో చేరేదెవరో, లేదా సీపీఐ ఎవరితో జతకడుతుందో తెలియాలంటే కొంత కాలం వేచి చూడాల్సిందే.

రాజకీయ కక్షతో హత్యలు సిగ్గుచేటు


- **శ్రీనివాస్ హత్యకు ప్రభుత్వానిదే బాధ్యత**
- **టీపీసీసీ చీఫ్ ఉత్తమ్ కుమార్‌రెడ్డి**
- **కేసును సీబీఐకి అప్పగించాలి: జానారెడ్డి**
- **నల్గొండ నుంచే కేసీఆర్ పతనం: వీహెచ్**
- **దోషులను శిక్షిస్తేనే శాంతి: కోమటిరెడ్డి**



నల్లగొండ, జనవరి 26(మనం ప్రతినిధి): రాజకీయ కక్షతో హత్యలు చేయడం సిగ్గుచేటని తెలంగాణ పీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. నల్లగొండ మునిసిపల్ చైర్‌పర్సన్ భర్త బొడ్డుపల్లి శ్రీనివాస్ హత్యకు గురైన విషయం తెలిసిందే. వారి కుటుంబాన్ని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సహా పలువురు నేతలు శుక్రవారం పరామర్శించారు. అనంతరం ఉత్తమ్‌కుమార్ రెడ్డి విలేకరులతో మాట్లాడారు. శ్రీనివాస్ హత్యను కాంగ్రెస్ పార్టీ సీరియస్‌గా తీసుకుంటుందన్నారు. తనకు రక్షణ కల్పించాలని శ్రీనివాస్ ముఖ్యమంత్రిని కోరినా నిర్లక్ష్యం చేశారని, అందుకు ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలన్నారు. శ్రీనివాస్ హత్యకు నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశమే కారణమని ఆయన ఆరోపణ చేశారు. ఆరు నెలలుగా అనేక సార్లు బెదిరింపులు వచ్చినట్లు శ్రీనివాస్ భార్య లక్ష్మి చెప్పారని, గన్‌మెన్ ఏర్పాటుకు ఎందుకు అనుమతి ఇవ్వలేదని ఆయన ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈ కేసు విచారణను సీబీఐకి అప్పగించాలని ఆయన డిమాండ్ చేశారు. సీఎల్పీ నేత కుందూరు జానారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ ఆగడాలను ఎండగడుతున్నాడనే కారణంతో శ్రీనివాస్‌ను హత్య చేశారని ఆరోపించారు. పార్టీ మారాలని రెండు మూడు నెలల నుంచి బెదిరిస్తున్నారని, ఆ బెదిరింపుల వాయిస్ రికార్డులు బయట పెట్టాలని, బెదిరించిన వాయిస్ ఎమ్మెల్యే వీరేశందా.. కాదా... తేల్చాలని డిమాండ్ చేశారు. నిష్పక్షపాత విచారణ కోసం కేసును సీబీఐకి అప్పగించాలన్నారు. టీఆర్ఎస్ పార్టీ ఆగడాలను అరికట్టాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వం వాస్తవాలను వెలికితీస్తుందనే నమ్మకం లేదన్నారు. బొడ్డుపల్లి లక్ష్మి కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామన్నారు. మాజీ మంత్రి షబ్బీర్ ఆలీ మాట్లాడుతూ పోలీసుల, ప్రభుత్వ అండతోనే శ్రీనివాస్ హత్య జరిగిందని ఆరోపించారు. టీఆర్ఎస్ పార్టీని ప్రజలు తరిమికొట్టే రోజులు దగ్గరలో ఉన్నాయన్నారు. సీనియర్ నాయకులు వి.హనుమంత్‌రావు మాట్లాడుతూ శ్రీనివాస్‌ను పార్టీ మారాలని రాజగోపాల్‌రెడ్డి ఎమ్మెల్సీ ఎన్నికలప్పటి నుంచి బెదిరిస్తున్నారని, చివరకు హత్యచేశారన్నారు. జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలంగా ఉందని, రాబోయే ఎన్నికల్లో తమను ఎదుర్కోలేక రాజకీయ హత్యలకు పాల్పడుతున్నారని అన్నారు. నయీం, ఎమ్మెల్యే వీరేశానికి దగ్గర సంబంధాలు ఉన్నాయని, నయీంకు ఒక న్యాయం, వీరేశానికి ఒక న్యాయమా అని ఆయన ప్రశ్నించారు. కేసీఆర్ పతనం నల్లగొండ నుండే ప్రారంభమవుతుందన్నారు. సీఎల్పీ ఉపనేత, స్థానిక శాసన సభ్యుడు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ హత్య వెనుక అధికార పార్టీ ప్రమేయం ఉందన్నారు. డీఎస్పీని ఇక్కడకు తీసుకొచ్చి అరాచకం సృష్టిస్తున్నారని, ఈ హత్యకు ప్లాన్ చేసింది డీఎస్పీనేనని ఆయన ఆరోపించారు. ఆరేళ్ల క్రితం నా కొడుకు చనిపోయినప్పుడు సగం చచ్చి ప్రజల కోసం బతుకుతున్నానని, ఇప్పుడు నా ప్రాణానికి ప్రాణం, తమ్ముడు లాంటి శ్రీనివాస్‌ను చంపారని, హంతకులు ఊట్కూరు గ్రామంలో ఉన్నారని సమాచారం ఉందన్నారు. హత్యలు చేయాలనుకుంటే ఎవరు మిగలరని, మా పద్ధతి అదికాదని, దోషులను శిక్షిస్తే శ్రీనివాస్ కుటుంబానికి శాంతి కలుగుతుందన్నారు. ఆ కుటుంబం కోసం నా ప్రాణాలు ఇస్తా, ముఖ్యమంత్రికి చిత్తశుద్ధి ఉంటే క్రిమినల్ చర్యలకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోమటి రెడ్డి డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ కసిరెడ్డి నారాయణరెడ్డి, మాజీ శాసన సభ్యులు చిరుమర్తి లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎందుకిలా ?

- కేంద్రం రెండు నాలుకల ధోరణి!
- పద్మ పురస్కారాల్లో రాష్ట్రానికి మొండిచెయ్యి
- గణతంత్ర వేడుకల్లో శకటానికి దక్కని చోటు



హైదరాబాద్, జనవరి 26 (మనం ప్రతినిధి): తెలంగాణ రాష్ట్రం పట్ల కేంద్ర ప్రభుత్వం రెండు నాలుకల ధోరణి అవలంభిస్తుందని పలువురు విమర్శలు చేస్తున్నారు. కేంద్ర మంత్రుల నుంచి ప్రధాని వరకు తెలంగాణ రాష్ట్రంపై ఓ వైపు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. కానీ మరో పక్క రాష్ట్రాన్ని అవమానపరిచే విధంగా వ్యవహరిస్తుడడం విమర్శలకు తావిస్తోంది. వివిధ రంగాల్లో అత్యంత ప్రతిభ కనబరిచిన వారికి కేంద్రం ప్రభుత్వం ప్రతి ఏటా పద్మ పురస్కారాలు ప్రకటిస్తుంది. ఈ సారి పద్మ పురస్కారాలకు 85 మంది ఎంపికయ్యారు. ఈ ఏడాది అవార్డుకు ఎంపికైన వారిలో తెలంగాణ నుంచి ఒక్కరుకూడా లేరు. 2015లో రాష్ట్రానికి చెందిన ముగ్గురికి, 2016లో ఆరుగురికి, 2017లో ఆరుగురికి పద్మశ్రీ పురస్కారాలు దక్కాయి. పద్మ అవార్డులకు తెలంగాణ నుంచి చేసిన సిఫార్సులను కేంద్రం పట్టించుకోలేదని పలువురు ఆరోపిస్తున్నారు. భారతరత్నకోసం మాజీ ప్రధాని పీవీ నరసింహారావుతో పాటు పద్మ విభూషణ్ కోసం తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ పేర్లను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిందని సమాచారం. పద్మ అవార్డులకు తెలంగాణ ప్రభుత్వం 25 పేర్లను నామినేట్ చేసినట్టు తెలిసింది. ఆర్థికవేత్త చెన్నమనేని హనుమంతరావు, కవి, నవలా రచయిత ప్రొఫెసర్ శివ్ కె.కుమార్, గోరేటి వెంకన్న, అందెశ్రీ, విద్యావేత్త చుక్కా రామయ్య, సినీ రచయిత సుద్దాల అశోక్‌తేజ, పీవీ సింధు తదితర పేర్లను రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది ప్రతిపాదించింది. రాష్ట్రం నుంచి ఎంతో మంది ప్రముఖులున్న ప్పటికీ కేంద్రం అవార్డుల విషయంలో మొండిచేయి చూపిందని ప్రజలు భావిస్తున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి ఒకేఒక్క వ్యక్తికి అవార్డు ప్రకటించడం కేంద్రానికి తెలుగురాష్ట్రాలపై ఉన్న వివక్షకు నిదర్శనమని పలువురు అంటున్నారు. పలువురు విదేశీయులకు కూడా అవార్డుల ప్రకటించిన కేంద్ర ప్రభుత్వానికి తెలంగాణాలో ప్రతిభావంతులు కనిపించకపోవడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. అవార్డుల విషయంలో కేంద్రాన్ని ప్రశ్నించ డంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమవుతుందని ప్రతిపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. అంతేకాక ఢిల్లీలో జరిగే గణతంత్ర వేడుకల్లో తెలంగాణ శకటానికి అనుమతి ఇచ్చే విషయంలోనూ కేంద్రం రాష్ట్రానికి సహకరించడంలేదు. మూడేళ్లుగా తెలంగాణ రాష్ట్ర శకటానికి గణతంత్ర వేడుకల్లో అవకాశం దొరకలేదు. ఏదిఏమైనా కేంద్రం అనుసరిస్తున్న తీరుపై తెలంగాణ ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వీసాలో లాటరీ వద్దు

- **ప్రతిభావంతులకే ఇద్దాం**
- **అమెరికా సెనేట్‌లో ట్రంప్ బిల్లు**

వాషింగ్టన్, జనవరి 26: అమెరికాకు వచ్చే నిపుణుల విషయంలో ఇకపై లాటరీ పద్ధతి అవలంబించకూడదని, ప్రతిభావంతులకే వీసాలు మంజూరు అయ్యేలా ఓ బిల్లును అమెరికా సెనెట్‌లో శుక్రవారం డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఈ బిల్లు ఆమోదం పొందితే దశాబ్దాలుగా గ్రీన్ కార్డు కోసం ఎదురుచూస్తున్న వేలాది మంది భారతీయులకు లబ్ధి చేకూరనుందని నిపుణులు పేర్కొంటున్నారు. మరోవైపు, హెచ్1బీ వీసాల సంఖ్యను పెంచాలని కోరుతూ సెనేట్‌లో బిల్లు ప్రవేశపెట్టారు. ప్రతిభావంతుల్ని అమెరికాకు రప్పించాలనే లక్ష్యంతో ఇద్దరు రిపబ్లికన్ సెనేటర్లు ఓర్రిన్ హాచ్, జెఫ్ ఫ్లేక్ ఇమ్మిగ్రేషన్ ఇన్నోవేషన్ యాక్ట్ 2018 పేరుతో బిల్లును ప్రవేశపెట్టారు. ఈ బిల్లు ప్రకారం హెచ్1బీ వీసాదారుల జీవిత భాగస్వాములకు, పిల్లలకు వర్క్ పర్మిట్ కల్పించాలని కోరుతున్నారు. ఈ వీసాదారులు ఉద్యోగాలు మారేందుకు తగిన సమయం కల్పించాలని భావిస్తున్నారు. ఈ బిల్లుకు మైక్రోసాఫ్ట్, ఫేస్‌బుక్ సహా అమెరికాలోని పలు ప్రముఖ ఐటీ కంపెనీలు, అమెరికా ఛాంబర్ ఆఫ్ కామర్స్, ఐటీ ఇండస్ట్రీ కౌన్సిల్ సహా పలు వాణిజ్య సంఘాలు మద్దతిస్తున్నాయి. ఈ బిల్లులో హెచ్1బీ వీసాల సంఖ్యను 65వేల నుంచి 85వేలకు పెంచాలని ప్రతిపాదించారు.


క్షమాపణ చెప్పిన ట్రంప్..

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ క్షమాపణలు చెప్పారు. ప్రపంచ ఆర్థిక సదస్సు ముగింపు ప్రసంగం ఇచ్చేందుకు ఆయన దావోస్ వెళ్లారు. అక్కడ బ్రిటన్‌కు చెందిన ఓ మీడియా ఛానెల్‌కు ఇచ్చిన ముఖాముఖీలో ఆయన మాట్లాడుతూ ఇటీవల ముస్లిం వ్యతిరేక వీడియోలను రీట్వీట్ చేసినందుకు గాను క్షమాపణలు కోరారు. వాళ్లు నిజంగా జాత్యాంహకార ప్రజలయితే.. ఆ వీడియోలు రీట్వీట్ చేసినందుకు గాను క్షమాపణలు చెబుతానని ట్రంప్ ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. బ్రిటన్ ఫస్ట్ అనే జాతీయవాద గ్రూపు డిప్యూటీ లీడర్ జైడా ఫ్రాన్సెస్ నవంబరు నెలలో తన ట్విటర్ ఖాతాలో మూడు వీడియోలను పోస్టు చేశారు. ముస్లిం వలసదారులు ఓ చిన్నారిని కొట్టడం, వర్జిన్ మేరీ విగ్రహాన్ని ధ్వంసం చేయడం, ఓ టీనేజీ కుర్రాడిని ముస్లిం యువత కొట్టి చంపడం.. ఇవి ఆ మూడు వీడియోల సారాంశాలు. ఆమె చేసిన ఈ వీడియోలను ట్రంప్ తన ట్విటర్ ఖాతా నుంచి రీట్వీట్ చేశారు. అప్పట్లో ఈ విషయం వివాదాస్పదమైంది. అటువంటి వీడియోలను ట్రంప్ తన ట్విటర్ ఖాతాలో రీట్వీట్ చేసి వాటికి ప్రచారం కల్పించడం ఎంతమాత్రం సరికాదని బ్రిటన్ ప్రధాని థెరిసా మే విమర్శించారు. అనంతరం థెరిసా మే, ట్రంప్ మధ్య మాటల యుద్ధం కూడా జరిగింది. ఈ నేపథ్యంలోనే ట్రంప్ అప్పట్లో తన బ్రిటన్ పర్యటనను వాయిదా వేసుకున్నారు.



దావోస్ సదస్సులో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్





ఘనంగా గణతంత్రం







హైదరాబాద్, జనవరి 26(మనం ప్రతినిధి): భారత 69వ గణతంత్ర వేడుకలు తెలంగాణ వ్యాప్తంగా ఘనంగా జరిగాయి. రాజధానిలో గణతంత్ర దినోత్సవం సందర్భంగా సీఎం కేసీఆర్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ప్రగతి భవన్‌లో జాతీయ జెండాను ఎగరవేశారు. ప్రభుత్వ ప్రధాన సలహాదారు రాజీవ్ శర్మ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు. తెలంగాణ భవన్‌లో జరిగిన గణతంత్ర వేడుకలలో రాష్ట్ర హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, జాతీయ గీతాన్ని ఆలపించారు. రిపబ్లిక్ డే వేడుకల్లో డిప్యూటీ సీఎం మహమూద్ అలీతోపాటు పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు. తెలంగాణ శాసన మండలిలో చైర్మన్ స్వామి గౌడ్ జాతీయ జెండాను ఎగురవేశారు. డిప్యూటీ చైర్మన్ నేతి విద్యాసాగర్ రావు, డిప్యూటీ సిఎం మహమ్మద్ మహమూద్ అలీ తదితరులు పాల్గొన్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా శాసనసభ స్పీకర్ మధుసూదన చారి అసెంబ్లీ ఆవరణలోని మహాత్ముడి విగ్రహానికి పూలమాల వేసి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఏఐఎంఐఎం కార్యాలయంలో అసదుద్దీన్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. బీజేపీ కార్యాలయంలో పార్టీ నేతలు దత్తాత్రేయ, కిషన్‌రెడ్డి తదితరులు జెండా వందనం చేశారు. జెన్‌కో ఆవరణలో సీఎండీ ప్రభాకర్ రావు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. సీపీఐ రాష్ట్ర కార్యాలయంలో పార్టీ సీనియర్ నేత చాడ వెంకటరెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. గాంధీభవన్‌లో కాంగ్రెస్ సీనియర్ నేతల సమక్షంలో ఉత్తమ్ కుమార్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. సీపీఎం కార్యాలయంలో పార్టీ సీనియర్ నేత తమ్మినేని వీరభద్రం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. టీటీడీపీ అధ్యక్షుడు ఎల్.రమణ ఆధ్వర్యంలో గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. గణతంత్ర దినోత్సవం సందర్భంగా టీజేఏసీ చైర్మన్ కోదండరాం ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు.

అమరుల స్థూపం వద్దకు సీఎం

గణతంత్ర దినోత్సవం సందర్భంగా సీఎం కేసీఆర్ తెలంగాణ ప్రత్యేక ఉద్యమంలో ప్రాణత్యాగం చేసిన వారిని గుర్తుచేసుకున్నారు. అమరుల స్థూపం వద్ద నివాళులు అర్పించారు.





ఆర్టీసీ బస్సులో మంటలు

- మెదక్ జిల్లా కొల్చారం వద్ద ఘటన
- 48 మంది ప్రయాణికులు సురక్షితం



కొల్చారం, జనవరి 26 (మనం న్యూస్): బాన్సువాడ నుంచి హైదరాబాద్ బయలుదేరిన ఆర్టీసీ బస్సులో అకస్మాత్తుగా మంటలు రేగాయి. ఈ ప్రమాదంలో బస్సులో ఉన్న 48మంది ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. మెదక్ జిల్లా కొల్చారం బస్టాండ్ వద్ద శుక్రవారం ఉదయం ఈ ఘటన జరిగింది. బాన్సువాడ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు బాన్సువాడ నుంచి మెదక్ మీదుగా హైదరాబాద్ బయలుదేరింది. మార్గమధ్యంలో కొల్చారం బస్టాండ్ వద్ద బస్సు ఇంజన్‌లో నుంచి ఒక్కసారిగా మంటలు రేగాయి. అప్రమత్తమైన డ్రైవర్ బస్సును ఆపేయడంతో ప్రయాణికులంతా కిందికి దిగిపోయారు. స్థానికులు నీళ్లు పోసి మంటలను ఆపేశారు. ఇంజన్ రేడియటర్ నుంచి మంటలు వ్యాపించాయని డ్రైవర్ భూమేష్ తెలిపాడు. ఈ ప్రమాదంలో బస్సు ముందు సీట్లలో కూర్చొన్న ప్రయాణికుల సామానుతో పాటు కొంత నగదు కాలిపోయింది.



హైదరాబాద్‌లో గాంధీభవన్‌లో శుక్రవారం నిర్వహించిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో సరదా సన్నివేశం చోటుచేసుకుంది. మాజీ ఎంపీ సర్వే సత్యనారాయణ నవ్వుతూ మరో మాజీ ఎంపీ అంజన్ కుమార్‌యాదవ్ గొంతు పట్టుకుని ఇలా హల్‌చల్ చేశారు.

కేంద్ర మంత్రుల సరసన కేటీఆర్

- దావోస్‌లో మంత్రికి అపూర్వ గౌరవం..
- పరిశోధన రంగానికి మరింత ప్రాధాన్యం
- త్వరలోనే టీ-వర్క్స్ ఏర్పాటు
- సౌర విద్యుత్ రంగంలో ముందున్నాం
- వరల్డ్ ఎకనామిక్ ఫోరంలో కేటీఆర్



హైదరాబాద్, జనవరి 26(మనం ప్రతినిధి): దావోస్ సదస్సులో మంత్రి కేటీఆర్‌కు అపూర్వ గౌరవం దక్కింది. దావోస్‌లోని వరల్డ్ ఎకనామిక్ ఫోరం వార్షిక సమావేశంలో భాగంగా శుక్రవారం దేశాల ఉప ప్రధానులు, మంత్రులు పాల్గొన్న 'లివరజింగ్ డిజిటల్ టు డెలివర్ వాల్యూ టు సొసైటీ' అనే సెషన్లో కేటీఆర్ ప్రసంగించారు. ఈ సమావేశంలోని ప్యానెలిస్టులంతా ఆయా దేశాల కేంద్ర ప్రభుత్వాలకు ప్రాతినిధ్యం వహించగా, కేటీఆర్ మాత్రమే రాష్ట్ర మంత్రిగా ఉండి ఇందులో పాల్గొనే అవకాశం దక్కడం గమనార్హం. బెల్జియం, బ్రెజిల్, డెన్మార్క్, పోర్చుగల్, మయన్మార్,ఇండోనేషియా, నైజీరియా, లెబనాన్, బంగ్లాదేశ్, ఖతార్, పాకిస్తాన్ దేశాల మంత్రులు పాల్గొన్న సమావేశంలో డిజిటల్ తెలంగాణ కార్యక్రమం గురించి కేటీఆర్ వివరించారు. ఇందులో భాగంగా మిషన్ భగీరథతో పాటు ప్రతి ఇంటికీ ఫైబర్ ఆప్టిక్ కేబుల్ సౌకర్యం ఫైబర్-గ్రిడ్ ప్రాజెక్టు ద్వారా కల్పిస్తున్నామని, ప్రభుత్వ సేవలన్నీ డిజిటల్ మాధ్యమాల ద్వారా అందజేస్తున్నామని, డిజిటల్ అక్షరాస్యత కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నామని తెలిపారు.

దావోస్‌లో ఇన్వెస్ట్ ఇండియా ఆధ్వర్యంలో జరిగిన డెవలపింగ్ ఆర్‌డీ ఇన్ ఇండియా అంశంపై జరిగిన రౌండ్ టేబుల్ సమావే శంలో కేటీఆర్ మాట్లాడుతూ.. దేశంలో పరిశోధన రంగా నికి మరింత ప్రాధాన్యత పెరగాల్సిన అవకాశం ఉంద న్నారు. ఇందుకోసం దేశంలోని పరిశోధన సంస్థలు, ఉన్నత విద్యా సంస్థలు మరింత చొరవ తీసుకోవాలని మంత్రి అభి ప్రాయపడ్డారు. ప్రైవేటు రంగంలో పెద్ద సంస్థలు చేస్తున్న పరిశోధనలతో దేశంలోని అకడమిక్ రీసెర్చ్‌ని సమ్మిళితం చేసినప్పుడు మెరుగైన ఫలితాలు వస్తాయన్నారు. పరిశోధన కార్యక్రమాలతోపాటు పరిశోధనంతర ఫలితాల ఆధారంగా ప్రభుత్వ ప్రోత్సాహకాలు ఉండేలా చూడాలని కేంద్ర ప్రభు త్వాన్ని కోరారు. సిలికాన్ వ్యాలీలో గొప్ప విజయాలకు అక్కడి పరిశోధన సంస్థలే కారణమన్నారు.

హైదరాబాద్‌లో ఆర్ఐసీహెచ్..

హైదరాబాద్‌లో 50 పరిశోధన సంస్థలను అనుసంధానం చేస్తూ రీసెర్చ్ ఎండ్ ఇన్నోవేషన్ సర్కిల్ ఆఫ్ హైదరాబాద్(ఆర్ఐసీహెచ్) ఏర్పాటు చేశామని తెలిపారు. రీసెర్చ్ ఫలితాలు మార్కెట్లోకి రావడానికి రిచ్ సంస్థ కృషి చేస్తుందన్నారు. ఇస్రో లాంటి భారతీయ సంస్థలు తమ పరిశోధన పటిమను, సాంకేతిక సత్తాను ప్రపంచానికి చాటాయని, అతి తక్కువ ఖర్చుతో అత్యుత్తమ ఫలితాలు సాధించవచ్చని ఇస్రో విజయం నిరూపిస్తుందన్నారు. రానున్న రోజుల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు స్టార్టప్స్ నుంచే వస్తాయని, అందుకే తెలంగాణ ఈ రంగానికి ప్రాధాన్యమిస్తోందని మంత్రి కేటీఆర్ చెప్పారు. రీసెర్చ్ ఎండ్ డెవలప్‌మెంట్ రంగంలో ఆసక్తి గల కంపెనీలకు తెలంగాణ ఆహ్వానం పలుకుతుందన్నారు. పరిశోధనల పట్ల విద్యార్థులలో ఆసక్తి నెలకొల్పేలా, శాస్త్రీయ పరిశోధనల పట్ల వారిలో ఒక దృక్పథాన్ని పెంచే ప్రదర్శనశాలలు ఏర్పాటు చేయాలన్నారు. పరిశోధన ఫలితాలు, పేటెంట్లు, మేథో సంపత్తిని కాపాడేందుకు తెలంగాణ ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ క్రైమ్ యూనిట్ (టీఐపీసీయూ) ను ఏర్పాటు చేశామన్నారు. ప్రతి రాష్ట్రం ఈ నమూనాను ఏర్పాటు చేయాలని రాష్ట్రాలకు ఉత్తరాలు రాసామని చెప్పారు. అనంతరం కేంద్ర మంత్రి సురేష్ ప్రభుతో కేటీఆర్ భేటీ అయ్యారు.

సెల్స్‌ఫోర్స్ సీఈవోతో లంచ్..

కేటీఆర్ కోసం సెల్స్ ఫోర్స్ సీఈవో మార్క్ బేనియఫ్ దావోస్‌లో ప్రత్యేక లంచ్ ఏర్పాటు చేశారు. తెలంగాణ లాంజ్‌లో జరిగిన సమావేశంలో సెల్స్ ఫోర్స్ సంస్థ అధ్యక్షుడు అమీ వీవర్‌ని కలిశారు. ప్రముఖ పవన్ విద్యుత్ సంస్థ సుజ్లాన్ చైర్మన్ తులసి తంతితో ఏర్పాటుచేసిన సమావేశంలో సౌర విద్యుత్ ఉత్పాదనలో తెలంగాణ రాష్ట్రం ముందంజలో ఉందని కేటీఆర్ తెలిపారు. సౌర/పవన్ విద్యుత్ రంగంలో మరిన్ని పరిశోధనలు జరగాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణలో పవన విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు చేసేందుకు సుజ్లాన్ ఆసక్తిగా ఉన్నదని తులసి తంతి తెలిపారు. వ్యవసాయ రంగ బలోపేతంకోసం చేస్తున్న చర్యలతో విద్యుత్ డిమాండ్ పెరుగుతుందని, అందుకు తగ్గట్లుగా ఉత్పాదన పెరగాలని తంతి తెలిపారు. ఈ సందర్భంగా పవన విద్యుత్ రంగంలో తెలంగాణ ప్రభుత్వ పాలసీని కేటీఆర్ వివరించారు.

రాజ్యాంగం.. అంబేద్కర్ కానుక

- **విలువను కాపాడుకోవాలి: సురవరం**

హైదరాబాద్, జనవరి 26(మనం ప్రతినిధి): రాజ్యాంగాన్ని కాలరాసేందుకు, మార్చివేసేందుకు జరుగుతున్న ప్రయత్నాలను ప్రతిఘటించాలని సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. పౌరులకు రాజ్యాంగం కల్పించిన హక్కులను హిందుత్వ ఫాసిస్టు శక్తులు అణచివేస్తున్నాయని ఆయన ఆరోపించారు. హైదరాబాద్‌లోని సీపీఐ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన 69వ గణతంత్ర వేడుకల్లో సురవరం మాట్లాడుతూ.. రాజ్యాంగం దేశ భవిష్యత్తుకు దిక్సూచిగా నిలుస్తుందన్నారు. రాజ్యాంగాన్ని అంబేద్కర్ జాతికి ఇచ్చిన కానుకగా సురవరం అభివర్ణించారు. భారత్ సెక్యులర్ దేశంగా వెలుగొందాలని అభిలషించారు. మతవాదులు దేశ పునాదులను పెకిలించేందుకు చేస్తున్న ప్రయత్నాలను అడ్డుకోవాలని విజ్ఞప్తి చేశారు. దళితులు, మైనారిటీలపై గోరక్షణ పేరుతో సంఘ్‌పరివార్ శక్తులు దాడులకు పాల్పడుతున్నాయని సురవరం ధ్వజమెత్తారు. ఈ దాడులను మానవహక్కులు, భావప్రకటన స్వేచ్ఛపై జరుగుతున్న దాడులుగా పేర్కొన్నారు. రాజ్యాంగ విలువలను కాపాడుకునేందు పోరు సాగించాలన్నారు.

పాలల్లో కల్తీపై హైకోర్టులో పిల్

హైదరాబాద్, జనవరి 26: హైదరాబాద్ మహానగరంలో సరఫరా అవుతున్న పాలల్లో చాలా వరకు కల్తీవేనని ఒక పత్రికలో వచ్చిన కథనాన్ని హైకోర్టు ప్రజాహిత వ్యాజ్యంగా తీసుకుంది. నల్లగొండ నుంచి నర్సింహారావు రాసిన లేఖను హైకోర్టు పిల్ కమిటీ పరిశీలించి విచారణకు యోగ్యంగానే కథనం ఉందని నిర్ణయించింది. దాంతో తెలంగాణ రాష్ట్ర పశు సంవర్ధక, పాల ఉత్పత్తుల శాఖ ముఖ్య కార్యదర్శి, డెయిరీ డెవలప్‌మెంట్ కోపరేషన్ లిమిటెడ్ ఎండీ, నాచారంలోని రాష్ట్ర ఆహార భద్రతా శాఖ చీఫ్ పబ్లిక్ అనలిస్టలను ప్రతివాదులు చేశారు.

యాసంగిలో భద్రం

- చివరి ఆయకట్టుకూ నీరందాలి
- కాలువల వెంట సీఈలు పర్యవేక్షించాలి
- అవసరమైతే కలెక్టర్ల సాయం తీస్కోవాలి
- ఎలాంటి లోటుపాట్లు రావొద్దు
- మంత్రి హరీశ్‌రావు హెచ్చరిక



హైదరాబాద్, జనవరి 26 (మనం ప్రతినిధి): శ్రీరాంసాగర్, నాగార్జునసాగర్, నిజాం సాగర్ ప్రాజెక్టుల పరిధిలో యాసంగిలో చివరి ఆయకట్టుకూ సాగునీరు అందించాలని అధికారులకు మంత్రి హరీశ్‌రావు ఆదేశించారు. ఇందుకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. శుక్రవారం జలసౌధలో ఈ మూడు ప్రాజెక్టుల ఆయకట్టుకు జరుగుతున్న సాగునీటి సరఫరాపై మంత్రి సమీక్షించారు. కాలువల వెంట సీఈ, ఎస్ఈ, ఈఈలు, ఇతర సిబ్బంది నిరంతరం తిరగాలని, సాగునీటి సరఫరా తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించి, పర్యవేక్షించాలని సూచించారు. ఇందుకు జిల్లాకలెక్టర్ల సహకారం తీసుకోవాలని, రెవెన్యూ సిబ్బందితో సమన్వయంతో పని చేయాలని సూచించారు. నీరు అత్యంత విలువైనదని, చుక్క నీరు కూడా వ ధా పోకుండా ,అత్యంత పొదుపుగా వాడాలని అన్నారు. సాగునీటి క్రమబద్ధీకరణ వ్యవహారంలో ఎలాంటి లోటుపాట్లు జరిగినా ఈఈలదే బాధ్యతని, వారిపై చర్యలకు ప్రభుత్వం వెనుకాడబోదని హెచ్చరించారు. నీటిని వదిలినప్పుడు అప్రమత్తంగా ఉండాలని రాత్రీపగలూ పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈ మూడు ప్రాజెక్టుల ప్రధాన కాలువలకు ఆన్ అండ్ ఆఫ్ పద్ధతిలో సాగునీటిని సరఫరా చేస్తున్నందున దిగువనున్న రైతులకు నీరందించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని మంత్రి హరీశ్‌రావు సూచించారు. శ్రీరామ్ సాగర్ లోయర్ మానేరు డ్యామ్ ఎగువ, లోయర్ మానేరు డ్యామ్ దిగువ ప్రాంతాల్లో ఉన్న డిస్ట్రిబ్యూటరీలు, నిజాంసాగర్ ఎడమ కాలువకింద ఉన్న డిస్ట్రిబ్యూటరీలు, నిజాంసాగర్ కింద కాలువల పరిధిలోనూ ఆయకట్టుకు సాగునీటి సరఫరాపై క్షేత్ర స్థాయి పరిస్థితిని మంత్రి సమీక్షించారు. శ్రీరాంసాగర్, ఎస్ఆర్ఎస్పీ, ఎల్ఎండీ ఎగువ ప్రాంతాల్లో 4,07,417 ఎకరాలు, ఎల్ఎండీ దిగువ భాగాన 1,52,588 ఎకరాలు, నాగార్జునసాగర్ ఎడమ కింద 5,25,629 ఎకరాలు, నిజాంసాగర్ కింద 1,51,666 ఎకరాలకు ఈ యాసంగిలో తప్పనిసరిగా సాగునీరందించాలని మంత్రి ఆదేశించారు. సమీక్షా సమావేశంలో ఈఎన్సీ మురళీధరరావు, సీఈలు శంకర్, సునీల్, మధుసూదనరావు, ఎస్ఈ, ఈఈలు పాల్గొన్నారు.

మనం
జనం కోసం.. అక్షర యజ్ఞం..

శనివారం, జనవరి 27

ఢిల్లీ డిక్లరేషన్

భారత్-ఆసియాన్ (ఆగ్నేయాసియా దేశాల కూటమి) రజతోత్సవ సమ్మాన్ సదస్సు సముద్రతీర రక్షణ, అనుసంధానత, వాణిజ్యం తదితర అంశాలపై ఢిల్లీ డిక్లరేషన్ పేరిట గురువారం చారిత్రాత్మక ఒప్పంద ప్రకటన చేసింది. అంతర్జాతీయ చట్టాలకు లోబడి దక్షిణ చైనా సముద్ర ఒప్పందాన్ని అమలు చేయాలని ఆ సదస్సు తీర్మానించింది. ఉగ్రవాదుల స్థావరాలు, నెట్ వర్క్‌ను ధ్వంసం చేయడానికి ఆసియాన్ దేశాలన్నీ యంత్రాంగాన్ని ఏర్పాటు చేసుకొని సమర్థవంతంగా పరస్పర సహకారం అందించుకోవాలని భారత్- ఆసియాన్ దేశాధినేతలందరూ ఉమ్మడి అవగాహనకు వచ్చారు. భారత్-ఆసియాన్ రజతోత్సవ సమ్మాన్ స్టాంపులు విడుదలచేస్తూ సీమాంతర ఉగ్రవాదుల కదలికలను నియంత్రించడంతో పాటు ఇంటర్నెట్, సోషల్ మీడియా దుర్వినియోగాన్ని కలసికట్టుగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. ఆసియాన్ దేశాల అధినేతలు భారత్ గణతంత్ర వేడుకలకు రావడం విశేష ప్రాధాన్యం సంతరించుకుంది.

ఇప్పటిదాకా భారత్ అనుసరిస్తున్న 'తూర్పు దృక్పథం' (లుక్ ఈస్ట్) విధానం నుంచి 'తూర్పు కార్యాచరణ' (యాక్ట్ ఈస్ట్) విధానం వైపు మళ్లిన సమయంలో ఈ సదస్సు జరుగుతుండటం గమనార్హం. వ్యూహాత్మక ఆసియాన్ దేశాలతో వ్యూహాత్మక రంగాలైన వాణిజ్యం, తీరప్రాంత భద్రత, ద్వైపాక్షిక సంబంధాల విషయంలో కుదుర్చుకున్న ఒప్పందాల వల్ల ఆగ్నేయాసియాలో అత్యంత శక్తిమంతమైన మిత్రదేశంగా మారేందుకు భారత్‌కు ఈ సదస్సు ద్వారా అవకాశం లభించిందని నిపుణులు వ్యాఖ్యానిస్తున్నారు. అయితే ఇప్పటిదాకా ఆగ్నేయాసియా వ్యూహాత్మక వాతావరణంలో భారత్ పాత్ర క్రమంగా కనుమరుగవుతుండడాన్ని ఎవరూ మరవరాదు. 1947లో ఆసియా సంబంధాల మహాసభ నుంచి ఇటీవలి వరకు జరుగుతున్న ఆసియాన్ సదస్సుల దాకా ఆసియా భౌగోళిక కార్యకలాపాల్లో భారత్ హామీలను ఎన్నడూ నిలబెట్టుకోలేదన్నది విదితమే. 1950లలో ఆసియాలో చురుకైన పాత్ర పోషించాలని భారత్ ఉవ్విళ్లూరగా, 1960లలో అలాంటి ఆకాంక్షలను సైతం పక్కన బెట్టింది. ప్రపంచ ఆర్థిక సంక్షోభం కారణంగా అమెరికా ఏకధ్రువ ప్రపంచం చెదిరిపోయి, యూరోపియన్ యూనియన్ దేశాలు, రష్యా మద్దతుతో చైనా భౌగోళిక రాజకీయాల్లో సామ్రాజ్యవాద శక్తిగా దూసుకొస్తున్న తరుణంలో భారత్ ప్రాధాన్యం పెరిగింది. చైనా దూకుడుకు కళ్లెంవేసేందుకు 'ఆసియా దృక్పథం' అనే భౌగోళికార్థిక రాజకీయ వ్యూహంలో భాగంగా భారత్‌ను ప్రాంతీయ ఆర్థిక, రాజకీయ, సైనికశక్తిగా ఎదిగేందుకు అమెరికా విపరీతంగా ప్రో త్సహిస్తోంది. అమెరికా వ్యూహం మాట ఎలా ఉన్నా ప్రపంచ ఆర్థికశక్తిగా భారత్ ఎదగాలంటే చైనాతో పోటీపడక తప్పదు. అమెరికా వంటి అభివృద్ధి చెందిన దేశాలకు అంతర్జాతీయంగా సింహస్వప్నమైన చైనాతో భారత్ ఒంటరిగా పోటీపడడం అసాధ్యం. ఈ నేపథ్యంలో అమెరికా అగ్రరాజ్యం అందిస్తున్న సహకారాన్ని నేర్పుతో వినియోగించుకొని పురోగతి సాధించాలి. ఏమాత్రం అప్రమత్తత కొరవడినా అమెరికా అనుబంధ ఆర్థిక వ్యవస్థగా మారి ఆర్థిక స్వావలంబనను, సార్వభౌమత్వాన్ని భారత్ పూర్తిగా కోల్పోయే ప్రమాదం ఉంది.

గతంలో సోవియట్ రష్యాతో విభేదాలేర్పడి అనేక అభివృద్ధి ప్రాజెక్టులు, పరిశ్రమల నిర్మాణం సగంలో ఆగిపోయినపుడు అమెరికా సహాయంతోనే చైనా మళ్లీ పుంజుకున్న అనుభవాన్ని భారత్ దృష్టిలో ఉంచుకోవాలి. అదేవిధంగా రెండవ ప్రపంచ యుద్ధంలో అణుదాడికి గురై ఆర్థికవ్యవస్థ పూర్తిగా కుదేలైన జపాన్ కూడా అమెరికా-సోవియట్ రష్యాల మధ్య సాగిన ప్రచ్ఛన్నయుద్ధ కాలంలో అమెరికా సహకారంతో 1980ల నాటికి ప్రపంచంలోనే తిరుగులేని ఆర్థికశక్తిగా ఎదిగింది. 2008లో ఏర్పడిన ప్రపంచ ఆర్థిక సంక్షోభంతో మారిన భౌగోళిక రాజకీయార్థిక సంబంధాల నేపథ్యంలో అమెరికా సహకారం రూపంలో లభించిన ఈ అవకాశాన్ని భారత్ ఒడుపుగా సద్వినియోగం చేసుకుంటే ఒక ప్రపంచశక్తిగా ఎదగొచ్చు. అయితే పాకిస్థాన్‌లాగా పరాన్నభుక్కుగా మారడమా, జపాన్, చైనాల వలె ప్రబల ఆర్థికశక్తులుగా దూసుకెళ్లడమా అన్నది మన పాలకుల రాజకీయార్థిక దృక్కోణంపై ఆధారపడి ఉంటుంది. ఆగ్నేయాసియాలో వ్యూహాత్మక వాణిజ్య, భౌగోళిక రాజకీయ సమీకరణలు, తీరప్రాంత భద్రత, దక్షిణ చైనా సముద్ర వాణిజ్య కార్యకలాపాలపై పట్టు వంటి అంశాల్లో ఇండియా చురుకైన పాత్ర పోషించవలసిన అవసరం ఉంది. 2020 నాటికి రెండు లక్షల కోట్ల డాలర్ల వాణిజ్యం లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ ఆ వైపుగా అడుగులు వేయడంలో భారత్ బాగా వెనుకబడి ఉంది. మయన్మార్ నుంచి థాయిలాండ్‌కు త్రిముఖ రహదారుల నిర్మాణ పథకం లక్షించిన గడువు పూర్తి కావస్తున్నా ఒక్క అడుగు ముందుకు వేయలేదు. అదేకాకుండా ఆసియాన్ దేశాలతో అనుసంధానమయ్యే ప్రాజెక్టులేవీ మొదలు కాకపోవడం పాలకుల అలసత్వానికి నిదర్శనం. ఆగ్నేయాసియా ప్రాంత దేశాలతో తీర ప్రాంత, రక్షణ మరింత లోతైన, విస్తృతమైన భాగస్వామ్యం కోసం భారత్ ప్రయత్నాల్లో భాగంగా డిక్లరేషన్ సాకారమైంది. పాలసీ జడత్వం, అధికార స్వామ్యం ఒక జాడ్యంగా కొనసాగుతున్న నేపథ్యంలో ఈ డిక్లరేషన్ లక్ష్యాలను మోదీ ప్రభుత్వం ఏ మేరకు సాధించగలదో చూడాలి.

పద్మ పురస్కారాల మేళ!

గతంలో అనుసరించిన విధానానికి భిన్నంగా ఈసారి పద్మ అవార్డులను కేంద్రం ఎంపికచేసింది. గతంలో రాజకీయనాయకులు, ఆయా రాష్ట్రప్రభుత్వాలు మాత్రమే పద్మ అవార్డు ఎంపికకు నామినేషన్‌లు పంపే అవకాశం ఉండగా ఈసారి 'అజ్ఞాత ధీరోదాత్తుల' (అన్‌సంగ్ హీరోస్) పేర్లను ఎవరైనా నామినేట్ చేసే అవకాశం కల్పిస్తున్నట్టు ప్రధాని నరేంద్ర మోదీ ఆమధ్య నీతి ఆయోగ్ ఏర్పాటుచేసిన సమావేశంలో ప్రసంగిస్తూ తెలిపారు. ఆ మేరకు మొత్తం 15,700 నామినేషన్లు రాగా 85 మందికి పద్మ అవార్డులు కేంద్రం ప్రకటించింది. ముగ్గురికి పద్మవిభూషణ్, తొమ్మిదిమందికి పద్మభూషణ్, 73 మందికి పద్మశ్రీ పురస్కారాలు ప్రకటించారు. అత్యధిక పురస్కారాలు మహారాష్ట్రకు దక్కగా, రెండోస్థానంలో కర్ణాటక ఉంది. అలాగే, 14 మంది విదేశీయులు కూడా ఉన్నారు. పద్మవిభూషణ్ పొందిన వారిలో ప్రఖ్యాత చలనచిత్ర సంగీత దర్శకుడు ఇళయరాజా, హిందుస్థాన్ సంగీత విద్వాంసుడు గులాం ముస్తాఫా ఖాన్ ఉన్నారు. పద్మభూషణ్ పురస్కారాలు పొందినవారిలో క్రికెట్ దిగ్గజం ఎంఎస్ ధోనీ ఉన్నారు. కాగా, పద్మ అవార్డుల ఎంపికలో తెలుగురాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ పట్ల కేంద్రం చిన్నచూపు చూసిందనే చెప్పాలి. తెలంగాణకు ఒక్క అవార్డు కూడా లభించలేదు.

ఈసారి పద్మ అవార్డుల ఎంపికలో త్వరలో ఎన్నికలు జరగనున్న రాష్ట్రాల వైపే కేంద్రం మొగ్గుచూపింది. మధ్యప్రదేశ్, కర్ణాటక, రాజస్థాన్‌ల్లో ఎన్నికలు జరగనున్నాయి. ఓటర్లను ఆకర్షించేందుకే పద్మ పురస్కారాల పేరిట కేంద్రం యోచించిందని విమర్శలు వినిపిస్తున్నాయి. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి చెరో 25 మంది పేర్లను ఆయా ప్రభుత్వాలు నామినేట్ చేశాయి. వారిలో విఖ్యాతులైన వారున్నారు. రాష్ట్రాల నుంచి నామినేషన్ పొందిన వారిలో పీవీ నరసింహారావు, ప్రొఫెసర్ జయశంకర్, సుద్దాల అశోక్ తేజ, పీవీ సింధు, కూచిపూడి నాట్యాచార్యుడు ఆనంద్ శంకర్ జయంతి తదితరులున్నారు. వీరిలో ఒక్కరిని కూడా అర్హులుగా కేంద్రం భావించలేదు. ఆంధ్రప్రదేశ్‌కు బిచ్చం విదిల్చినట్టు ఒక పద్మశ్రీ పురస్కారం ప్రకటించి, తెలంగాణకు ఆ విదిలింపు కూడా లేకుండా చేసింది. ఇలా పద్మ పురస్కారాల ఎంపికలో కూడా రాజకీయాల ఆరోపణలు రావడం దురదృష్టకరం. ఈసారి పద్మ పురస్కారాల్లో ఇన్నాళ్లూ నోచుకోని వారికి తగిన గౌరవం ఇస్తామని ప్రకటించిన కేంద్రం ఆ దిశలోనే సామాజిక సేవ చేస్తున్న సమర్థులకే చోటు కల్పించడం అభినందనీయమే అయినప్పటికీ చంద్రుడిలో మచ్చలా రాజకీయ ఆరోపణలకు అవకాశం లేకుండా జాగ్రత్తపడితే సబబుగా ఉండేది.



మంచిమాట



'ఇవాళ కూర్చున్న చెట్టునీడ ఎప్పుడో ఎవరో ఒకరు నాటిన మొక్క నుంచి వచ్చిందే!'

- వారెన్ బఫెట్


చైనాతో స్నేహం సాధ్యమే!



జి. రాజశుక

సచేతన

భవిష్యత్తులో చైనాతో సత్సంబంధాలు సాధ్యమేనా? చైనా ఏదో ఒక రోజున పాకిస్థాన్‌ను దూరం నెట్టి భారత్ మైత్రీ హస్తాన్ని అందుకుంటుందా? ప్రస్తుతం చైనా పోకడలను బట్టి చూస్తే ఇదంతా సమీప భవిష్యత్తులో సాధ్యం కాకపోవచ్చని, పైగా చైనా తన కయ్యానికి కాలుదువ్వే ధోరణిని మార్చుకోకపోగా, భారత్‌పై దాడి చేయడానికే అవకాశం ఉందని కొందరు సంశయాత్ములు ఘంటా బజాయించి చెబుతున్నప్పటికీ, నరేంద్ర మోదీ హయాంలోనే చైనాతో మైత్రికి అవకాశాలున్నాయని భారత్-చైనా సంబంధాల విశ్లేషకులు గట్టిగా వాదిస్తున్నారు. భారత్, చైనాల మధ్య ఉన్న సరిహద్దు సమస్యల పరిష్కారం దిశగా ఈ రెండు దేశాలు ఒక్క అడుగు ముందుకు వేయగలిగినా చైనాతో పూర్వపు మైత్రి మళ్లీ ఊపందుకుంటుందని, పాకిస్థాన్‌ను పక్కన పెట్టేయడానికి చైనా ఒక్కక్షణం కూడా వెనుకాడదని వారు చెబుతున్నారు.



వాస్తవానికి, చైనాకు సంబంధించినంత వరకూ భారత్ ఓ అడకత్తెరలో చిక్కుకుని ఉంది. ఒక పక్క అమెరికా, బ్రిటన్, జపాన్ వంటి దేశాలు ఆసియా ఖండంలో భారత్‌ను ఓ కేంద్ర బిందువుగా, ఓ తిరుగులేని శక్తిగా అభివృద్ధి చెందించాలని భావిస్తున్నాయి. చైనాతో భారత్ ఏదోవిధంగా తలపడడానికి రెచ్చగొడుతున్నాయి. చైనాకు పగ్గాలు వేయగలిగిన శక్తి, అవకాశం భారత్‌కు మాత్రమే ఉన్నాయని చెవిలో ఇల్లు కట్టుకుని పోరుతున్నాయి. మరో పక్క చైనా సరిహద్దు సమస్యలను అడ్డంపెట్టుకుని భారత్‌తో కయ్యానికి కాలు దువ్వుతోంది. ఒక్క ఆసియా ఖండంలోనే కాక, మొత్తం ప్రపంచంలో తానే అతి పెద్ద ఆర్థిక శక్తిగా పరిగణన పొందాలని గట్టి పట్టుదలతో ఉన్న చైనా ఆసియా ఖండంలో ఆధిపత్య ధోరణి ప్రదర్శిస్తోంది. ఇదే లక్ష్యంతో ఆసియాలోని చిన్నాచితకా దేశాలలో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతూ భారత్‌ను ఏకాకి చేసే ప్రయత్నంలో ఉంది. పాకిస్థాన్‌తో సాన్నిహిత్యం నెరపుతోంది. ఫలితంగా భారత్ పరిస్థితి భౌగోళికంగా కుంచించుకుపోతోంది.

ఈ పరిణామాలను దృష్టిలో పెట్టుకుని, భారతీయ విధాన రూపకర్తలు, అంతర్జాతీయ సంబంధాల విశ్లేషకులు భవిష్యత్తులో చైనాతో భారత్ సంబంధాలు మెరుగయ్యే సూచనలు కనిపించడం లేదని పెదవి విరుస్తున్నారు. భారత్‌తో సరిహద్దు సమస్యలను పరిష్కరించుకునే ఉద్దేశం చైనా నాయకత్వానికి లేదని, ఆ దేశం తన విస్తృత రాజకీయ, వ్యూహాత్మక లక్ష్యాలకు తగ్గట్టుగా ఈ సరిహద్దు సమస్యలను తారస్థాయికి తీసుకువెడుతోందని వారంతా భావిస్తున్నారు. చైనాతో సంబంధాల మెరుగుదలకు భారత్ ఏ చిన్న ప్రయత్నం చేసినా, దురంహకార చైనా ఈ ప్రయత్నాన్ని పిరికిపంద చర్యగా, లొంగుబాటు వైఖరిగా భావించి మరింత చులకన చేసే అవకాశం ఉందని కూడా వారు ఆందోళన చెందుతున్నారు. తన కఠిన వైఖరి మీదా, తన శక్తి మీదా చైనా నాయకత్వానికి అపార నమ్మకం ఉందని, భారత్ ఇటువంటి వైఖరిని కొనసాగించినంత కాలం చైనా తన పరిమితిలో తానుంటుందని వారు చెబుతున్నారు.

రెచ్చగొడుతున్న అగ్రదేశాలు

అంతేకాదు, చైనాతో ఢీ అంటే ఢీ అనాలంటే, చైనా మీద గుర్రుగా ఉన్న అగ్రదేశాలతో సైనిక, రక్షణ, ఆర్థిక ఒప్పందాలను కుదుర్చుకోవడం అవసరమని కూడా ఈ విధాన రూపకర్తలు, అంతర్జాతీయ సంబంధాల నిపుణులు, విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. విచిత్రమేమిటంటే, భారత్ మొండివైఖరిని, నిర్భయ ధోరణి చూసి చైనా కూడా దాదాపు అదే అభిప్రాయాలతో ఉంది. అమెరికా, రష్యాలతో భారత్ అనేక రక్షణ, సైనిక, ఆర్థిక ఒప్పందాలు కుదుర్చుకుంటున్న నేపథ్యంలో తాను కూడా ఈ రంగాలలో వీలైనంత పటిష్ఠతను కూడగట్టుకోవాలని చైనా కూడా పట్టుదలతో ఉంది. ప్రస్తుతం ఈ రెండు దేశాల వైఖరి ఈ రెండు దేశాల భావి సంబంధాలను తీవ్రంగా ప్రభావితం చేస్తోంది. ఇక ఈ రెండు దేశాల మధ్యా సత్సంబంధాలు నెలకొనడం అసాధ్యాల్లోకెల్లా అసాధ్యమనే భావన సామాన్య ప్రజానీకంలో సైతం పాదుకుపోతోంది.

నిజానికి ఈ రెండు దేశాల మధ్య రెండే రెండు సమస్యలున్నాయి. ఈ రెండు సమస్యలు పరిష్కారమైతే భారత్, చైనాల మధ్య ఉన్న విభేదాలు తొలగిపోయి, ఆ స్థానంలో పటిష్ఠ సంబంధాలు నెలకొనడం ఖాయం. అందులో మొదటిది సరిహద్దులకు సంబంధించింది. సరిహద్దు వివాదాన్ని సెక్టార్‌వారీగా పరిష్కరించుకోవాలని భారత్ భావిస్తోంది. తూర్పు రంగంలో మెక్‌మహాన్ రేఖను ప్రాతిపదికగా తీసుకోవాలని, దీని ద్వారానే వాస్తవాధీన రేఖను గుర్తించాలని, అదేవిధంగా మధ్య, పశ్చిమ రంగాల్లో కూడా వాస్తవాధీన రేఖను గుర్తించాలని భారత్ ప్రతిపాదిస్తోంది. ఆక్సాయ్ చిన్ ఇంకా వివాదాస్పద ప్రాంతమేనని, కొన్ని భారతదేశ ప్రాంతాలను చైనా పాకిస్థాన్‌లో విలీనం చేయడం సమంజసం కాదని, దీనికి సంబంధించిన ఒప్పందాన్ని తిరగరాయాలని భారత్ సూచిస్తోంది. కాగా, అరుణాచల్‌ప్రదేశ్‌లోని తవాంగ్ ప్రాంతాన్ని చైనా ప్రాంతంగా భారత్ ఆమోదించే పక్షంలో చైనా, భారత్‌ల మధ్య ఉన్న సరిహద్దు సమస్య తేలికగా పరిష్కారమవుతుందని చైనా భావిస్తోంది.

తూర్పురంగంలో చైనా వైఖరిని భారత్ గుర్తించి పరిష్కరిస్తే, మిగిలిన రంగాలలో భారత్ వైఖరిని చైనా ఆమోదిస్తుందని దీని అర్థం. తవాంగ్ ప్రాంతం చైనాలోని టిబెట్‌లో భాగమని చైనా అభిప్రాయపడుతోంది. మెక్‌మహాన్ రేఖను గీసిన బ్రిటిష్ వ లసవాదులు కూడా తవాంగ్‌పై చైనాకు ఉన్న అధికారాన్ని సమర్థించారని ఆ దేశ ప్రతినిధులు వాదిస్తున్నా రు. అయితే, చైనా ప్రతిపాదనలు, ఆ దేశ వైఖరి ఆచరణాత్మకంగా, ఆమోదయోగ్యంగా లేవని భారత్ వాదించింది. అయితే, అధికారుల స్థాయి సమావేశాలు ఎప్పుడు ఎక్కడ జరిగినా ఈ రకమైన ప్రతిపాదనల మీదే చర్చ జరిగి, అసంపూర్తిగా ముగుస్తోంది. దీనికి అధికారుల స్థాయి పరిష్కారం అసాధ్యమనీ, రాజకీయ పరిష్కారం అనివార్యమనీ కొందరు విశ్లేషకులు భావిస్తున్నారు. అంటే, భారత, చైనా అగ్రస్థా యి అధినేతల మధ్య సమావేశం జరిగితేనే దీనికి పరిష్కారం సాధ్యమని కూడా వారు సూచిస్తున్నారు.

పాక్ ఓ గుదిబండే!

ఇక ఈ రెండు దేశాల మధ్యా ఉన్న మరో సమస్య ఏమిటంటే, భారత్‌ను లొంగదీసుకోవడానికి చైనా పాకిస్థాన్‌ను అస్త్రంగా ఉపయోగించుకుంటోంది. భారత్‌ను రెచ్చగొట్టాలన్నా, లొంగేలా చేసుకోవాలన్నా పాకిస్థాన్‌ను ఆ దేశం మీదకు ప్రయోగించడం ఓ గొప్ప మార్గంగా చైనా నాయకత్వం భావిస్తోంది. నిజానికి చైనా దేశానికి పాకిస్థాన్ సన్నిహిత మిత్రురాలేమీ కాదు. పాకిస్థాన్ ఓ విశ్వసనీయ స్నేహితురాలేమీ కాదని, ఏదో ఒకనాడు అది తనకు గుదిబండ కాక తప్పదని చైనాకు కూడా అనుభవపూర్వకంగా తెలుసు. కానీ, భారత్‌ను చర్చలకు ఒప్పించాలన్నా, తమ ప్రతిపాదనలను ఆమోదింపజేయాలన్నా శత్రువుకు శత్రువును ఉపయోగించుకోవడమన్నది చైనా వ్యూహంగా మారిపోయింది. భారత్, చైనాల మధ్య సరిహద్దు సమస్య ఓ కొలిక్కి వచ్చిన మరుక్షణం పాకిస్థాన్ ఓ చెత్త బుట్టలో ఉంటుందనేది కాదనలేని సత్యం.

ఈ రెండు సమస్యలకూ ఒక్కటే పరిష్కారం. ఈ రెండు దేశాల అగ్రనాయకుల మధ్య శిఖరాగ్ర సమావేశం జరగాలి. ఈ రెండు దేశాలు ఇచ్చి పుచ్చుకునే ధోరణితో వ్యవహరించాలి. భారత్ తన పార్లమెంట్‌లోనూ, ప్రజల్లోనూ సమస్యల పరిష్కారం విషయంలో సానుకూల అభిప్రాయం సేకరించాలి. ఉభయ దేశాల ప్రధానమంత్రులు సుదీర్ఘ చర్చలు జరపాలి. భారత ప్రభుత్వం ఇంకా తన వంతుగా మేధావులు, విశ్లేషకులు, అంతర్జాతీయ సంబంధాల నిపుణులు వగైరాల సలహాలు, సూచనలు తీసుకోవడంతో పాటు, అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి ఏకాభిప్రాయం సాధించాలి. ఆ తరువాత చైనా నాయకత్వంతో మొదట విదేశాంగ మంత్రుల స్థాయిలోనూ, ఆ తరువాత ప్రధానుల స్థాయిలోనూ చర్చలు జరగడం అనివార్యం. చైనా నాయకత్వం కూడా సానుకూలంగా స్పందించి, తమ మైత్రికి ప్రధాన ప్రతిబంధకాలుగా ఉన్న సమస్యలను పరిష్కరించుకునే దిశగా వడిగా అడుగులు వేయాలి.


ఇవన్నీ ఈ రెండు దేశాల విషయంలో అసాధ్యమేమీ కాకపోవచ్చు. ఈ రెండు దేశాల నాగరికతలు అతి పురాతనమైనవి. పైగా ఒకదానితో మరొకటి పెనవేసుకుని పోయాయి. ఈ రెండు దేశాల నాయకులు వివేకవంతులు, దూరదృష్టికలవారే. ఈ జటిల సమస్యలను పరిష్కరించుకుని మైత్రీ సంబంధాలను అభివృద్ధి చేసుకోవాల్సిన బాధ్యత ఈ రెండు దేశాల అగ్ర నాయకుల మీదా ఉంది. ఇది మోదీ ప్రభుత్వంలోనూ సాధ్యమే. మరో ఏడాదిలో ఎన్నికలు జరగనున్నాయనగా మోదీ ఇప్పటి నుంచే ఈ దిశగా చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. ఈ ప్రయత్నం ఆసియాకే కాదు, ప్రపంచానికి సైతం శాంతి, సుస్థిరత, భద్రతలతో పాటు, ఆర్థికాభివృద్ధిని, సంపూర్ణ సౌభాగ్యాన్నీ తెచ్చిపెడుతుంది.

> భారత్, చైనాల మధ్య ఉన్న సరిహద్దు సమస్యల పరిష్కారం దిశగా ఈ రెండు దేశాలు ఒక్క అడుగు ముందుకు వేయగలిగినా చైనాతో పూర్వపు మైత్రి మళ్లీ ఊపందుకుంటుందని, పాకిస్థాన్‌ను పక్కన పెట్టేయడానికి చైనా ఒక్క క్షణం కూడా వెనుకాడదని అంతర్జాతీయ సంబంధాల విశ్లేషకులు చెబుతున్నారు.

పుస్తక పఠనం ప్రగతికి సోపానం

బమ్మెర పోతన చెప్పినట్లు పుస్తకం హస్తభూషణం. పుస్తకాల అధ్యయనం ఒక తపన, తీరని విజ్ఞాన దాహం. పుస్తకాన్ని తమ జీవితాన్ని ఆదర్శంగా నడిపించే నిజమైన చోదకశక్తిగా భావిస్తాము. మనిషికి మరణం ఉండవచ్చు కాని పుస్తకానికి, దాని ద్వారా అర్జించిన విజ్ఞానానికి మరణం లేదు. పుస్తక అధ్యయనం వికాసాన్ని, విజ్ఞానాన్ని ఈ సమాజానికి అందిస్తుంది. ఒత్తిడి తగ్గించి మానసిక ఆరోగ్యాన్ని పెంచుతుంది. వివిధ భాషలపై పట్టును పెంచుతుంది.

బెంజమిన్ ఫ్రాంక్లిన్ చెప్పినట్లు పుస్తక పఠనం వల్ల ఉన్న చోటి నుంచే ఈ ప్రపంచాన్ని చూడవచ్చు. ఈ రోజుల్లో ప్రపంచ వీక్షణానికి పుస్తకం తొలిమెట్టు. పుస్తక పఠనం లేకపోతే ఈ సమాజం కలంలేని, కాగితంలేని మేధస్సు లేని విధంగా నిర్జీవ సమాజంగా సాగుతుంది. ఈస్థితి మారాలంటే, సమాజం పునర్జీవం పొందాలంటే పుస్తకాలను చదవాల్సిందే. పుస్తకాలు మనిషిలోని భావాలకు, ఊహలకు అక్షర రూపం ఇచ్చి కవులుగా, రచయితలుగా, శాస్త్రవేత్తలుగా, సాహితీ వేత్తలుగా, మేధావులుగా తీర్చిదిద్దుతాయి. చదివిన పుస్తకాలను ఇతరులు కూడా చదివేందుకు వీలుగా గ్రంథాలయాలకు ఇవ్వాలి.



కాలగమనానికి పుస్తకాలే పునాది రాళ్ళు. నిన్నటి చరిత్ర నుంచి రేపటి చరిత్రకు పుస్తకాలే ఊపిరి. విద్యార్థులు తమ పాఠశాలల్లోని గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకునేలా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ప్రోత్సహించాలి. వారి లక్ష్య నిర్దేశానికి వారి జీవన మనుగడకు మానసిక ఉల్లాసానికి ప్రేరణగా పుస్తకాలు తోడ్పడుతాయి. ఈ పుస్తకాల ద్వారా కొత్త విషయాలను తెలుసుకోవాలన్న ఆసక్తి పెరుగుతుంది.

ప్రతి సంవత్సరం డిసెంబర్/జనవరి మాసంలో పుస్తక ప్రదర్శనలు రెండు తెలుగు రాష్ట్రాల్లోని హైదరాబాదు, విజయవాడల్లో నిర్వహిస్తున్నారు. నగరాలకే పరిమితం చేయకుండా ప్రతి జిల్లాలో పుస్తక ప్రదర్శనలు ప్రతి సంవత్సరం ఏర్పాటు చేయాలి. విజ్ఞానాన్ని ప్రజల వద్దకు చేర్చే ప్రయత్నం చేయాలి. మానవ విలువలను పెంపొందించడానికి పుస్తకాలు ప్రేరణ కలిగిస్తాయి. వేడుకలల్లో పుస్తకాలను బహుమతిగా ఇచ్చే మంచి సంప్రదాయాన్ని విద్యార్థులకు అలవాటు చేయాలి. పుస్తకం చదువుతే విభిన్న వ్యక్తుల వ్యక్తిత్వాలు, ప్రదేశాలు వాటి వివరాలు వేర్వేరు కోణాల్లో వారివారి ఆలోచనలు, అభిప్రాయాలు తెలుస్తాయి. మంచిచెడు, పెద్దలతో ఎలా నడుచుకోవాలో తెలుపుతాయి. తల్లి దండ్రులు పిల్లలకు చిన్నప్పటి నుంచే చదివే అలవాటు చేయడానికి బొమ్మల కథలతో కూడిన పుస్తకాలు (బొమ్మరిల్లు, చందమామ, బాలమిత్ర)తో మొదలుపెట్టాలి. స్టోరీ టెల్లింగ్ ఆడియో, వీడియోలను చూపించాలి. స్నేహితుడు లేకపోయినా పరువాలేదు గానీ పుస్తకం చదివే అలవాటు లేని వారిని వదిలిపెట్టగకూడదు. పుస్తకం నేటి సమాజంలో ఒక వ్యక్తి దైనందిన జీవితంలో భాగంగా భావించాలి. నేడు మనకంటే అభివృద్ధి చెందిన యూరోప్, అగ్రదేశం అమెరికా, సింగపూర్, మలేసియాల్లో యువకులల్లో మనిషికో ఆపిల్ ఫోను, గదికో ప్లాస్మా టీవీ, వర్చువల్ రియాలిటీ గేమ్‌లు మనకంటే ఎన్నోరెట్లు వేగవంతమైన ఇంటర్నెట్ అవకాశం ఉన్నా అక్కడి వారికి పుస్తకాలంటే అభిమానం చూపుతారు.

పిల్లల్లో సృజనాత్మకత కోసం, భావ వ్యక్తీకరణ కోసం పుస్తక పఠనం ఒక పాఠ్యాంశం కావాలి. ప్రత్యేక తరగతులు నిర్వహించాలి. పాఠశాలల్లో పుస్తకాలు చదవడం, వాటిని విశ్లేషించడం, రివ్యూలు రాయడం వంటివి నిత్యకృత్యాలుగా చేయాలి. వారికి ఏ సాహిత్యం ఇష్టమో దాన్నే ఎంచుకోనివ్వాలి. పుస్తక రచయితలను విద్యాలయాలకు పిలిపించి పిల్లలతో ముఖాముఖి ఏర్పాటు చేయించాలి.

న్యూయార్క్ నగరంలో మెట్రో రైళ్లలో ఎక్కువమంది పుస్తకాలు చదువుతూ కనిపిస్తారు. మన దేశంలోని విద్యార్థులు పాఠ్యపుస్తకాలు మాత్రమే చదువుతారు. ఇతర రచనలు, సామాజిక, రాజకీయ, ఆర్థిక సంబంధించిన పుస్తకాలు చదవడం అరుదు. నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని, పద్ధతులను ఆహ్వానించడంలో తప్పులేదు, కానీ పుస్తక పఠనం మన జీవితాన్ని ఏ విధంగా తీర్చిదిద్దుతుందో గుర్తించాలి.

◆ **డాక్టర్ రవి కుమార్ చేగొని**
ప్రధాన కార్యదర్శి, తెలంగాణ గ్రంథాలయ సంఘం
హైదరాబాద్

మన లేఖలు

506, 507 సెక్షన్లపై పునరాలోచించాలి!

మన మహోన్నతమైన భారత రాజ్యాంగంలోని అధికరణం 19 ప్రకారం ప్రతి పౌరుడు తన భావాన్ని, అభిప్రాయాన్ని స్వేచ్ఛగా వ్యక్తం చేసుకునే అవకాశం ఉంది. అదే క్రమంలో భారతీయ శిక్షాస్మృతి 1886 సెక్షన్‌లు 506, 507 ప్రకారం 'పరుష పదజాలంతో దూషించిన వారిని, బెదిరింపులకు గురిచేసిన వారిని, కించపరచిన వారిని గుర్తించి న్యాయస్థానం అనుమతితో సదరు వ్యక్తులపై కేసులు నమోదు చేసి హాజరు పరిచే హక్కు , అవకాశం ఉంది. కానీ సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు పరుష పదజాలంతో దూషించిన వారిని, కించపరచిన వారిని, బెదిరింపులకు గురిచేసిన వారిని న్యాయస్థానం అనుమతి లేకుండానే కేసులను నమోదు చేసే ఫైల్ పైన సంతకం చేసినట్లుగా తెలిసింది. ఇది చూడడానికి భాగానే ఉంటుంది. కానీ ఆచరణలో దుర్వినియోగమయ్యే అవకాశాలు ఉంటాయి.

తెలంగాణ ఉద్యమ సమయంలో సాక్షాత్తు కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు గారు, సమైక్యాంధ్రులు ఒకరిపై ఒకరు హెచ్చరించికున్న, దూషించికున్న, కించపరచుకున్న సందర్భాలు అనేకం ఉన్నాయి. కానీ ఆనాటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కేసులు నమోదు చేసిన సందర్భాలు చాలా అరుదు. కావునా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఐపిసి 506, 507 సెక్షన్‌లను న్యాయస్థానం అనుమతి నుంచి మినహాయింపచేసి కేసులు నమోదు చేసే విధంగా చర్యలు తీసుకోవడంపై పునరాలోచించి ఆదర్శ ప్రజాస్వామిక రాష్ట్రంగా పేరు తెచ్చుకోవాలని కోరుకుంటున్నాం.

- మేరుగు రాజయ్య, కేంద్ర కార్యదర్శి
సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి)
9441440791

పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి

యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రానికి వివిధ గ్రామాల పాఠశాలల విద్యార్థులు పదవతరగతి పరీక్షలు రాయడానికీ మండల కేంద్రానికి వస్తుంటారు. వారికి పరీక్ష కేంద్రాలలో కొన్ని రకాల మౌలిక వసతులు లేక విద్యార్థులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రాల్లో విద్యార్థులకు అన్ని రకాల మౌలిక వసతులున్న పాఠశాలలో పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి. మండల కేంద్రంలో ఉన్నటువంటి ఆదర్శ పాఠశాల (మోడల్ స్కూల్)లో అన్ని రకాల మౌలిక వసతులు, విశాలమైన తరగతి గదులు, పరీక్ష కేంద్రానికి కావాల్సిన అన్ని సౌకర్యాలు ఆదర్శ పాఠశాలలో ఉన్నాయి. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వుంటుంది. కావునా రాష్ట్ర ప్రభుత్వ విద్యాశాఖ ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకొని సంస్థాన్ నారాయణపుర మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో పదవ తరగతి పరీక్ష కేంద్రాన్ని మంజూరు చేసీ మండలంలోని పదవ తరగతి విద్యార్థుల సమస్యను పరిష్కరించాలి.

- గుండమల్ల సతీష్‌కుమార్
సంస్థాన్ నారాయణపురం
9493155522

అరచేతిలో ప్రపంచం

యాప్స్

కొత్త ఏడాది సెలవుల సీజన్‌లో విదేశాల్ని సందర్శించే ఉద్దేశం ఏదైనా ఉందా? అయితే అందుబాటులో ఉన్న టూరింగ్ సర్వీసులు, వెబ్‌సైట్లు ఇచ్చే సమాచారానికన్నా కాసింత భిన్నమైన సమాచారం అందితే బావుంటుంది కదా, అది కూడా మీ స్మార్ట్‌ఫోన్‌లోనే దొరికితే మరింత బావుంటుంది. స్మార్ట్‌ఫోన్‌లో మీకు అందుబాటులో ఉన్న కొన్ని ట్రావెల్ యాప్‌ల గురించి తెలుసుకుందామా...

లక్కీట్రిప్ (https://www.luckytrip.co.uk/>):

ఈ యాప్‌లో ప్రపంచంలోని మూడువందల నగరాలకు సంబంధించిన పర్యాటక వివరాలు ఉంటాయి. ఎక్కడికి వెళ్ళాలి, ఏమేం చూడాలి? ఎలా గడపాలి వంటి ప్రశ్నలన్నింటికీ ఈ యాప్ సమాధానం చెబుతుంది. ఎంచుకున్న ప్రదేశంలో మీ ఆర్థిక స్థోమతను బట్టి బస, ఆహారసదుపాయాల వంటి వివరాలు కోకొల్లలుగా ఉంటాయి. ఏ విమానాశ్రయంలో ఎలాంటి విమాన సౌకర్యాలు ఉంటాయి, వాటి ఛార్జీలు ఎలా ఉంటాయి వంటి వివరాలు మీకు లభ్యమవు తాయి. మీ సౌలభ్యాన్ని బట్టి మీ విమాన ప్రయాణాన్ని ప్లాన్ చేసుకోవచ్చు.



ట్రిప్ డాట్‌కామ్ (trip.com <http://www.trip.com/>):

ప్రపంచవ్యాప్తంగా 60,000 ప్రదేశాలకు సంబంధించిన వివరాలు, ఆయా ప్రదేశాల్లో నిర్వహించే ప్రత్యేక కార్యక్రమాలు, ఉత్సవాల వంటి వివరాలు ఈ యాప్‌లో ఉంటాయి. ఇందులో మరో విశేషం ఏమిటంటే, పర్యాటక ప్రేమికులు తమ అనుభవాల్ని, తాము గడిపిన ప్రదేశాల్లో లభించే సౌకర్యాల్ని ఈ యాప్‌లో సమీక్షిస్తారు. ఇది కూడా మీ ట్రావెలింగ్ ప్లాన్‌కు ఉపయుక్తంగా ఉంటుంది.

కూల్ కజిన్ డాట్‌కామ్ (coolcousin.com):

మనం సందర్శించాలనుకున్న ప్రదేశంలోని స్థానికుల్ని మనకు పరిచయం చేసే యాప్ ఇది. మనకు నచ్చిన స్థానికులకు మెసేజ్‌లు పంపడం ద్వారా ఆయా ప్రాంతాల మ్యాప్‌లను తెప్పించుకోవడంతోపాటు, మన ఆహారాదివసతుల గురించిన వివరాల్ని ప్రయాణానికి ముందే కచ్చితంగా తెలుసుకునే వీలు ఉంటుందీ యాప్ వల్ల.

మ్యూజ్‌మెంట్ డాట్‌కామ్ (<https://www.musement.com/uk/mobile-app/>):

ప్రపంచవ్యాప్తంగా 350 ప్రదేశాలకు సంబంధించిన వివరాలు ఇందులో ఉంటాయి. దీని సేవలు ఈ ప్రదేశాల్లో సులభంగా లభ్యమవుతాయి. ఇది ఆయా నగరాలకు సంబంధించిన వివరాల్ని అందిస్తుంది. ఈ యాప్ ద్వారా లభించే స్థానిక వివరాల వల్ల మనం వెళ్ళాలనుకున్న ప్రదేశంతో ప్రయాణానికి ముందే మనకు పరిచయం ఏర్పడుతుంది.

గోవాండర్ డాట్ కొ (gowander.co <http://www.gowander.co/>):

ఇది ఒక ఫోటోజర్నల్ యాప్. ప్రత్యేకించి సాహసయాత్రికులకు ఈ యాప్ ఎంతో సహాయకారిగా ఉంటుంది. దీని ద్వారా మనం ప్రపంచంలోని ఇతర సాహసయాత్రికుల పరిచయాన్ని కూడా పొందవచ్చు. ఏఏ ప్రదేశాల్లో ఎలాంటి సాహసయాత్రల సౌలభ్యాలు ఉంటాయో, సాహస యాత్రలకు సంబంధించిన కార్యక్రమాలు ఎలా ఉంటాయో కూడా ఈ యాప్ ద్వారా తెలుసుకోవచ్చు.



అంతిమ గమ్యం గమనమే

కొత్త ప్రదేశం, కొత్త మజిలీ, కొత్త గమ్యం... వెరసి ఒక ప్రయాణం. తెలియని చోటికే కాదు, తెలిసిన చోటేనని అనుకున్న చోట కూడా ఎదురయ్యే ఎదురుచూడని అనుభవం కూడా ఒక ప్రయాణమే. దారుల వెంట పాదచారివై నడవడమే కాదు, చే గువారాలా మోటార్ సైకిల్ మీద అనంత ప్రయాణాలకు సమకట్టినా... నీలోపలే ఉన్న ఒక రహదారి నీకు అపరిచితంగా ఉన్నంత కాలం నువ్వు పర్యాటకుడివే తప్ప ప్రయాణికుడివి కాలేవు. ప్రయాణానికి మించిన తాత్విక చైతన్యం మరేదీ లేదు. ఆ బహుముఖీన స్వీయ తాత్విక ప్రపంచపు తలుపులకు తెరచుకోవడమే తప్ప, మూతబడడం తెలీదు. నిజమైన ప్రయాణానికి అదే తొలి అడుగు. ఒక్కసారి తొలి అడుగు పడిందా, ఇక ప్రయాణం గమ్యం గురించి పట్టించుకోదు. గమ్యానికి పరిమితం కాని ప్రయాణాల్ని సాగిస్తున్న కొందరు తమ స్వానుభవాల్ని ఇవాల్టి 'మైత్రి'లో మీతో పంచుకుంటున్నారు. – మీ 'మైత్రి'

అమ్మ నవ్వు

ఫోటోగ్రఫీ

అడుగు తీసి అడుగు వేస్తే అది ప్రయాణమే. ఉన్న చోటు నుంచి కదిలితే ప్రయాణమే. ఎందుకో ఊహించనిదీ, ఎందుకో తెలియనిదీ... అసలు ప్రయాణపు అనుభవం. ఎక్కడో, ఎవరో, ఎందుకోసమో ప్రయాణిస్తూ ఉంటారు, ఇటు నుంచి నేను ప్రయాణిస్తాను. ఎక్కడో ఓ రెండు దారులు కలుసుకుంటాయ్. ఎక్కడో ఏ ఇద్దరమో కలుస్తాము. మెరుపులాంటి ఓ క్షణాన్ని పంచుకుంటాం. మధురానుభూతిగా దాన్ని భద్రపరచుకుంటాం. అట్లా రెండు దారులు కలుసుకున్న చోట పుట్టిన కాంతిరేఖే ఈ అనుభవం కూడా. దీన్ని తలచుకున్నప్పుడల్లా కాసింత వెలుగు నన్ను నిలువునా వెలిగిస్తుంది. గోండు గ్రామాలలో నా కెమెరా ప్రయాణమిది.

దూరంగా ఏదో ఊరు కనిపిస్తూ ఉంది. ఊరంటే అక్కడ కొన్ని ఇండ్ల సమూహం. అది కొండ కింద ఉంది. చుట్టూ చిన్నవీ, పెద్దవీ మరికొన్ని కొండలు. 'అది ఏ ఊరు?' అని ఆమెను అడిగాను. దానికి పేరు లేదన్నది. ఆమె పేరు కవిత. లేదంటే లేదని కాదు. మేము నిలుచున్న ఊరిలో భాగమే అది. దూరంగా అక్కడ కొన్ని ఇండ్లున్నాయి. ఆమె గోండు స్త్రీ, కొద్దిగా చదువుకున్నది. మేము ఇప్పుడు నిలుచున్న ఈ ఊరిని చూపించడానికి నాకు తోడుగా వచ్చింది. ఆమెది మరో గోండు గ్రామం. ఈ ఊళ్ళో పనై పోయింది. కొండ కింద కనిపిస్తున్న ఆ ఊరికి వెళదామా అని అడిగాను.

శిశిరం మొదటి సగంలో చివరి రోజులవి. మధ్యాహ్నపు ఎండ కాస్తున్నది. కొండల మీద చెట్లన్నీ ఆకులు రాల్చి వేసి ఉన్నాయి. గోండుల ఇళ్ళ పందిళ్ళ కింద తప్ప, కొండలన్నీ వెదికినా నీడన్నది దొరకదు. ఆ పందిళ్ళు కూడా పైన గడ్డి కప్పి లేవు. ఉత్తి కర్రలు అడ్డంగా పరిచారు. పందిళ్ళ మీద సొరతీగలు వాడిపోయి, ఎండిన సొరకాయలు గుత్తులుగుత్తులుగా వేలాడుతున్నాయి. నేను నడుస్తానంటే, అట్లాగే అన్నదామె. ఆమె పేరు కవిత. దారిలో గోండుల ప్రస్తుత జీవితాన్ని గురించి చెబుతూ వచ్చింది. ఊరు బయలెల్లినపుడు ఊరి చివర బావిని చూపించి, ఇదే నీళ్ళు అన్నది. అవును, ఈ ప్రాంతంలో నీటి కరువు. దారి మధ్యలో మాకు మరో బావి ఎదురైంది. ఈ బావిలో నీళ్ళనే ఇప్పుడు మనం చూడబోతున్న ఊరివాళ్ళు చేదుకుంటారని ఆమె చెప్పింది. ఎవరో బట్టలు బండ మీద బాదుతున్న శబ్దం. బావిగట్టు చాటు వల్ల మనిషి కనబడలేదు. బావి దగ్గరికి కాలిబాట నలిగింది. బావి అవతల ఇప్పచెట్టు. చెట్టు అవతల కంది చేలు, పత్తి చేలు, జొన్న చేలు. అవతల కొండలు కనిపిస్తున్నాయి. కంది, జొన్న కోతలై పోయినాయి. పత్తి అక్కడక్కడా తెల్లగా ఉంది.




ఊరి మొదట్లో మేకల ఎరువు దిబ్బలు ఎదురైనాయి. మేము అడుగు పెట్టబోతున్న ఊరు ఎంతో పరిశుభ్రంగా ఉంది. ఎక్కడ ఉండాల్సినవి అక్కడే ఉన్నాయి. సగానికి పైగా ఇళ్ళకు వెదురు తడికెలే గోడలుగా ఉన్నాయి. తడికెల్ని మట్టితో అలికినారు. పైన ఎర్రటి పెంకుల కప్పులు. అవి ఎండలో ఇంకా ఎర్రగా మెరుస్తున్నాయి. నా సొంతగ్రామానికి వచ్చినట్టుంది నాకు. ఎండలోనూ నా మనసు చల్లదనాన్ని అనుభవిస్తూ ఉంది.

ఒక ఇంటి పంచ నీడలో నులక మంచమ్మీద వృద్ధుడు పగటి కునుకు తీస్తున్నాడు. అతడి చేతిలో తాడు, రెండో కొస ఊయలకి కట్టి ఉంది. ఊయలలో అమ్మ నూలు చీరల మధ్యన పసిపాప నిద్ర పోతున్నది. పొద్దున ఆరిన నెగడు, మేకలు సగం తినిపోయిన పచ్చిగడ్డి గంప, పొయ్యి వద్ద వదిలిపోయిన స్టీలు గ్లాసు.., ఇదీ ఆ ఇంటి పంచ దృశ్యం. మరో ఇంటి చూరుకింద చేటలో గోరు చిక్కుళ్ళు దంచుతున్నది ఒక వృద్ధురాలు. పిల్లలు ఉయ్యాలలూగుతున్నారు.

ఇండ్లలో నుంచి బయటికి వచ్చిన నీరు అక్కడే ఇంకిపోయింది. ఇండ్ల పక్కన కచ్చరాలు నిలబెట్టి ఉన్నాయి. ఊరంతా నిశ్శబ్దంగా ఉన్నది. తడికెల తలుపులు గొళ్ళాలు పెట్టి ఉన్నాయి. కొందరు జైనూరు సంతకీ, మరికొందరు సొంత కంది కల్లాలలో, పత్తి చేలల్లో పనికి పోయారన్నది కవిత. ఒక ఇంటి గాదె చాటున పిల్లలు పంతులమ్మ ఆటాడుతున్నారు. నన్ను చూసి సిగ్గు పడి పోయింది పంతులు వేషం వేసిన పిల్ల. పుస్తకంలా పట్టుకున్న చెక్కని పక్కకి తోసి, చీరని గబగబా లాగి పడేసింది. గౌనులో నిలబడి నన్ను చూసి నవ్వింది. ఆ నవ్వునట్లా కెమెరాలో దాచుకుని, పక్కన పసివాడినీ ఫోటో తీయబోయాను. స్త్రీలిద్దరూ అప్పుడే పని నుంచి ఇంటికి తిరిగి వచ్చారు. వాళ్ళలో ఒకరు పసివాడి తల్లి. వస్తూ వస్తూ పందిరి గుంజను ఆనుకుని నిలుచుంది. కెమెరాని చూసి భయపడి పిల్లవాడు తల్లిని చేరి హత్తుకున్నాడు. ఏం కాదంటూ బిడ్డ మీద ఆమె తన ప్రేమని ఒంపింది. అప్పుడు ఆమె ముఖంలో వెలిగిన సన్నటి నవ్వును నేను పదిలంగా దాచుకున్నాను.

– జయతీ లోహితాక్షన్



జయతీ లోహితాక్షన్


నిజామాబాద్ జిల్లా బోధన్‌లో జన్మించిన జయతి లోహితాక్షన్ నిత్య పథికురాలు. ఆమె తన కెమెరా కళ్ళతో అడవుల్ని, గ్రామాల్ని, మానవజీవితంలోని దార్శనికతను రికార్డు చేస్తుంటారు. ఫోటోగ్రఫీ అభివ్యక్తిగా, ప్రయాణమే అభిమతంగా జయతి తనదైన జీవనపథాన్ని ఎంచుకుని, ముందుకు సాగుతున్నారు.

'కొండె'క్కిన సంక్షేమం!

జర్నలిజం

'వాలు ప్రాంతంలో కాఫీతోటలు పెంచేది వీరే. గింజలను కోసి, పొడిగా మార్చి ఇలా కాఫీ చేసేది ఈ చేతులే' అన్నాడు అనిల్, అరకు నుంచి పాడేరు వెళ్ళే మలుపులో మాకు వేడిగా కాఫీలు ఇచ్చిన అమ్మాయిలను పరిచయం చేస్తూ!

విశాఖలో ఉదయం ఐదుగంటలకు మొదలైన మా జర్నీ అరకు వ్యాలీకి వచ్చే సరికి మూడున్నర గంటలు పట్టింది. అక్కడ ఒక ప్రముఖ నేత దత్తత తీసుకున్న గ్రామాన్ని చూడాలని బయలుదేరాం కానీ, 'దిక్కూ, మొక్కూ లేక దత్తత కోసం అలమటిస్తున్న మరో గ్రామం చూద్దాం' అని పాడేరు వైపు వాహనాన్ని తిప్పాడు అనిల్. అతడు రామకృష్ణా మిషన్‌లో గిరిజన వికాసం కోసం పని చేస్తుంటాడు. అలా నూటయాభై కిలోమీటర్లు ప్రయాణించాక వాహనాన్ని రోడ్డు పక్కన ఆపి, కాలిబాటలో సిల్వర్ ఓక్ చెట్ల మధ్య నడవ సాగాం. తూర్పు కోస్తా తీరంలో విశాక ఏజన్సీలో విసిరేసినట్టున్న గ్రామం జంగంపుట్టు, 120 కుటుంబాలు ఇక్కడున్నాయి.



కొండవాలులోని ఊటనీటి కుంటలే వీరికి జీవజలం. అవీ లేని వారు బావుల్లో అడుగంటిన మురికి నీళ్ళతో గొంతు తడుపుకుంటున్నారు. ఇక్కడి భూములన్నీ వాలుగా ఉంటాయి. అక్కడే, ఊట నీటితో 'మెట్ల సాగు' చేస్తూ వరి, వేరుశనగ, క్యాబేజీ పండిస్తున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అనేకానేక సంక్షేమ పథకాలు ఈ గిరిజన పల్లెలకు ఇంకా చేరలేదు. కిరోసిన్ గుడ్డి దీపాల్లో బిక్కుబిక్కుమంటూ బతుకుతున్నారు. ఒకటీ, అరా కరెంట్ పోల్స్ వేసినా వారానికోసారి విద్యుత్ వస్తుంది. సముద్ర మట్టానికి 900 నుంచి 1200 మీటర్ల ఎత్తులో ఉన్న ఈ కొండ ప్రాంతంలో గాలులు విపరీతంగా వీయడం వల్ల కరెంట్ తీగలు తెగి పడుతుంటాయి. వీటిని సరిచేసే లైన్‌మేన్‌ల కోసం కబురు చేయాలన్నా సెల్‌ఫోన్‌లు పలకవు. 'సెల్‌ఫోన్‌కి ఛార్జింగ్ పెట్టుకోవడానికి పవర్ లేదు. అరవై కిలోమీటర్ల దూరం పోయి, పది రూపాయలిచ్చి బ్యాటరీ ఫుల్ చేసుకుని రావాలి. ఎత్తయిన కొండ ఎక్కి మాట్లాడితే కానీ సిగ్నల్ అందదు' అన్నాడు జన్ని రాజారావు. 'జంగంపుట్టు నుంచి గత్తుం రోడ్డులోకి రావాలంటే అడవిలో ముళ్ళపొదల మధ్య మూడు కిలోమీటర్లు దూరం కాలిబాటలో నడిచి పోవాలి. మధ్యలో ఒక ఏరు కూడా ఉంది. వానాకాలంలో నీటి ప్రవాహం పెరిగిపోయి ఆ దారి కూడా మూసుకు పోతుంది. వృద్ధులకు రోగాలు వచ్చినా, గర్భిణీ స్త్రీలకు పురిటి నొప్పులు వచ్చినా ఆసుపత్రికి వెళ్ళడానికి దారిలేదు. మా కష్టాలను ప్రజాప్రతినిధుల దగ్గర ఎన్నిమార్లు మొర పెట్టుకున్నా పట్టించుకోలేదు. జంగంపుట్టు నుంచి గత్తుం వరకు రోడ్డు వేస్తే మాకు బయటి ప్రపంచంతో లింక్ ఏర్పడుతుంది. ఈ దారిలో పదికి పైగా పెద్ద బండరాళ్ళు ఉన్నాయి. వాటిని తొలగించి రహదారి నిర్మించాలి. ప్రభుత్వం సాయం చేస్తే మేమంతా కలిసి శ్రమదానం చేస్తాం. ఈ రోడ్డు వల్ల సమీపంలోని గాలిపాడు, వెలగపాడు, దుర్గం గ్రామస్తులకు కూడా మేలు కలుగుతుంది' అంటారు ఆ గ్రామంలో టీచర్‌గా పనిచేస్తున్న మూర్తి. 'ప్రభుత్వ అధికారులు కానీ, మీడియా కానీ ఇంతవరకు మా గిరిజన గూడెం వైపు తొంగి చూడలేదు. కనీసం మీ ద్వారా అయినా ప్రభుత్వం దృష్టికి మా సమస్యలు వెళతాయని కొండంత ఆశతో ఉన్నాం' అంటున్నారీ కొండ ప్రజలు. నగరాల్లో హాస్టల్స్‌లో ఉండి డిగ్రీలు చదివిన ఇరవై మంది నిరుద్యోగులు ఇక్కడే పశువులను మేపుకుంటున్నారు. విద్యుత్ లేక పోవడం వల్ల టీవీ చూడలేరు. రహదారులు లేకపోవడం వల్ల పేపర్ చదవలేరు. ప్రపంచంతో సంబంధం లేకుండా బతికేస్తున్నారు. పాడేరు ఐటిడిఎలోని హుకుంపేట మండలం లోని ఈ గిరిజన పల్లెల సమస్యలను పరిష్కరించడానికి ఈ గ్రామాలను ఎవరైనా దత్తత తీసుకుంటే వీరి జీవితాలు మారవచ్చు!



– శ్యాంమోహన్, సీనియర్ జర్నలిస్టు, రూరల్ మీడియా

ప్రయాణమే ప్రాణమంత్రం

డాక్యుమెంటరీ

హరిమోహన్ 2015లో తన సైకిల్ మీద ఎనభై రోజుల పాటు దక్షిణభారతీయ రాష్ట్రాలన్నింటా పర్యటించారు. ఐదువేల కిలోమీటర్లు సైకిల్ మీద ఆయన చేసిన ఈ యాత్ర ఏదో సందేశానివ్వడానికి కాదు, మరేదో రికార్డును నెలకొల్పడానికి అంతకన్నా కాదు. హరికి సినిమాలు తీయడమంటే చాలా ఇష్టం. అదే ఆయన ప్రాణమని కూడా చెప్పుకోవచ్చు. ఆయన తాను తీయబోయే చిన్న డాక్యుమెంటరీకి తగిన కథావస్తువును అన్వేషిస్తూ ఇలా సైకిల్ మీద ప్రయాణమయ్యారు. ఆయన ప్రయాణం, ప్రయాస ఊరికే పోలేదు, అది 'ఇన్‌విజిబుల్ వింగ్స్' అనే అద్భుతమైన డాక్యుమెంటరీకి పునాదిగా నిలిచింది. ఈ డాక్యుమెంటరీ ఇప్పుడు ఫిల్మ్‌ఫేర్ అవార్డులు - 2018లో బెస్ట్ నాన్‌ఫిక్షన్ కేటగిరీలో ఉత్తమ లఘుచిత్రంగా అవార్డును గెలుచుకుంది. కేరళకు చెందిన ఒక టీకొట్టు యజమాని కె.ఆర్.విజయన్ స్వీయగాథ ఇది. టీకొట్టును నడుపుకుంటూ ప్రపంచదేశాల్లో పర్యటిస్తున్న విజయన్, ఆయన భార్య మోహనల కథ ఇది. అరవై ఐదేళ్ళ విజయన్ కేరళలోని కొచ్చిన్‌లో చిన్న టీ దుకాణాన్ని నడుపుతున్నారు. అదేం పెద్ద విశేషం కాదు కదా, కానీ విశేషమే, ఎందుకంటే, ఆయన అలా టీకొట్టును నడపగా వచ్చిన సంపాదనతోనే తన భార్యతో కలిసి ఇప్పటికి బ్రిటన్, ఫ్రాన్స్, ఈజిప్ట్, ఎమిరేట్స్ వంటి 16 దేశాల్లో పర్యటించారు. ఇదంతా ఒక కథ అయితే, ఈ జంటను కలుసుకుని, వారి జీవితాన్ని తెరకెక్కించడమనే అద్భుతాన్ని సాధించిన ఘనత మాత్రం హరిమోహన్‌దే! విజయన్ జీవితం ఆధారంగా నిర్మించిన తన లఘుచిత్రాన్ని హరిమోహన్ చిన్నా, పెద్దా ఐటి కంపెనీలతో సహా అడిగిన చోటల్లా ప్రదర్శించారు. ఇలా ఈ చిత్రాన్ని ఆయన దాదాపు 356 స్క్రీనింగ్‌లు చేశారు. దీన్ని యూట్యూబ్‌లో ఉంచినపుడు 1.68 లక్షల వ్యూస్ లభించాయి. 'జియో ఫిల్మ్‌ఫేర్ షార్ట్‌ఫిల్మ్ అవార్డ్స్' వేడుక 8, జనవరి, 2018న జరిగింది. ఈ వేడుకలో హరిమోహన్ లఘుచిత్రానికి 'బెస్ట్ షార్ట్‌ఫిల్మ్' అవార్డు లభించింది. కరణ్‌జోహర్, నిఖిల్ అద్వాని వంటి హేమాహేమీలు జ్యూరీ సభ్యులుగా వ్యవహరించారు. కేరళలోని త్రిస్సూర్‌లో జన్మించిన హరిమోహన్ ఒక మధ్యతరగతి యువకుడు. చెన్నయ్‌లోని ఎస్ఎఇ ఫిల్మ్ స్కూల్‌లో ఆయన విద్యనభ్యసించారు. సుప్రసిద్ధ దర్శకుడు షాజీకైలాస్ దగ్గర కొన్నాళ్ళు అసిస్టెంట్‌గా పనిచేశారు. తరువాత టీకొట్టు యజమాని విజయన్ ప్రపంచ యాత్రల గురించి విన్నారు. ఆయనను కలిసిన తరువాత జీవితం పట్ల విజయన్ దార్శనిక దృక్కోణం హరిమోహన్‌ను బాగా ఆకర్షించింది. ఇప్పుడాయన చిన్నపిల్లలతో 'కౌచారైస్' అనే పూర్తిస్థాయి సినిమాకు దర్శకత్వ బాధ్యతలు చేపట్టారు. ఒక ప్రయాణికుడి గాథ, మరో సైకిల్ ప్రయాణికుడికి స్ఫూర్తిగా మారి విజయం వైపుగా నడిపించింది.



హరిమోహన్

-కల్కి



విజయన్



బంగారు తెలంగాణ







(మొదటిపేజీ తరువాయి)


గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌లో 69వ గణతంత్ర వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఉద యం 9 గంటలకు సీఎం కేసీఆర్ అమరవీరులకు నివాళుల ర్పించారు. అనంతరం గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ జెండాను ఆవిష్కరించి భద్రతా దళాల గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా త్రివిధ దళాల కవాతు ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. అనంతరం గవర్నర్ నరసింహన్ మాట్లాడుతూ... సంక్షేమ పథకాల కోసం ప్రభు త్వం ఏటా రూ. 40 వేల కోట్లు ఖర్చు చేస్తోందన్నారు. తెలం గాణ విద్యుత్ సంక్షోభాన్ని అధిగమించిందన్నారు. పేద ఆడ పిల్లల పెళ్లిళ్ల కోసం కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ ద్వారా ప్రభుత్వం ఆర్థికసాయం అందిస్తోందన్నారు. వృద్ధులు, వితం తువులతో పాటు ఒంటరి మహిళలకు పింఛన్ ఇస్తున్నమని తెలిపారు. అంగన్‌వాడీ, ఆశావర్కర్లు, వీఆర్ఏలకు వేతనాలు పెంచినట్టు వెల్లడించారు. రైతులకు సమయానికి ఎరువులు, విత్తనాలు అందిస్తున్నామన్నారు. సాగునీటి ప్రాజెక్టుల కోసం ఏటా రూ. 25 వేల కోట్లు కేటాయిస్తున్నట్టు పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో రాష్ట్రంలో చాలా ప్రాంతాలకు సాగునీరం దుతుందని తెలిపారు. రైతులకు ఈ ఏడాది నుంచి రెండు పంటలకు సాగుకు పెట్టుబడి అందిస్తున్నట్టు పేర్కొన్నారు. రైతుల కోసం 22 లక్షల టన్నుల గోడౌన్లను నిర్మిస్తున్నామని, మిషన్ కాకతీయ ద్వారా భూగర్భ జలాలు పెరిగాయని, ప్రభుత్వం దిగ్విజయంగా భూరికార్డుల ప్రక్షాళన నిర్వహించిం దని అన్నారు. యాదవ, కురుమలకు గొర్రెలను అందిస్తున్న ట్టు గవర్నర్ తెలిపారు. గంగపుత్రుల సంక్షేమానికి చేప పిల్లలను పంపిణీ చేస్తున్నామని, నాయీ బ్రాహ్మణుల కోసం అధు నాతన సెలూన్లు ఏర్పాటు చేస్తు న్నామని పేర్కొన్నారు. పర్యావ రణ పరిరక్షణ కోసం హరితహా రం చేపట్టినట్టు తెలిపారు. హైద రాబాద్ మాత్రమే కాక.. రాష్ట్రంలోని ఇతర పట్టణాలకూ ఐటీ పరిశ్రమను విస్తరిస్తున్నట్టు పేర్కొన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో 2 లక్షల ఉద్యోగాలు కల్పిస్తున్నట్టు తెలిపారు. ఐటీ ఎగుమతుల్లో 12 శాతం వృద్ధి సాధించామని వెల్లడించారు. యావత్ దేశం గణతంత్ర దినోత్సవాన్ని జాతీయ పండుగగా జరుపుకొంటున్నదని, ఈ శుభ సమయంలో మన దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన ఎందరో అమర వీరులను, త్యాగమూర్తులను స్మరించుకోవడం మన బాధ్యత అని పేర్కొన్నారు. ఆ మహనీయుల ఆశయాల సాధనకు మనందరం కృషి చేద్దామని పిలుపునిచ్చారు. బాధ్యత గల పౌరులుగా బంగారు తెలంగాణ సాధన లక్ష్యంతో అందరూ అహర్నిశలు శ్రమించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్పీకర్ మధుసూదనాచారి, మండలి చైర్మన్ స్వామిగౌడ్, రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, సీఎస్ ఎస్పీ సింగ్, డీజీపీ మహేందర్‌రెడ్డి, ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.





అవార్డుల ప్రదానం...

గణతంత్ర వేడుకల సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం పౌర సేవల్లో ప్రతిభ కనబర్చిన ప్రభుత్వాధికారులకు ప్రశంస పత్రా లను అందించింది. గవర్నర్ నరసింహన్ పలు జిల్లాల కలెక్టర్లతోపాటు పోలీసు అధికారులకు అవార్డులు అందజేశారు. యాదాద్రి భువనగిరి కలెక్టర్ అనితా రామచంద్రన్, షీ టీమ్స్ ఇంచార్జి స్వాతిలక్రా, తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి సభ్య కార్యదర్శి పి. సత్యనా రాయణ రెడ్డి, ఐఎఫ్ఎస్ అధికారులు ఆర్.శోభ, స్వర్గం శ్రీనివాస్ అవార్డు లు తీసుకున్నవారిలో ఉన్నారు. టీఎస్ ఐపాస్ కింద సత్వర అనుమతులు ఇచ్చిన అధికారులకు కూడా అవార్డులు అందజేశారు.



గణతంత్ర దినోత్సవం సందర్భంగా రాజ్‌భవన్‌లో నిర్వహించిన ఎట్‌హోం కార్యక్రమంలో గవర్నర్ నరసింహన్ దంపతులు, సీఎం కేసీఆర్, ఏపీ స్పీకర్ కోడెల శివప్రసాద్‌రావు తదితరులు



గవర్నర్ విందును బహిష్కరించిన కాంగ్రెస్

- **అయినా.. హాజరైన రాపోలు, దానం నాగేందర్**
- **విషయం తెలిసి వెంటనే నిష్క్రమణ**

హైదరాబాద్, జనవరి 26 (మనం ప్రతినిధి): గవర్నర్ నరసింహన్ గణతంత్ర దినోత్సవం సందర్భంగా రాజ్‌భవన్‌లో నిర్వహించిన ఎట్ హోం కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ బహిష్కరించింది. గవర్నర్ తీరు బాగోలేదంటూ కొద్ది రోజులుగా కాంగ్రెస్ మండిపడుతున్న విషయం తెలిసిందే. ఇసుక మాఫియాపై చర్యలు తీసుకోవాలంటూ ఫిర్యాదు చేసేందుకు వెళ్లినప్పుడు గవర్నర్, కాంగ్రెస్ నేతల మధ్య వాగ్వాదం జరిగినట్లుగా వార్తలు వచ్చాయి. ఈ నేపథ్యంలో విందు కార్యక్రమాన్ని కాంగ్రెస్ బహిష్కరించింది. అయితే.. కార్యక్రమానికి కాంగ్రెస్ నాయకులు దానం నాగేందర్, ఎంపీ రాపోలు ఆనంద భాస్కర్ హాజరు కావడం కాంగ్రెస్ వర్గాల్లో కలకలం సృష్టించింది. బహిష్కరణ విషయం తెలిసిన వెంటనే వీరద్దరూ అక్కడి నుంచి త్వరగా వెళ్లిపోయారు. సీపీఐ కూడా గవర్నర్ తేనేటి విందును బహిష్కరించింది.

మూడు రోజుల్లో పాస్‌పోర్టు

(మొదటిపేజీ తరువాయి)

వయస్సు నిండిన వారంతా ఆధార్, స్వీయ ధృవీకరణ పత్రం (అనెక్సర్–ఈ) సమర్పిం చాల్సి ఉంటుంది. వీరు పాస్‌పోర్టు కోసం ఏవైనా రెండు ధృవీకరణ పత్రాలను సమర్పించాలి. ఓటర్ కార్డు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జారీ చేసిన గుర్తింపు కార్డు, ఎస్‌సీ, ఎస్‌టీ, ఓబీసీ కుల ధృవీకరణ పత్రం, ఆర్మ్‌డ్ లైసెన్స్, మాజీ సైనికుల పెన్షన్ బుక్, పాన్ కార్డు, విద్యాలయాలు జారీ చేసిన విద్యార్థి గుర్తింపు కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, రేషన్ కార్డు, రిజిస్ట్రార్ జారీ చేసిన జనన ధృవీకరణ పత్రం వంటి వాటిలో రెండు ఉంటే సరిపోతుంది. ఇక 18 సంవత్సరాల వయసు లోపు వారైతే ఆధార్‌తో పాటు విద్యార్థి గుర్తింపు కార్డు, జనన ధృవీకరణ పత్రం, రేషన్ కార్డులలో ఏదైనా ఒకటి సమర్పిస్తే సరిపోతుంది. తత్కాల్ విధానంలో దరఖాస్తు చేసేవారికి స్లాట్ బుకింగ్, పాస్‌పోర్టు పుస్తకం ప్రచురణలో ప్రాధాన్యం ఉంటుంది. సాధారణ పాస్‌పోర్టుకు ఎటువంటి అత్యవసర పత్రాలు, అనెక్సర్ –బి అవసరం ఉండదు. పోలీసు విచారణ తరువాత ఇవి జారీ అవుతాయి.

భరతమాతకు సప్తహారతులు

(మొదటిపేజీ తరువాయి)

ఫౌండేషన్ చైర్‌పర్సన్ కిషన్ రెడ్డి తెలిపారు. గణతంత్ర దినోత్సవం సంద ర్భంగా భారతమాత ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం నెక్లెస్‌రోడ్డులోని పీపుల్స్ ప్లాజాలో ‘భారతమాత మహాహారతి’ ఘనంగా జరిగింది. భారత జాతీయగేయం ‘వందేమాతరం’తో కార్యక్రమం ప్రారంభమైంది. బీజేపీ ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేశారు. దేశభక్తి ఉట్టిపడేలా, భారత సంస్కృతీ సంప్రదాయాలను ప్రతిబింబించేలా చిన్నారులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించా యి. భారతజాతి సమగ్రంగా వర్ధిల్లడం కోసం, సమస్త భారతీయులంతా మరొక్కసారి జాతీయవాద స్ఫూర్తికి, ప్రగతికి పునరంకితం కావడానికని పిలుపు ఇవ్వగానే వచ్చిన అశేష ప్రజలందరికీ కిషన్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్య అతిథిగా వచ్చిన పరిపూర్ణానంద స్వామి తన సందేశాన్ని అందించారు. కాశీ నుంచి వచ్చిన పురోహితులు 25 అడుగుల ఎత్తున్న ‘భారతమాత’ విగ్రహానికి సప్తహారతులు అందించారు. రెండువేల మంది చిన్నారులు భారతమాత వేషధారణలో ఈ కార్యక్రమానికి హాజరవగా, ఇది ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్సులో స్థానం పొందింది. యాంకర్ ఝాన్సీ ఈ వేడుకకు వ్యాఖ్యాతగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో సినీ నటి మంచు లక్ష్మి , బండారు దత్తాత్రేయ, శ్యామ్ కుమార్, డా.లక్ష్మణ్, ఎన్‌వీఎస్ ప్రభాకర్, చింతల రామచంద్రారెడ్డి, ఎన్ రాంచంచర్ రావు, కె రాములు, డా. రమేష్, జీ. పాండురంగారావు, శ్యామ్ సుందర్ గౌడ్, రావుల శ్రీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జంపన్నవాగులో అబ్బియా..

మొదటిపేజీ తరువాయి

ముందుగానే అమ్మవారి దర్శనానికి పల్లెలు తరలుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం జాతరకు ఏర్పాట్లు పూర్తిచేసింది. ఇప్పటికే గోవిందరాజు దారిలో వన్ వేను అమలుచేసింది. జాతరలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసు కోకుండా అత్యాధునిక భద్రతా ఏర్పాట్లు చేసింది.



రూ. 80.50 కోట్లతో ఏర్పాట్లు

తెలంగాణ కుంభమేళా(మేడారం జాతర)కు దాదాపు కోటి మంది భక్తులు వస్తారని అధికార యంత్రాంగం అంచనా వేసింది. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఆవిర్భవించిన తర్వాత రెండోసారి జాతరను నిర్వహిస్తుండటంతో గతంలో కంటే మెరుగ్గా సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వం సంకల్పించింది. దీనికితోడు ఈ జాతరకు జాతీయస్థాయిలో గుర్తింపు తీసుకొచ్చేం దుకు ప్రచారం చేపట్టింది. తెలంగాణలోనే కాకుం డా ఇతర రాష్ట్రాలతో పాటు విదేశాల్లోనూ జాతర ప్రచార కార్యక్రమాలను ప్రభుత్వం చేపట్టింది. జాతరకు వచ్చే భక్తులకు ఇబ్బందులు లేకుండా రూ. 80.50 కోట్లతో ఏర్పాట్లు పకడ్బందీగా చేస్తోంది. జాతర విశేషాలు, రవాణా మార్గాల గురించి తెలుసుకునేందుకు రెండు యాప్‌లను ఏ ర్పాటు చేసింది. దాంతోపాటు జాతర పేరుమీద ఫేస్‌బుక్ ఖాతాను సైతం తెరిచారు. భద్రతాప రంగా విహంగవీక్షణం చేసేందుకు పారామో టర్‌ను మరో రెండు రోజుల్లో ప్రారంభిస్తారు.

కుంకుమ భరిణె తాకాలనే తాపత్రయం

ప్రధాన ఘట్టంగా చెప్పుకొనే సమ్మక్క ఆగమనం సందర్భంలో ప్రతిసారీ తోపులాటలు చోటుచేసుకుంటున్నాయి. సమ్మక్క ప్రతిరూపంగా భావించే పసుపు, కుంకుమ భరిణెను చిలకలగుట్ట నుంచి తీసుకొచ్చే సమయంలో భక్తులు దాన్ని తాకాలని తాపత్రయపడుతారు. అప్పుడే తోపులాట జరుగుతోంది. దీంతో ప్రత్యేకంగా దృష్టి సారించిన రాష్ట్ర ప్రభుత్వం ఇక్కడే 10వేల మందికి పైగా సిబ్బందిని మోహ రించింది.

ప్రత్యేకంగా ఇద్దరు పర్యవేక్షణ అధికారులు

జాతరను పకడ్బందీగా నిర్వహించేందుకు ప్రత్యేకంగా ఇద్దరు పర్యవేక్షణ అధికారులను ప్రభుత్వం నియమించింది. భూపాలపల్లి జాయింట్ కలెక్టర్ అనుమయ్‌కుమార్, ములుగు సబ్‌కలెక్టర్ గౌతమ్‌లు నిత్యం మేడారంలో ఉంటున్నారు. దీనికితోడు నాలుగు జాతరల్లో పాలుపంచుకున్న సీనియర్ ఐఏఎస్ అధికారిణి వాకాటి కరుణ ప్రత్యేక పర్యవేక్షణ జాతర విజయవంతంగా కొనసాగేందుకు కీలకం కానుంది.

రూ.8 కోట్లతో హరిత హోటల్

జాతీయస్థాయిలో జాతరకు గుర్తింపు తేవడా నికి.. ప్రభుత్వం ఉపరాష్ట్రపతి, ప్రధాని, కేంద్రమంత్రులతో పాటు ఆయా రాష్ట్రాల్లోని గిరిజన మంత్రులనూ ఆహ్వానించింది. వీరికోసం ప్రత్యేకం రూ.8 కోట్లతో హరిత హోటల్‌ను నిర్మించారు. ఇంకా ఐటీడీఏ, అటవీ శాఖ ఆధ్వర్యంలో ఆధునిక టెంట్లు ఏర్పాటు చేశారు.

మనోభావాలు దెబ్బతినకుండా..

జాతరలో అధికారులు, సిబ్బంది తీరుతో భక్తుల మనోభావాలు దెబ్బతినే అవకాశం ఉంటుంది. దీంతో.. ప్రభుత్వం ముందుగానే అలా జరగకూడదని, సజావుగా సాగేలా చూడాలని సూచించింది. జనవరి 31న మేడారానికి చేరుకోవడం కష్టమవుతుందని భావించి.. ముందుగానే అక్కడ రెండు మూడు రోజులు ఉండేలా ప్రణాళిక వేసుకుని భక్తులు వెళ్తున్నారు ఇప్పటికే కరీంనగర్, వరంగల్, ఖమ్మం, నల్లగొండ, నిజామాబాద్ జిల్లాల నుంచి గిరిజనులతో పాటు భక్తులు ముందుగానే మేడారానికి చేరుకుంటున్నారు.





హీరో నానికి తృటిలో తప్పిన ప్రమాదం

హైదరాబాద్ సిటీ, జనవరి 26(మనం ప్రతినిధి): జూబ్లీహిల్స్‌లో శుక్రవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో హీరో నానికి తృటిలో ప్రాణాపాయం తప్పింది. షూటింగ్ ముగించుకొని శుక్రవారం తెల్లవారు జామున 4.30 గంటల ప్రాంతంలో అతడు తన ఇన్నోవా కారు(టీఎస్ 07ఎఫ్‌సి 0024)లో వెళ్తుండగా జూబ్లీహిల్స్ రోడ్ నెం.45లో ప్రమాదం జరిగింది. డ్రైవర్ శ్రీనివాస్ ని ద్రమత్తుతో జోగడంతో కారు అదుపు తప్పి విద్యుత్ స్థంభాన్ని ఢీ కొట్టింది. దీంతో కారు ఒక్కసారిగా పైకి లేచి పక్కనే ఉన్న ఫుట్‌ఫాత్‌ను ఢీకొట్టడంతో ముందు భాగం అంతా నుజ్జునుజ్జు అయింది. అయితే అదృష్టవశాత్తు నాని కారు మధ్య సీటులో కూర్చోవడం వల్ల ఎలాంటి గాయాలు కాలేదు. వెంటనే అతడు క్యాబ్‌లో గచ్చిబౌలిలోని తన నివాసానికి వెళ్లిపోయాడు. సమాచారం అందుకున్న జూబ్లీహిల్స్ పోలీసులు ఘటన స్థలానికి వచ్చి శ్రీనివాస్‌ను విచారించగా తాను వేగంగా వెళ్తున్నానని నిద్ర రావడంతో కారు అదుపు తప్పినట్లు తెలిపాడు. శ్రీనివాస్‌ను పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి శ్వాస పరీక్షలు నిర్వహించగా మద్యం తీసుకోలేదని తేలింది. కాగా సాయంత్రం వరకు ఈ కారులో శ్రీనివాస్ ఒక్కడే ఉన్నట్లుగా ప్రచారం జరిగింది. రాత్రి 7 గంటల ప్రాంతంలో పోలీసులు నాని తండ్రి రాంబాబుకు ఫోన్ చేసి ఆరా తీశారు. ఆ సమయంలో నాని కారులో ఉన్నాడని షూటింగ్ ముగించుకొని తిరిగి వస్తుండ గా ఈ ప్రమాదం జరిగినట్లుగా తెలిపారు. పోలీసులు 3/పీపీడీఏ చట్టం (పబ్లిక్ ప్రొక్యూర్‌మెంట్ అండ్ డిస్ట్రక్షన్ యాక్ట్) కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. కాగా ఈ కారు హీరో నాని తండ్రి గంటా రాంబాబు పేరు మీద ఉంది. ఓవర్ స్పీడ్ కారణంగా గత ఏడాది జూన్‌లో ట్రాఫిక్ పోలీసులు రూ.1400 చలానా విధించారు. అయితే ఆ చలానా ఇప్పటికీ పెండింగ్‌లోనే ఉంది.

నేను క్షేమంగానే ఉన్నా.. నాని

జూబ్లీహిల్స్ రోడ్ నెం.45లో జరిగిన కారు ప్రమాదంపై కథానాయకుడు నాని స్పందించారు. తాను క్షేమంగానే ఉన్నట్లు తెలిపారు. కారు ప్రమాదంలో అతి స్వల్ప గాయాలయ్యాయని ట్వీట్ చేశారు. గాయం కారణంగా కృష్ణార్జున యుద్ధం చిత్రీకరణకు స్వల్ప విరామం కలిగిందన్నారు. వారం రోజుల్లో మళ్లీ సినిమా చిత్రీకరణలో పాల్గొననున్నట్లు వెల్లడించారు.

గణతంత్ర వేడుకల్లో ఆరెస్సెస్ చీఫ్

- **కేరళ ఆంక్షలను ధిక్కరించి జెండా ఆవిష్కరణ**

పాలక్కడ్, జనవరి 26: కేరళలోని పాలక్కడ్‌లో ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భగవత్ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. కేరళ ప్రభుత్వం విధించిన ఆంక్షలను ఉల్లంఘించి ఓ ప్రభుత్వ పాఠశాలలో ఆయన జాతీయ జెండా ఆవిష్కరించారు. ప్రభుత్వ శాఖలు, ప్రభుత్వ కార్యాలయాల్లో ఉన్నతాధికారులు, పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు మాత్రమే జెండా ఎగురవేయాలని కేరళ ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. వీటిని ఉల్లంఘిస్తూ పాలక్కడ్ సమీపంలోని కల్లేకాడ్‌లోని ఓ ఉన్నత పాఠశాలలో జరిగిన గణతంత్ర వేడుకల్లో మోహన్ భగవత్ పాల్గొన్నారు. ఇది వివాదాస్పదం కావడంతో ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడిని వివరణ కోరుతూ కలెక్టర్ నోటీసులు ఇచ్చారు.

గణతంత్ర వేడుకల్లో కానిస్టేబుల్ ఆత్మహత్య

లుధియానా(పంజాబ్), జనవరి 26: లుధియానాకు 45 కిలోమీటర్ల దూరంలో ఉన్న జాగ్రాన్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం జరి గిన గణతంత్ర వేడుకల్లో ఓ పోలీసు కానిస్టేబుల్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వేడుకల్లో పాల్గొన్న మన్‌జీత్‌సింగ్(44) అనే కానిస్టేబుల్ తన ఏకే 47 తుపా కీతో తనని తాను కాల్చుకుని అక్కడికక్కడే మరణించాడు. కుటుంబ సమ స్యల వల్లే మన్‌జీత్‌సింగ్ ఆత్మహత్యకు పాల్పడ్డాడని పోలీసులు తెలిపారు.

నంబర్ 1 శత్రువు ఇండియా: జైష్ ప్రకటన

న్యూఢిల్లీ, జనవరి 26: భారతదేశం 69వ గణతంత్ర వేడుకల్లో మునిగిపోయినవేళ.. పాకిస్తాన్ గడ్డపై నుంచి వెలువడిన ఒక ప్రకటన సంచలనంగా మారింది. చైనా అండతో నిర్బంధం నుంచి తప్పించుకు తిరు గుతున్న మౌలానా మసూద్ అజార్ నేతృంలోని జైషే మహ్మద్ సంస్థ ప్రకటించింది. సింధ్ రాష్ట్రంలోని లర్కానాలో జరిగిన బహిరంగ సభలో అ జార్ సోదరుడు, జేషే కీలక నేత మౌలానా తల్హా సైఫ్ ఈ విషయాలను వెల్లడించాడు. ‘‘మనకు నంబర్ 1 శత్రువు ఇండియా, నంబర్ 2 మోదీ. అల్ ఖలామ్(అజార్ నేత త్వంలో నడిచే పత్రిక) ద్వారా ఈ సందేశాన్ని అందరికీ చేరవేయండి. భారత్‌లోని మనవాళ్లు అల్ ఖలామ్ వెబ్‌సైట్ ద్వారా విషయాలను తెలుసుకోవచ్చు. ఉపఖండంలో మినీ సూపర్ పవర్‌గా వ్యవహరిస్తోన్న భారత్.. మొదటి నుంచీ పాకిస్తాన్‌కు అడ్డంకులు సృష్టిస్తూనేఉంది. కానీ కశ్మీర్‌లో మాత్రం భారత సైన్యం గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటున్నది. కశ్మీరీ తల్లులు, సోదరీమణులు సాయం కోసం మనల్ని(పాకిస్థానీలను) పిలిచారు. కానీ మనం మాత్రం బానిసలుగా ఉండిపోయాం. కానీ ఇప్పుడు.. ముజాహిదీన్‌లు సరిహద్దు దాటి చొచ్చుకెళ్లగలుగుతున్నారు’’ అని మౌలానా సైఫ్ వ్యాఖ్యానించాడు.

‘నీట్’ దేశమంతటా ఒక్కటే ప్రశ్నాపత్రం

న్యూఢిల్లీ, జనవరి 26: ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించి నిర్వహించే నేషనల్ ఎలిజబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్(నీట్)లో ఇకపై దేశవ్యాప్తంగా ఒకే ప్రశ్నాపత్రం ఉంటుందని సీబీఎస్ఈ సుప్రీం కోర్టుకు తెలియజేసింది. హిందీ, ఆంగ్లంతో కలిపి మొత్తం పది భాషల్లో ప్రశ్నాపత్రం ఉంటుందని సీబీఎస్ఈ తెలిపింది. ప్రశ్నాపత్రం రూపకల్ప నలో సీబీఎస్ఈ బోర్డుకు తగిన దిశానిర్దేశం చేయాలని కోరుతూ సంకల్ప అనే స్వచ్ఛంద సంస్థ దాఖలు చేసిన వ్యాజ్యంను ధర్మాసనం విచారించింది. జస్టిస్ అరుణ్ మిశ్రా, ఎఫ్ఏ నజీర్‌తో కూడిన ధర్మాసనం ప్రశ్నాపత్రం తయారీలో సీబీఎస్ఈ అనుసరిస్తున్న విధానాన్ని తప్పుబట్టింది. భాషకు ఒక ప్రశ్నాపత్రం చొప్పున వేర్వేరు ప్రశ్నాపత్రాలు రూపొందించి పోటీ పరీ క్ష నిర్వహించడం అవివేకమని, ఈ విధానం వల్ల విద్యార్థుల ప్రతిభను అంచనా వేయడం కూడా సాధ్యం కాదని బెంచ్ పేర్కొంది. అన్ని ప్రశ్నా పత్రాలు ఒకే స్థాయిలో ఉంటాయని, వేర్వేరు సెట్లు తయారుచేయడం వల్ల పరీక్ష ఏకరూపత దెబ్బతినదని సీబీఎస్ఈ చేసిన వాదనలను న్యాయమూ ర్తులు తోసిపుచ్చారు. సుప్రీంకోర్టు సూచనలకు అంగీకరించన సీబీఎస్ఈ బోర్డు ఈ విద్యాసంవత్సరం నుంచి దేశవ్యాప్తంగా నిర్వహించే పరీక్షకు ఒకే ప్రశ్నాపత్రం రూపొందించి దానిని ఆయా భాషల్లోకి అనువదిస్తామన్నారు.



కోవింద్ కంటతడి

శౌర్య పతకాల ప్రదానంలో భావోద్వేగం

గణతంత్ర వేడుకల్లో అమర జవాన్ల గౌరవార్థం శౌర్య పతకాల ప్రదాన కార్యక్రమంలో రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ భావోద్వేగానికి లోనయ్యారు. గతేడాది నవంబరులో కశ్మీర్‌లో ఉగ్రవాదులపై వీరోచితంగా పోరాడి ఆరుగురి మట్టుబెట్టి.. ఆ పోరులో అమరుడైన ఎయిర్‌ఫోర్స్ కమాండో జ్యోతి ప్రకాశ్ నిరాలాకు అశోక చక్ర అవార్డును కేంద్రం ప్రకటించింది. ఈ పతకాన్ని నిరాలా భార్య, తల్లికి రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన భావోద్వేగానికి లోనాయ్యారు. అమర వీరుడి త్యాగం తలుచుకుని కంటతడి పెట్టారు. ఆయన కన్నీళ్లను కర్చీఫ్‌తో తుడుచుకుంటూ కనిపించారు.









దశదిశలా ఘనకీర్తి

(మొదటి పేజీ తరువాయి)

అత్యున్నత నాయకుడు మాత్రమే రిపబ్లిక్ దినోత్సవం సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరయ్యేవారు. కానీ ఈసారి పదిమంది ముఖ్యఅతిథులు రావడం, భారతదేశ వైభవాన్ని చూడటంతో.. ఈ ప్రాంతంలో మన దేశ ఆధిపత్యాన్ని గట్టిగా చాటినట్లయింది. గజగజ వణికించే చలిలో రైజినా హిల్స్ వైభవం, త్రివిధ దళాల విన్యాసాలు, సాయుధ సంపత్తి, వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు, ప్రభుత్వ శాఖల నుంచి వచ్చిన శకటాలతో విలసిల్లిన సాంస్కృతిక వైభవం చూసి అంతా మైమరచిపోయారు. ఏషియాన్ దేశాల అధినేతల్లో కొందరు భార్యాభర్తలిద్దరూ కలిసి కూడా వచ్చా రు. రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, ప్రధాని నరేంద్రమోదీ సరసన వంద అడుగుల వెడల్పున్న వేదికపై అంతా ఆసీనులయ్యారు. ప్రధాని మోదీ పంచెవన్నెల తలపాగా ధరించి, కుర్తా పైజమాతో అలరించారు. రిపబ్లిక్ డేకు రావడానికి ముందు ఆయన ఇండియాగేట్ సమీపంలోని అమర్ జవాన్ జ్యోతి వద్ద పుష్ప గుచ్ఛం ఉంచి ఘనంగా నివాళులర్పించారు. రాజ్‌పథ్ నుంచి ఎర్రకోట వరకు పటిష్ఠ బందోబస్తు మధ్య మొత్తం ఎనిమిది కిలోమీటర్ల మేర దాదాపు గంటన్నర పాటు పెరేడ్ కొనసాగింది. ఢిల్లీ వీధుల్లో దట్టమైన పొగమంచు అలముకున్నా.. దాన్ని లెక్కచేయకుండా వేలాదిమంది సామాన్య ప్రజలు సైతం ఈ వేడుకలను కళ్లారా చూశారు. సంప్రదాయం ప్రకారం.. జాతీయపతాకాన్ని ఆవిష్కరించిన తర్వాత జాతీయగీతం ఆలపించి, అనంతరం 21 తుపాకులతో కూడిన సెల్యూట్ చేశారు.

పది దేశాల వారు వీరే...



రిపబ్లిక్ వేడుకలకు వచ్చినవారిలో సింగపూర్ ప్రధాని లీ సెన్ లూంగ్, వియత్నామ్ రాజు గయ్ జువాన్ ఫక్, మయన్మార్ రాష్ట్ర కౌన్సెలర్ ఆంగ్‌సాన్ సూక్యీ, ఇండోనేసియా అధ్యక్షుడు జొకో విడోడో, థాయ్‌లాండ్ ప్రధాని జెన్ ప్రయుత్ చాన్-ఓ-చా, ఫిలిప్పీన్స్ అధ్యక్షుడు రోడ్రిగో రో డుటెర్టి, లావోస్ పీడీఆర్ రాజు తోంగ్లౌన్ సిసోలిత్, మలేసియా ప్రధాని నజీబ్ రజాక్, బ్రూనై దారుస్సలాం సుల్తాన్ హసనల్ బొల్కియా, కాంబోడియా రాజు హన్ సెన్ ఉన్నారు. వాళ్లు తమలో తాము మాట్లాడుకుంటూ కొన్ని సన్నివేశాలను తమ కెమెరాలలో కూడా బంధించుకున్నారు. ఈ పది దేశాలను గౌరవించాలని.. ఈసారి పద్మ అవార్డులలో ఒకో ఏసియాన్ దేశం నుంచి ఒక్కొక్కరి చొప్పున అవార్డులిచ్చారు. రిపబ్లిక్ పెరేడ్‌లో పాల్గొన్న వాహనాలపై కూడా ఈ దేశాల పతాకాలు ఉంచారు. ఆయా దేశాల సంస్కృతిని సైతం ఆ శకటాలపై ప్రతిబింబించారు.

23 శకటాలు.. సైనిక సత్తా

రిపబ్లిక్ డే పెరేడ్‌లో మొత్తం 23 శకటాలు తమ వైభవాన్ని ప్రదర్శించాయి. వీటిలో 14 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలతో పాటు ఆలిండియా రేడియో, వివిధ ప్రభుత్వ శాఖల శకటాలు కూడా ఉన్నాయి. ఇవన్నీ ఆయా ప్రాంతాలు, శాఖలకు సంబంధించిన సాంస్కృతిక వైభవాన్ని ఘనంగా చాటాయి. భారత ఆర్మీకి చెందిన టి-90 ట్యాంకు (భీష్మ), బ్రహ్మోస్ క్షిపణి వ్యవస్థ, ఆయుధాలను గుర్తించే స్వాతి రాడార్, వంతెనలు వేసే టి-72 ట్యాంక్, ఆకాశ్ ఆయుధ వ్యవస్థ ప్రధానంగా ఉండి చూపరులను సంభ్రమాశ్చర్యాలకు గురిచేశాయి. పంజాబ్ రెజిమెంటులోని అశ్విక దళం, ఒంటెల దళం, మరాఠా లైట్ ఇన్‌ఫాంట్రీ, డోగ్రా రెజిమెంట్, లడఖ్ స్కౌట్లు, 123 ఇన్‌ఫాంట్రా బెటాలియన్, టెరిటోరియల్ ఆర్మీ.. ఇవన్నీ కూడా ప్రదర్శలో పాల్గొన్నాయి. ఇక 144 మంది యువ నావికులతో కూడిన నౌకాదళ కంటింజెంటుకు లెఫ్టినెంట్ తుసార్ గౌతమ్ నేతృత్వం వహించారు. అలాగే ఇండియన్ ఎయర్‌ఫోర్స్‌కు చెందిన 144 మంది బృందానికి స్క్వాడ్రన్ లీడర్ అటల్‌సింగ్ షెఖాన్ నాయకత్వం వహించారు. పారామిలటరీ, ఆగ్జిలరీ సివిల్ దళాలు, బీఎస్ఎఫ్ బలగాలు కూడా పెరేడ్‌లో పాల్గొన్నాయి. ఇండియన్ కోస్ట్ గార్డ్, సశస్త్ర సీమాబల్, ఇండో టిబెటన్ బోర్డర్ పోలీస్, ఢిల్లీ పోలీసులు, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు సైతం మార్చిఫాస్ట్‌లో పాల్గొన్నారు. భారతీయ వైమానిక దళం ఇక్కడే సొంతంగా అభివృద్ధి చేసుకున్న తేలికపాటి యుద్ధ విమానం తేజస్, సి-130జె సూపర్ హెర్క్యులస్, సి-17 గ్లోబ్‌మాస్టర్, ఎస్‌యు-30 ఎంకేఐలు.. ఇవన్నీ విన్యాసాలు ప్రదర్శించాయి. వీటితోపాటు పూర్తి దేశీయంగా రూపొందించిన విమానవాహకనౌక ఐఏసీ విక్రాంత్, డీఆర్‌డీఓ అభివృద్ధి చేసిన నిర్భయ్ క్షిపణి, అశ్విని రాడార్ వ్యవస్థ సైతం పాల్గొన్నాయి. చివరిలో ఎంఐ-17, రుద్ర హెలికాప్టర్లు, అనేక విమానాలతో చేసిన విన్యాసాలు చూపరులను ఆకట్టుకున్నాయి. ముందుగా రుద్ర హెలికాప్టర్లు, ఏఎల్‌హెచ్ ఎంకే 4 డబ్ల్యుఎస్ఐ హెలికాప్టర్లు రాగా వాటివెనుక సి-130జె సూపర్ హెర్క్యులస్ విమానాలు వచ్చాయి. వీటన్నింటి వెనుక నేత్ర వచ్చింది. అది ముందస్తు హెచ్చరిక, నియంత్రణ వ్యవస్థ విమానం. దీన్ని 'గగననేత్రం' అంటారు. ఆ తర్వాత సి-17 గ్లోబ్‌మాస్టర్, రెండు ఎస్‌యు-30 ఎంకేఐలు ఇతర విమానాలు వచ్చాయి. పెరేడ్‌కు లెఫ్టినెంట్ జనరల్ అసిత్ మిస్త్రీ నాయకత్వం వహించారు.



అతిరథ మహారథులంతా..

మోదీ సర్కారులోని చాలామంది మంత్రులు ఈ వేడుకలకు హాజరయ్యారు. ప్రధానంగా హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్, ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ, ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా, సమాచార ప్రసార శాఖ మంత్రి స్మృతి ఇరానీ, న్యాయశాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్, పర్యావరణ శాఖ మంత్రి హర్షవర్ధన్ తదితరులు పాల్గొన్నారు. కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు రాహుల్ గాంధీ కూడా పెరేడ్ తిలకించారు. ఆయన మధ్యవరుసలో కూర్చుని సీనియర్ నాయకులు గులాం నబీ ఆజాద్ లాంటివారితో చర్చిస్తూ కనిపించారు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోదియా సైతం హాజరయ్యారు. తమ తమ రాష్ట్రాల శకటాలు వచ్చినపుడు వాళ్లు చప్పట్లు కొట్టి ప్రోత్సహించడం కనిపించింది.



'మహిళా సేన' మెరుపులు!

సరిహద్దు భద్రత దళం (బీఎస్ఎఫ్)కు చెందిన మహిళా బైకర్స్ బృందం 'సీమా భవాని' సాహసోపేత స్టంట్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ బృందం తొలిసారి రిపబ్లిక్ డే వేడుకల్లో పాల్గొంది. రాజ్‌పథ్‌లో జరిగిన గణతంత్ర వేడుకల్లో 26 మంది వీర నారీమణుల అద్భుత ప్రదర్శన ఆకట్టుకుంది. ఏటా జరిగే పురుషుల 'డేర్ డెవిల్' ప్రదర్శన స్థానంలో తొలిసారి మహిళా సేన సత్తా చాటింది. సబ్ ఇన్‌స్పెక్టర్ స్టాంజిన్ నోర్యాంగ్ ఆధ్వర్యంలో అమ్మాయిలు 350సీసీ రాయల్ ఎన్‌ఫీల్డ్ బుల్లెట్ మోటార్ బైక్‌లపై స్టంట్స్ అదరగొట్టారు. ప్రెసిడెంట్‌కు సెల్యూట్ చేయడంతో పాటు ఫిష్ రైడింగ్, సైడ్ రైడింగ్ లాంటి స్టంట్లతో సీమా భవానీలు స్పెషల్‌గా నిలిచారు. మొత్తం 100 మంది మహిళా దళంలో అంతా 25 నుంచి 30ఏళ్ల లోపు వారే. బీఎస్ఎఫ్ అకాడమీకి చెందిన సెంట్రల్ స్కూల్ ఆఫ్ మోటార్ ట్రాన్స్‌పోర్ట్‌లో శిక్షణ పొందారు. బీఎస్ఎఫ్‌లోని వివిధ ర్యాంకుల్లో పనిచేస్తున్న మహిళలను ఎంపిక చేసి ఈ బృందాన్ని తయారుచేశారు. 'దుర్గాదేవి లాగా వాళ్లు మన సరిహద్దుల్ని రక్షిస్తున్నారు.. అందుకే వీరి బృందానికి సీమా భవాని అని పేరుపెట్టాం' అని డిప్యూటీ కమాండెంట్ రమేశ్ చంద్ర తెలిపారు.





పరేడ్‌లో సాహస బాలలు

రాజ్‌పథ్‌లో జరిగిన గణతంత్ర దినోత్సవ పరేడ్‌లో జాతీయ సాహస బాలల అవార్డులు పిల్లలు పత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ అవార్డులకు ఎంపికైన 18 మంది బాలల్లో 15 మంది పరేడ్‌లో పాల్గొన్నారు. ఆపదలో ఉన్నవారిని కాపాడేందుకు అసమాన ధైర్యసాహసాలు ప్రదర్శించిన ఈ 18 మంది చిన్నారుల్లో ముగ్గురు తమ ప్రాణాలను కోల్పోయారు. పరేడ్‌లో 15 మంది సాహస బాలలను ప్రత్యేక వాహనాల్లో ముందుకు సాగారు. కాగా, వివిధ రాష్ట్రాలకు చెందిన 800 మంది చిన్నారులు సాంస్కృతిక కార్యక్రమాలతో పరేడ్‌లో అలరించారు. ఇదిలా ఉండగా, ఆసియాన్ దేశాలకు చెందిన 700 మంది బాలలకు కూడా పరేడ్‌లో పాల్గొనే అవకాశం దక్కింది.



రాహుల్ 'సీటు' వివాదం


గణతంత్ర వేడుకల్లో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీకి కేటాయించిన సీటు విషయంలో వివాదం తలెత్తింది. గడిచిన మూడేళ్లలో కాంగ్రెస్ అధినేత్రి హోదాలో సోనియా గాంధీకి పరేడ్‌లో తొలి వరుసలో సీటు కేటాయించేవారు. ఈ ఏడాది పార్టీ చీఫ్ రాహుల్ గాంధీకి ఆ ప్రాధాన్యం దక్కలేదు. ఆయనకు ఆరో వరుసలో సీటు కేటాయించారు. దీనిపై కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలు మోదీ ప్రభుత్వంపై విమర్శలు ఎక్కుపెట్టారు. రాహుల్‌కు ముందు వరుసలో సీటు కేటాయించకుండా ప్రభుత్వం చౌకబారు ఎత్తుగడలకు పాల్పడిందని కాంగ్రెస్ పార్టీ కమ్యూనికేషన్స్ ఇన్‌చార్జ్ రణ్‌దీప్ సూర్జీవాలా వ్యాఖ్యానించారు. రాహుల్‌ను ఉద్దేశపూర్వకంగానే ఆరో వరుసలో కూర్చోబెట్టారని, ప్రభుత్వ అభిమతమేదైనా తమకు మాత్రం రిపబ్లిక్ డే వేడుకలే ప్రధానమని అన్నారు. కాగా, గ్యాలరీలో ముందు వరుసలో మాజీ ప్రధానులు హెచ్‌డీ దేవెగౌడ, మన్మోహన్ సింగ్‌లు కూర్చున్నారు.

మైనస్ 30 డిగ్రీల్లో మువ్వన్నెల పతాకం

- **హిమాలయాల్లో ఐటీబీపీ జవాన్ల ఆవిష్కరణ**

మంచు కొండలు.. ఎముకలు కొరికే చలి.. కాళ్లు కూరుకుపోయే మంచు.. ఇవేవీ వారి దేశభక్తిని అడ్డుకోలేవు. మైనస్ 30 డిగ్రీల ఉష్ణోగ్రత ఉన్న హిమాలయాల్లో ఐటీబీపీ (ఇండో-టిబెటన్ బోర్డర్ పోలీస్) జవాన్లు మువ్వన్నెల పతాకాన్ని ఆవిష్కరించారు. 69వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ఐటీబీపీ జవాన్లు దాదాపు 18వేల అడుగుల ఎత్తులో జాతీయపతాకాన్ని ఎగరవేసి యావత్ దేశ ప్రజలు గర్వపడేలా చేశారు. వారి అసమాన్య సాహసాన్ని వీడియో చిత్రించి.. ఐటీబీపీ తన అధికారిక ట్విటర్ ఖాతాలో పోస్టు చేసింది. ప్రస్తుతం ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. ప్రాణాలను లెక్కచేయకుండా దేశంపై తమకు ఉన్న ప్రేమను చాటి చెబుతూ జవాన్లు చేసిన సాహసానికి నెటిజన్లు సలాం కొడుతున్నారు. 'మిమ్మల్ని చూస్తేంటే గర్వంగా ఉంది'... 'సెల్యూట్'.. 'జైహింద్'... 'నిజమైన హీరోలంటే మీరే'... అంటూ నెటిజన్లు ప్రశంసిస్తున్నారు.

పాక్ మిఠాయిలు తిరస్కరణ



సరిహద్దులో పాక్ తీపి కానుకకు చేదు అనుభవమిది.. గణతంత్ర దినోత్సవం సందర్భంగా సరిహద్దులో పాక్ మిఠాయిలను భారత సరిహద్దు దళం తిరస్కరించింది. ఏటా స్వాతంత్ర్య దినోత్సవం, రిపబ్లిక్ డేల సందర్భంగా ఇరు దేశాల సైనికులు అటారీ-వాఘా సరిహద్దు వద్ద మిఠాయిలు పంచుకోవడం ఆనవాయితీ. అయితే ఇటీవల పాకిస్థాన్ వరుసగా సరిహద్దు వెంట దాడులు, నిత్యం కాల్పుల విరమణ ఒప్పందానికి తూట్లు పొడుస్తున్న నేపథ్యంలో స్వీట్లు అందుకోబోమని చెప్పి భారత్ నిరసన తెలిపింది. ఈ విషయం గురువారమే పాక్ రేంజర్లకు స్పష్టంచేసినట్లు బీఎస్ఎఫ్ వెల్లడించింది. అయితే బంగ్లాదేశ్ బలగాలతో మాత్రం మన జవాన్లు స్వీట్లు ఇచ్చిపుచ్చుకున్నారు.

యూపీ మంత్రి తడబాటు

లఖ్‌నవ్, జనవరి 26: గణతంత్ర వేడుకల్లో ఉత్తరప్రదేశ్ మంత్రి తడబడ్డారు. దేశవ్యాప్తంగా 59వ గణతంత్ర దినోత్సవ వేడుకలు జరుపుకోవడం సంతోషంగా ఉందని యూపీ విద్యాశాఖ మంత్రి సందీప్ సింగ్ వ్యాఖ్యానించారు. 69వ గణతంత్ర దినోత్సవానికి బదులుగా 59వ గణతంత్ర దినోత్సవ వేడుకలు అని మంత్రి వ్యాఖ్యానించడంపై విమర్శలు వెలువెత్తుతున్నాయి. అలీగఢ్‌లో నిర్వహించిన రిపబ్లిక్ డే వేడుకలకు మంత్రి సందీప్ సింగ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారతీయులంతా కలిసి 59వ గణతంత్ర దినోత్సవ వేడుకలు జరుపుకోవడం గొప్పగా ఉందన్నారు. మంత్రి ప్రసంగం వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దీంతో కాంగ్రెస్ నేతలతో పాటు నెటిజన్లు కూడా విమర్శల వర్షం కురిపిస్తున్నారు.

రాజ్యాంగాన్ని పరిరక్షించండి

ముంబైలో విపక్ష నేతల ర్యాలీ



ముంబై, జనవరి 26: రాజ్యాంగాన్ని రక్షించుకుందాం అనే పేరుతో ముంబైలో తలపెట్టిన ర్యాలీ 2019 లోక్‌సభ ఎన్నికల ముందు ప్రతిపక్ష నేతలను ఒక దగ్గరికి చేర్చింది. బీజేపీని వ్యతిరేకిస్తున్న పార్టీలకు ఈ ర్యాలీ వేదికగా మారింది. ప్రతిపక్ష నేతలు శరద్‌పవార్, శరద్‌యాదవ్, డి.రాజా, హర్దిక్ పటేల్, ఒమర్ అబ్దుల్లా, దినేష్ త్రివేది, సుశీల్‌కుమార్ షిండే తదితరులు ముంబైలో కలిశారు. మహారాష్ట్ర అసెంబ్లీ ప్రతిపక్ష నేత రాధాకృష్ణ విఖే పాటిల్ ఇంట్లో వీరంతా సమావేశమయ్యారని తెలిసింది. ఎన్సీపీ నేతలు ప్రఫుల్ పటేల్, డీపీ త్రిపాఠి, మాజీ ఎంపీ రామ్ జఠ్మాలని, తృణమూల్ కాంగ్రెస్ తరపున మాజీ రైల్వే మంత్రి త్రివేది ర్యాలీలో పాల్గొన్నారు. మహారాష్ట్ర స్వతంత్ర ఎంపీ రాజు సేతీ ఆధ్వర్యంలో ర్యాలీ జరుగుతుంది. ముంబై యూనివర్సిటీ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహం నుంచి గేట్ వే ఆఫ్ ఇండియా వరకు మౌనంగా ర్యాలీ చేశారు. అయితే ప్రతిపక్షాలకు పోటీగా తిరంగ యాత్ర పేరుతో బీజేపీ కూడా ముంబైలో ఓ కార్యక్రమం నిర్వహించింది. ముంబై బీజేపీ అధ్యక్షుడు ఆశిష్ షిలార్, ముఖ్యమంత్రి దేవందర్ ఫడ్నవీస్, పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. కాగా, ముఖ్యమంత్రి దేవందర్ ఫడ్నవీస్ ఈ కార్యక్రమంలో ప్రసంగిస్తారు.

ఆస్పత్రిలో అగ్నిప్రమాదం

41 మంది దుర్మరణం.. 80 మందికి తీవ్ర గాయాలు.. దక్షిణ కొరియాలో ఘోరం



సియోల్, జనవరి 26: వందల మంది రోగులు చికిత్స పొందుతున్న ఆస్పత్రిలో ఘోర అగ్ని ప్రమాదం జరిగింది. దక్షిణ కొరియాలోని మిర్యాంగ్ నగరంలో గల సెజోంగ్ ఆస్పతిలో జరిగిన ఈ ప్రమదంలో 41 మంది దుర్మరణం చెందారు. మరో 80 మందికిపైగా తీవ్ర గాయాలపాలయ్యారు. 200 పడకలతో అత్యాధునిక వైద్య సదుపాయాలు కలిగిన ఆస్పత్రి ఇది. శుక్రవారం ఉదయం అత్యవసర సేవల విభాగంలో ఉన్నట్టుండి మంటలు చెలరేగాయి. దీనిని డ్యూటీ నర్సులు ఆలస్యంగా గుర్తించారు. అప్పటికే పలు వార్డులకు మంటలు వ్యాపించాయి. ఈ సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బందికి అక్కడికి చేరుకుని మంటలు ఆర్పడంతో పాటు.. రోగులు, వైద్యులు, ఇతర సిబ్బందిని బయటకు తరలించారు. సహాయ చర్యలకు హెలికాప్టర్‌ను కూడా ఉపయోగించారు. ఆస్పత్రిలో ఉన్న మొత్తం 200 మందిని వేగంగా బయటకు తీసుకువచ్చారు. క్షతగాత్రులను మరో ఆస్పత్రికి తరలించారు. మంటలు తొలుత ఎమర్జెన్సీ వార్డులో చెలరేగడంతో అందులో ఉన్న మొత్తం 15 మంది మరణించారు. ఆస్పత్రికి తరలిస్తుండగా కొందరు, చికిత్స పొందుతూ మరికొందరు ప్రాణాలు కోల్పయారు. మధ్యాహ్నానికి మృతుల సంఖ్య 41కి చేరింది. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. సుమారు 80 మందికి పైగా తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్నారు. వీరిలో కొందరి పరిస్థితి విషమంగా ఉంది. కాగా, ఈ ఘటనపై ఆ దేశ అధ్యక్షుడు మూన్ జే ఇన్ అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ప్రమాదంపై దర్యాప్తునకు ఆదేశించారు.



నాగశౌర్య వంటి హీరోలు పరిశ్రమకు అవసరం – చిరంజీవి

'నాగశౌర్య నన్ను కలవాలని చాలాసార్లు ఫోన్ ద్వారా మా ఆఫీస్‌కి కాంటాక్ట్ చేశాడు. నేను అందుబాటులో లేక రెస్పాండ్ కాలేకపోయాను. మళ్ళీ మళ్ళీ ఫోన్ చేస్తే ఎందుకో? ఏమిటోనని రమ్మన్నాను. వారి అమ్మగారితో మా ఇంటికి వచ్చారు. ప్రీ రిలీజ్ ఫంక్షన్ చేస్తున్నాం. మీ సమక్షంలో జరగాలి. తప్పకుండా రావాలని అడిగాడు. ఒక్క నిమిషం ఆలోచించకుండా నాగశౌర్యకి వస్తాను అని చెప్పాను' అన్నారు చిరంజీవి. ఈయన ముఖ్య అతిథిగా పాల్గొన్న చిత్రం 'ఛలో' నాగశౌర్య, రష్మిక మండన్నా జంటగా నటించారు. వెంకీ కుడుముల దర్శకుడు. ఉషా ముల్పూరి నిర్మాత. ఫిబ్రవరి 2న ఈ చిత్రం విడుదలవుతుంది. ఈ కార్యక్రమానికి చిరంజీవి ముఖ్య అతిథిగా హాజరవ్వగా, ప్రముఖ దర్శకులు వంశీ పైడిపల్లి, నందినిరెడ్డి, ప్రముఖ నిర్మాత సి.కళ్యాణ్, సంగీత దర్శకులు మహతి స్వర సాగర్, కళ్యాణి మాలిక్, నటి ప్రగతి, చిత్ర యూనిట్ సభ్యులంతా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంకా చిరంజీవి మాట్లాడుతూ ''నాగశౌర్య నన్ను అతిథిగా రమ్మని కోరాడు. నేను వస్తే ఆ ఉత్సాహం, ప్రోత్సాహం వేరు కాబట్టి నాగశౌర్యకి ప్రోత్సాహం ఇవ్వాలని వచ్చాను. నాగశౌర్య సినిమాలు పెద్ద స్క్రీన్ మీద ఏదీ చూడలేదు. మా నిహారికతో చేసిన సినిమా టీవీలో చూశాను. చాలా హ్యాండ్‌సమ్‌గా వున్నాడు. స్పార్క్‌గా వున్నాడు. మంచి పర్సనాల్టీతో బావున్నాడు. ఇలాంటి హీరోలు ఖచ్చితంగా ఇండస్ట్రీకి రావాలి, కావాలి. అప్పుడే ఇండస్ట్రీకి ఒక ఫ్రెష్‌నెస్, కొత్త ఉత్సాహం వుంటుంది. నాగశౌర్యలాంటి నటులు ఇండస్ట్రీకి వస్తే ఫ్రెష్‌నెస్సే కాదు కొత్త రక్తం కూడా ఇండస్ట్రీకి వచ్చినట్లుగా వుంటుంది. రెండు మూడు సంవత్సరాలుగా చూస్తే పెద్ద హీరోల సినిమాలు ఎంత హిట్ అయ్యాయో యంగ్ హీరోస్ చిత్రాలు కూడా అంతకంటే హిట్ అయ్యాయి. ఇది చాలా హెల్దీ వాతావరణం. కొత్తవారిని అక్కున చేర్చుకుని ఇండస్ట్రీలో మంచి స్థానాన్ని ఇచ్చే గొప్ప మనసున్న ప్రేక్షకులు తెలుగు ప్రేక్షకులు. 'ఛలో' కూడా పెద్ద స్థాయిలో విజయం సాధించాలని నాగశౌర్య కెరీర్‌లో 'ఛలో' బెస్ట్ సినిమాగా నిలబడాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను.. ఈ సినిమా అందర్నీ అలరించి సూపర్‌డూపర్ హిట్ అవ్వాలని కోరుకుంటూ, ఇలాంటి సినిమాలు విజయం పరిశ్రమకి అవసరం. అందరూ సినిమా చూసి ఎంజాయ్ చేస్తారని ఆశిస్తున్నా'' అన్నారు.

సంగీత దర్శకుడు మహతి స్వర సాగర్ మాట్లాడుతూ ''ఐరా క్రియేషన్స్‌లో ఈ సినిమా చేయడం చాలా హ్యాపీగా వుంది. వెంకీ గ్రేట్ ఫ్రెండ్. సినిమాని ఎక్స్‌ట్రార్డినరీగా తీశారు. హండ్రెడ్ పర్సెంట్ జాబ్ శాటిస్‌ఫ్యాక్షన్ ఇచ్చింది. 'ఛలో' బిగ్ సక్సెస్ అవుతుంది'' అన్నారు.

చిత్ర దర్శకుడు వెంకీ కుడుముల మాట్లాడుతూ – ''చిరంజీవిగారికున్న ఫ్యాన్స్, భక్తుల్లో నేను ఒకడ్ని. 'ఇంద్ర', 'ఠాగూర్' ఇలా ఎన్నో సినిమాలకి కటౌట్‌లు కట్టాను. ఆయన కలిసే అవకాశం రాలేదు. మా సినిమా ప్రీ రిలీజ్ వేడుకలో కలుస్తానని అస్సలు ఊహించలేదు. ఒక అసిస్టెంట్ డైరెక్టర్‌ని అయిన నన్ను డైరెక్షన్ ఛాన్స్ ఇచ్చిన ఐరా క్రియేషన్స్‌కి, నాగశౌర్యకి థాంక్స్. శంకర్ ప్రసాద్, ఉషగారు లేకపోతే ఈ సినిమా వచ్చేది కాదు. సాయి శ్రీరామ్ వండ్రఫుల్ విజువల్స్ ఇచ్చారు. సాగర్ ఎక్స్‌ట్రార్డినరీ మ్యూజిక్ ఇచ్చాడు'' అన్నారు.

హీరో నాగశౌర్య మాట్లాడుతూ – ''ఎప్పటికైనా మెగాస్టార్ కుర్చీ మెగాస్టార్‌గారిదే. మళ్ళీ జన్మంటూ వుంటే మా అమ్మా, నాన్నలకే పుడతాను. మెగాస్టార్ అభిమానిగానే పుడతాను. నన్ను సపోర్ట్ చేయడానికి వచ్చిన చిరంజీవిగారికి చాలా చాలా థాంక్స్. వెంకీ చాలా అద్భుతమైన డైరెక్టర్. టు ఇయర్స్‌లో వెంకీ పెద్ద డైరెక్టర్ అయి చిరంజీవిగారితో సినిమా చెయ్యాలని కోరుకుంటున్నాను. కెమెరామెన్ సాయిశ్రీరామ్ లేకుండా ఈ సినిమా లేదు. మా ఐరా క్రియేషన్స్ పెట్టి వాళ్లమే కాదు. మా టీమ్ అందరూ చాలా కష్టపడి వర్క్ చేశారు. అందరికీ థాంక్స్'' అన్నారు.


● 'భరత్ అనే నేను'లో మహేష్‌బాబు

అదే దర్శకుడితో...


● మనోజ్

మంచు మనోజ్, చంద్రశేఖర్ ఏలేటి కాంబోలో తెరకెక్కిన చిత్రం 'ప్రయాణం'. వైవిధ్య కథనంతో తెరకెక్కిన ఈ చిత్రం అప్పట్లో ఎన్నో ప్రశంసలు అందుకుంది. అయితే దాదాపు తొమ్మిదేళ్ల తరువాత ఈ కాంబోలో మరో చిత్రం రాబోతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే దానికి సంబంధించిన కథ కూడా సిద్ధమైనట్లు ఫిలింనగర్‌లో వార్తలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం మంచు మనోజ్ చేతిలో ఒక్క సినిమా కూడా లేదు. మరోవైపు చంద్రశేఖర్ ఏలేటి 'మనమంతా' సినిమా తరువాత ఇంతవరకు తదుపరి ప్రాజెక్ట్‌ను ప్రకటించలేదు. ఈ నేపథ్యంలో తాజాగా మంచు మనోజ్ కోసం ఆయన ఓ కథను సిద్ధం చేసుకొన్నట్లు సమాచారం. ఇక దీనికి సంబంధించిన త్వరలోనే అధికారిక ప్రకటన రానున్నట్లు తెలుస్తోంది.

బాగానే లెక్కలు తేలాయి

'అరుంధతి' సినిమాతో హీరోయిన్ ఓరియెంటెడ్ సినిమాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారిన అనుష్క...ఆ తర్వాత ఇదే తరహాలో 'పంచాక్షరి', 'వర్ణ', 'రుద్రమదేవి', 'సైజ్ జీరో' చిత్రాలు చేశారు. అయితే 'అరుంధతి' స్థాయిలో ఇవేవీ విజయం సాధించలేదు. ఇక గత ఏడాది విడుదలైన 'బాహుబలి 2'లో దేవసేనగా అందరి మన్ననలను పొందారు. 'బాహుబలి 2' తర్వాత అనుష్క నటించిన చిత్రం 'భాగమతి'. అశోక్ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం.. భారీ అంచనాల మధ్య శుక్రవారం ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఈ సినిమాపై 'మనం' అందిస్తున్న సమీక్ష మీ కోసం:



బ్యానర్: యు.వి.క్రియేషన్స్
తారాగణం: అనుష్క, ఉన్ని ముకుందన్, జయరామ్, ఆశా శరత్, ప్రభాస్ శ్రీను, మురళీ శర్మ, ధన్ రాజ్, విద్యుల్లేఖ రామన్ తదితరులు
ఛాయాగ్రహణం: ఆర్. మధి
కూర్పు: కోటగిరి వెంకటేశ్వర రావు
సంగీతం: ఎస్.తమన్
ఆర్ట్ డైరెక్టర్: రవీందర్
నిర్మాతలు: ప్రమోద్, వంశీ
కథ, స్క్రీన్ ప్లే, మాటలు, దర్శకత్వం: జి. అశోక్

కథ:

ప్రజలకు మంచి జరుగుతుందంటే.. దానికి సంబంధించి జరగాల్సిన మార్పు ఏదైనా సరే తన నుంచే మొదలవ్వా లనుకునే వ్యక్తి కేంద్ర మంత్రి ఈశ్వర్ ప్రసాద్ (జయరామ్). రాజకీయ ప్రక్షాళన కోసం రాజకీయ సన్యాసం చేయడానికి కూడా సిద్ధపడతాడు. అంతేగాకుండా.. తనకు ఏ మాత్రం రక్త సంబంధం లేని ఓ సాదాసీదా రైతు బిడ్డను తన రాజకీయ వారసుడిగా ప్రకటిస్తాడు. అలాంటి ఈశ్వర్ ప్రసాద్ మీద మచ్చ వేయాలనుకుని సీబీఐ సహకారం కోరుతుంది అధిష్టానం. జనాల్లో మంచి పలుకుబడి ఉన్న ఈశ్వర్ ప్రసాద్ అంటే అభిమానంతో మచ్చ వేసే పనికి సీనియర్ సీబీఐ అధికారి (జయప్రకాష్) అంగీకరించకపోవడంతో.. మరో సీబీఐ అధికారిణి వైష్ణవి నటరాజన్ (ఆశా శరత్)ను రంగంలోకి దింపుతారు. ఈశ్వర్‌కు సంబంధించిన ప్రతి కదలిక తెలిసిన వ్యక్తి.. ఆయన దగ్గర పర్సనల్ సెక్రటరీగా పని చేసిన ఐఏఎస్ అధికారిణి చంచల (అనుష్క). ఆమె నుంచి ఒక్క నెగెటివ్ క్లూ దొరికినా.. ఈశ్వర్‌పై మచ్చ వేసి ప్రజల్లో అతనిపై ఉన్న అభిప్రాయాన్ని మార్చాలన్నది సీబీఐ ప్లాన్. తను ప్రాణం కంటే ఎక్కువగా ప్రేమించిన శక్తి (ఉన్నిముకుందన్)ని చంపిన కేసులో జైలులో ఉంటుంది చంచల. ఇంటరాగేషన్ పేరుతో ఆమెను ఓ పాడుబడిన బంగ్లాలో ఉంచుతారు. ఆ బంగ్లా పేరు.. భాగమతి బంగ్లా. అందులో దయ్యాలు సైతం ఉండడానికి భయపడతాయని.. ఆ బంగ్లాలో పనిచేసే వాచ్‌మన్ దగ్గర్నుంచి అందరూ అంటుంటారు. ఉదయం పూట ఇంటరాగేషన్.. సాయంత్రం పూట విచిత్రమైన పరిస్థితులు.. వీటి మధ్య చంచల ఇబ్బందుల పాలవుతుంటుంది. ఇంటరాగేషన్ చేస్తున్న వైష్ణవికి చంచల నుంచి ఒక్క నెగెటివ్ క్లూ కూడా దొరకదు. అదే సమయంలో.. ఓ రాత్రి చంచలలో భాగమతి ప్రవేశిస్తుంది. ఇంతకీ భాగమతి ఎవరు? దయ్యాలు కూడా భయప డేంతగా ఆ భవంతిలో ఏముంది? చంచల, భాగమతి మధ్య సంబంధమేమిటి? అసలు చంచల.. శక్తిని ఎందుకు చంపింది? ఈశ్వర్ ప్రసాద్ కేసు ఎలాంటి మలుపు తిరిగింది? ఇలాంటి అనేక ప్రశ్నలకు సమాధానం.. 'భాగమతి' చిత్రం.

విశ్లేషణ:

తమిళ అనువాద చిత్రం 'పిజ్జా' స్క్రీన్ ప్లేని కాస్త అటుఇటుగా మారిస్తే.. అది 'భాగమతి' చిత్రంలా ఉంటుంది. కాకపోతే.. అక్కడ కథానాయకుడు తన స్వప్రయోజనం కోసం ఓ కట్టుకథను చెబితే.. ఇందులో కథానాయిక ప్రజల మంచి కోసం ఓ కట్టుకథ చెబుతుంది. అయితే.. దాన్ని తెరపై ఆసక్తికరంగా మలచడంలో దర్శకుడి ఆలోచన మెప్పిస్తుంది. హర్రర్ ఎలిమెంట్స్ బాగానే ఉన్నా.. ప్రధానంగా రాజకీయ నేపథ్యంలో సాగే చిత్రమిది. లాజిక్‌లు పక్కన పెడితే.. సినిమా ఆద్యంతం ఆసక్తికరంగా సాగుతుంది.

నటీనటుల విషయానికి వస్తే.. చంచలగానూ, భాగమతిగానూ రెండు కోణాలున్న పాత్రలో అనుష్క నటన అలరిస్తుంది. భయపడే సన్నివేశాల్లోనూ, భయపెట్టే సన్నివేశాల్లోనూ ఆమె అభినయం గుర్తుండిపోతుంది. 'అరుంధతి' తర్వాత అనుష్కకు గుర్తుండిపోయే హీరోయిన్ ఒరియెంటెడ్ మూవీ ఇది. ఇక ఈశ్వర్ ప్రసాద్ పాత్రలో జయరామ్ నటన బాగుంది. రెండు ఛాయలున్న పాత్రలో ఒదిగిపోయారాయన. నెగెటివ్ వైబ్రేషన్స్ ఏ మాత్రం ఇష్టపడని వైష్ణవి నటరాజన్ పాత్రలో ఆశా శరత్ నటనను వంక పెట్టలేం. అలాగే ఉన్ని ముకుందన్, మురళీ శర్మ.. పాత్రల పరిధి మేర మెప్పించారు. సాంకేతిక నిపుణుల విషయానికి వస్తే.. తమన్ అందించిన నేపథ్య సంగీతం సినిమాను మరో స్థాయికి తీసుకువెళ్లింది. ఆర్ట్ డైరెక్టర్ రవీందర్ వేసిన 'భాగమతి' బంగ్లా సెట్ అద్భుతమనే చెప్పాలి. మధి ఛాయాగ్రహణం మెప్పిస్తుంది. విజువల్ ఎఫెక్ట్స్ అలరిస్తాయి. నిర్మాణ విలువలకు వంక పెట్టలేం.

చివరగా.. బాగానే లెక్కలు తేలాయి

రేటింగ్.. 3/5


● ఇళయరాజా

స్వర భూషణుడిని వరించిన పద్మవిభూషణ్

1970వ దశకానికి ముందు సినీ సంగీతం అమృత జల్లులు కురిపించింది.. మనసుకు ఆహ్లాదాన్ని కలిగించింది. పండితుల నుంచి పామరుల వరకు మనసారా పాడుకునే స్వేచ్ఛనిచ్చింది. పాటల్లోని పదాలు, సంగీతంలోని సంగతులు అందరికీ అర్థమయ్యే రీతిలో ఉండేవి. కాలంతోపాటు సంగీతం కూడా మారింది. ముఖ్యంగా సినీ సంగీతం కొత్త పుంతలు తొక్కింది. అప్పటివరకు వెన్నెల పాటలు పాడుకునే హీరోహీరోయిన్లు ఊరి బయట చిందులు వేస్తూ పాటలు పాడుకోవడం మొదలు పెట్టారు. దానికి తగ్గట్టుగానే సంగీత దర్శకులు కూడా తమ బాణీలను మార్చారు. సందర్భానికి అనుగుణంగా వాద్యాలు కూడా మార్చారు. క్లాస్ పాటలు కాస్తా మాస్ పాటలుగా మారాయి. అలా కొన్ని సంవత్సరాలు మూసధోరణిలో వచ్చే పాటల్నే శ్రోతలు వినేవారు.



ఆ సమయంలో 'చిన్ని చిన్ని కన్నయ్యా... కన్నుల్లో నీవయ్యా' అంటూ ఓ స్వరవాణి తమిళ చిత్ర పరిశ్రమ నుంచి తెలుగు పరిశ్రమకు వచ్చింది. ఆ సుస్వరవాణి ఇళయరాజా. 'భద్రకాళి' చిత్రంతో తెలుగులో సంగీత దర్శకుడుగా పరిచయమయ్యారు. అప్పటి వరకు చిందులకే పరిమితమైన తెలుగు సినిమా సంగీతం మాధుర్యం వైపు మరోసారి తొంగి చూసింది. ఇళయరాజాలోని సంగీతజ్ఞానిని గుర్తించింది.. తన అక్కున చేర్చుకుంది. ఆ తర్వాత 'వయసు పిలిచింది' చిత్రం సంగీత దర్శకునిగా ఇళయరాజాకు మంచి గుర్తింపునిచ్చింది. 'మబ్బే మసకేసిందిలే..', 'ఇలాగే ఇలాగే..', 'నువ్వడిగింది ఏనాడైనా లేదన్నానా..' వంటి పాటలు యువతను ఉర్రూతలూగించాయి. ఆ తర్వాత 'ఎర్రగులాబీలు', 'యుగంధర్', 'కొత్త జీవితాలు' చిత్రాల్లోని పాటలు కొత్త తరహా సంగీతంలో శ్రోతల్ని ముంచేశాయి. 1981లో ఇళయారాజా చేసిన 'మౌనగీతం', 'సీతాకోకచిలుక' చిత్రాల్లోని పాటలు మంచి సంగీత దర్శకుడుగా ఆయనకు పేరు తెచ్చిపెట్టాయి. అప్పటికే కె.వి.మహదేవన్, ఎం.ఎస్.విశ్వనాథన్, చక్రవర్తి, రమేష్‌నాయుడు వంటి ప్రముఖ సంగీత దర్శకులు చేసే పాటలకు భిన్నంగా ఇళయరాజా బాణీలు ఉండడంతో ఆయనకు ప్రత్యేకంగా అభిమానులు ఏర్పడ్డారు.

1983లో వచ్చిన 'సాగరసంగమం' చిత్రం సంగీత పరంగా తిరుగులేని విజయాన్ని సాధించింది. దాంతో ఇళయరాజాకు పెద్ద సంఖ్యలో అభిమానులు ఏర్పడ్డారు. హీరో ఎవరైనా, దర్శకుడు ఎవరైనా సంగీతం ఇళయారాజా అనే పేరు ఉంటే చాలు క్యాసెట్స్ విపరీతంగా అమ్ముడుపోయేవి. సినిమా పోస్టర్లపై సంగీత దర్శకుడి ఫోటో కూడా వేయడం ఇళయారాజాతోనే ప్రారంభమైంది. దీన్నిబట్టి ఆయనకు ఎంత జనాదరణ పెరిగిందో అర్థం చేసుకోవచ్చు. వంశీ, ఇళయరాజా కాంబినేషన్‌లో వచ్చిన 'సితార' మ్యూజికల్‌గా చాలా పెద్ద విజయాన్ని సాధించింది. ఆ తర్వాత వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన సినిమాలన్నీ సంగీత పరంగా సంచలనం సృష్టించినవే. సంగీత జ్ఞానం లేని వారిని సైతం పాడించేలా ఇళయరాజా పాటలు ఉండేవి. వాద్యాల కంటే గాత్రానికే ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చి సాహిత్యం స్పష్టంగా వినిపించేలా పాటలు చేయడం ఇళయరాజా ప్రత్యేకత. కాలానుగుణంగా అన్నిరంగాల్లో మార్పులు జరిగినట్టే సినీ సంగీతంలో కూడా మార్పులు జరిగాయి. యువత అభిరుచుల్లో మార్పులు వచ్చాయి. ఎంత మంది సంగీత దర్శకులు వచ్చినా శ్రోతల్లో ఇళయరాజా స్థానం మారలేదు. ప్రస్తుతం ఒకదాన్ని మించి మరో పాట సూపర్‌హిట్ అవుతున్నా ఇళయారాజా పాటలో వన్నె తగ్గలేదు. ప్రస్తుత యాంత్రిక జీవితంలో ఇప్పుడొస్తున్న పాటలు వింటూ సేద తీరే అవకాశం తక్కువ. ఆ సమయంలో ఇళయరాజా పాటలు మేమున్నామంటూ మనల్ని అక్కున చేర్చుకుంటాయి.

> ఇళయరాజా తన కెరీర్‌లో సంగీత పరంగా చేసిన ప్రయోగాలెన్నో. 'అన్వేషణ' చిత్రంలో పక్షుల కూతలనే సంగీతంగా మలిచి వీనుల విందు చేశారు. 'సితార' చిత్రంలో 'కుకుకూ.. కుకుకూ కోకిల రావే' పాటతో కోకిల గానాన్ని వింటున్న అనుభూతిని కలిగించారు. 'ఓపాపాలాలి' చిత్రంలో 'మాటేరాని చిన్నదాని..' అంటూ ఎస్.పి.బాలు చేత బ్రీత్‌లెస్ పాట పాడించి అందర్నీ ఆశ్చర్యపరిచారు. 'మహర్షి' చిత్రంలో బాలుతో సంస్కృతంలో పాట పాడించి సూపర్‌హిట్ చేశారు.

మణిరత్నంలాంటి దర్శకుల సినిమాలకు ఎలాంటి సంగీతం ఇవ్వాలో ఆయనకు బాగా తెలుసు. అలాగే వంశీ లాంటి భావుకత ఉన్న దర్శకుల పాటలు ఎంత మృధుమధురంగా చేయాలో అయనకు అవగతమే. రొటీన్‌కి భిన్నంగా సినిమాలు చేసే బాలచందర్, భారతీరాజా, విశ్వనాథ్ వంటి దర్శకుల సినిమాలకు ఏ తరహా సంగీతం నప్పుతుందో ఆయనకు మాత్రమే తెలుసు. అది ఎలాంటి కథయినా తనదైన సంగీతంతో శ్రోతలను కట్టిపడేయగల మంత్రం ఇళయారాజా దగ్గర ఉంది. అందుకే ఒక్కసారి కలిసి పనిచేసిన దర్శకులు మళ్ళీ మళ్ళీ ఆయనతో సినిమాలు చేయాలని పరితపిస్తారు.



'భద్రకాళి' నుంచి 'రుద్రమదేవి' వరకు దాదాపు 1000 సినిమాలకు సంగీత దర్శకత్వం వహించారు. 5,000 పాటలను స్వరపరిచారు. సినీ సంగీతాన్ని కాచి వడపోసిన ఈ సంగీత జ్ఞానిని ఐదుసార్లు జాతీయ పురస్కారాలు వరించాయి. లండన్‌లోని ఓ యూనివర్సిటీ నుంచి క్లాసికల్ గిటార్‌లో బంగారు పతకాన్ని పొందారు. సినిమా పాటలే కాదు కొన్ని ప్రైవేట్ ఆల్బమ్స్ కూడా చేశారు. వాటిలో భారతీయ, పాశ్చాత్య సంగీత సమ్మేళనంగా రూపొందించిన 'హౌ టు నేమ్ ఇట్', 'నథింగ్ బట్ విండ్' ఆల్బమ్స్ ఇళయారాజాకు మంచి పేరు తెచ్చాయి. ఇవి కాక ప్రపంచవ్యాప్తంగా ఎన్నో ప్రదర్శనలు ఇచ్చారు ఇళయరాజా. ఈ స్వర భూణుడిని ఇప్పుడు పద్మవిభూషణ్ వరించింది. దీంతో సినీ సంగీతం పులకించింది. ఈ సందర్భంగా స్వరజ్ఞాని ఇళయరాజాకు అభినందనలు తెలియజేస్తోంది 'మనం'.

రయ్.. రయ్..!!

దూసుకుపోతున్న వాహన రంగం

- రాష్ట్రంలో భారీగా పెరిగిన విక్రయాలు
- నిరుడు 4.79 లక్షల వాహనాల రిజిస్ట్రేషన్లు
- కార్లపైనే అధిక మోజు.. 27% పెరుగుదల
- సర్కారుకు రూ.4 వేల కోట్ల ఆదాయం

అమరావతి, జనవరి 26 (మనం ప్రతినిధి): నవ్యాంధ్రలో వాహన రంగం శరవేగంగా దూసుకుపోతోంది. ఏటికేడు వాహనాల విక్రయాలు భారీగా పెరిగిపోతున్నాయి. పేద, మధ్యతరగతి వర్గాల వారు ద్విచక్ర వాహనాలను కొనుగోలు చేస్తుండగా.. కొంచెం ఎగువ, సంపన్న వర్గాల ప్రజలు కార్ల కొనుగోలుకు ఆసక్తి కనబర్చుతున్నారు. ఈ క్రమంలో 2017లో ద్విచక్ర వాహనాల విక్రయాలు 25 శాతం, కార్ల విక్రయాలు 27 శాతం పెరిగాయి. రాష్ట్ర వ్యాప్తంగా 2016-17లో రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో సగటున 36 వేల వరకు కొత్త వాహనాల కొనుగోళ్లు, రిజిస్ట్రేషన్లు జరిగాయి. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 4.79 లక్షల వాహనాల రిజిస్ట్రేషన్లు జరిగాయి. 2015-16తో పోలిస్తే నిరుడు 98,550 వాహనాలు అధికంగా అమ్ముడైనట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. దీంతో 2016-17లో రాష్ట్ర ప్రభుత్వానికి భారీగా ఆదాయం సమకూరింది. వాహన రిజిస్ట్రేషన్ల ద్వారా సుమారు రూ. 4 వేల కోట్ల ఆదాయం వచ్చింది.



సొంత వాహనం కోసం కసరత్తు

సామాన్యుల ఆలోచన సరళిలో మార్పులు వస్తున్నాయి. తమ ఊరి పరిసరాల్లో చిన్నచిన్న పనులకు బస్సులు లేదా ప్రైవేటు వాహనాలపై ఆధారపడే కన్నా సొంత వాహనం ఉండడం మేలని భావిస్తున్నారు. దీంతో వాయిదా పద్ధతులలోనైనా ద్విచక్రవాహనాన్ని కొనుగోలు చేస్తున్నారు.

నవ్యాంధ్రలో ప్రస్తుతం మొత్తం వాహనాల సంఖ్య 92లక్షలకు చేరుకుంది. మరో ఏడాది ఈ సంఖ్య కోటి దాటిపోనుంది. రాష్ట్రంలో అధికారిక లెక్కల ప్రకారం కోటి 36 లక్షల కుటుంబాలు ఉన్నాయి.

92 లక్షలకు చేరిన వాహనాలు

నాలుగేళ్ల క్రితం నాలుగు కుటుంబాలకు ఒక్క వాహనం ఉండగా... ఇప్పుడు ప్రతి రెండు కుటుంబాలకు ఒక వాహనం ఉందని రవాణా శాఖ అధికారులు చెబుతున్నారు.

2016-17లో రాష్ట్ర వ్యాప్తంగా 3,84,370 ద్విచక్ర వాహనాల కొనుగోళ్లు జరిగాయి. ఏడాదితో పోలిస్తే 25 శాతం పెరుగుదల ఉంది. మరోవైపు కాస్త మంచి ఉద్యోగం ఉన్నవారు, ఎగువ మధ్యతరగతి, సంపన్న వర్గాల ప్రజలు కారు అవసరమని భావిస్తున్నారు. దీంతో 2016-17లో గణనీయంగా కార్ల కొనుగోళ్లు పెరిగాయి. ముఖ్యంగా విశాఖ, విజయవాడ, గుంటూరుల్లో కార్ల విక్రయాలు బాగా పెరిగాయి. రాజధాని ప్రాంత భూములకు భారీగా ధరలు రావడంతో కొందరు రైతులు కూడా కార్లను కొనుగోలు చేశారు. దీంతో 2015-16 కన్నా నిరుడు కార్ల కొనుగోళ్లలో 27 శాతం వృద్ధి నమోదయింది. గత ఏడాది విశాఖపట్నంలో అత్యధికంగా 5693 కార్ల రిజిస్ట్రేషన్లు జరిగాయి. తర్వాతి స్థానంలో కృష్ణా 4668, గుంటూరు 3211 కార్ల కొనుగోళ్లు జరిగాయి.

ఏడాదిలో 26 శాతం వృద్ధి

2015-16లో 3,80,984 వాహనాల రిజిస్ట్రేషన్లు జరగ్గా 2016-17లో ఈ సంఖ్య భారీగా పెరిగింది. ఒక్క ఏడాదిలోనే వాహన రిజిస్ట్రేషన్లలో 26 శాతం వృద్ధి కనిపించింది. 2016-17లో రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 4,79,508 వాహనాల రిజిస్ట్రేషన్లు జరిగాయి. కృష్ణాజిల్లాలో అత్యధికంగా 57,369 వాహనాల రిజిస్ట్రేషన్ జరగ్గా.. విశాఖ జిల్లాలో 53,447 వాహనాల కొనుగోళ్లు జరిగాయి.

తర్వాతి స్థానంలో గుంటూరు ఉంది. ఇక్కడ 52,576 వాహనాల విక్రయాలు జరిగాయి. రాయలసీమ జిల్లాల్లో అత్యధికంగా చిత్తూరులో 38,242 రిజిస్ట్రేషన్లు జరిగాయి. ఇక విజయనగరం జిల్లాలో అతి తక్కువగా 13,969 వాహనాల కొనుగోళ్లు మాత్రమే జరిగాయి. వాహనాల మీద లైఫ్ ట్యాక్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్, యూజర్ చార్జీలు, ఇతర ఫీజుల రూపంలో ఖజానాకు ఆదాయం వస్తోంది. 2016-17లో అన్ని జిల్లాల నుంచి దాదాపు రూ.4758 కోట్లు ఖజానాకు చేరాయి. 2015-16తో పోల్చితే ఇది రూ.833 కోట్లు అధికం.



విందులో పాల్గొన్న గవర్నర్, ఫరూక్, కోడెల తదితరులు

ఉద్యోగుల త్యాగం మరువలేనిది

- రాష్ట్రాభివృద్ధిలో కీలకం: మండలి చైర్మన్ ఫరూక్

అమరావతి, జనవరి 26 (మనం ప్రతినిధి): రాష్ట్రాభివృద్ధిలో ఉద్యోగుల త్యాగం మరువలేనిదని శాసన మండలి చైర్మన్ ఎన్.ఎం.డి ఫరూక్ కొనియాడారు. శుక్రవారం రిపబ్లిక్ డే సందర్భంగా అసెంబ్లీలోని కాన్ఫరెన్స్ హాల్‌లో అసెంబ్లీ, మండలి ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అసెంబ్లీ స్పీకర్ కోడెల శివప్రసాదరావు కూడా హాజరయ్యారు. కుటుంబాలు హైదరాబాద్‌లో ఉన్నా, సీఎం చంద్రబాబు ఆశయ సాధనకు ఉద్యోగులు కష్టించి పనిచేస్తున్నారని ఫరూక్ కితాబిచ్చారు. ప్రస్తుతం చట్టసభల నిర్వహణ కష్టంగా మారిందని, అయినా బాధ్యతలు సక్రమంగా నిర్వస్తున్నామని ఆయన అన్నారు. హైదరాబాద్‌ను అంతర్జాతీయ నగరంగా చంద్రబాబు అభివృద్ధి చేశారన్నారు. అంతకన్నా ఎక్కువగా అమరావతిని అభివృద్ధి చేయడం ఖాయమని ఫరూక్ ధీమా వ్యక్తం చేశారు.

రాష్ట్రాభివృద్ధికి పునరంకితమవుదాం: కోడెల

ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు సమన్వయంతో పనిచేస్తూ నవ్యాంధ్రప్రదేశ్ అభివృద్ధికి పునరంకితమవుదామని అసెంబ్లీ స్పీకర్ కోడెల శివప్రసాదరావు పిలుపునిచ్చారు. చట్టసభలు సజావుగా పనిచేస్తేనే ప్రజాస్వామ్యం విజయవంతమవుతుందని అన్నారు. రాష్ట్రంలో చట్టసభలు ఎంత ముఖ్యమో, అదేవిధంగా దానిలో పనిచేసే ఉద్యోగుల సంక్షేమం కూడా ప్రభుత్వానికి అంతే ముఖ్యమన్నారు. ఇప్పటికీ 60 శాతం సౌకర్యాలతోనే ఉద్యోగులు విధులు నిర్వస్తున్నారని అన్నారు. త్వరలో అసెంబ్లీ, మండలి ఉద్యోగులకు పదోన్నతులు కల్పించడంతో పాటు ఖాళీగా ఉన్న ఉద్యోగాలను కూడా భర్తీ చేస్తామని కోడెల వెల్లడించారు. విధుల నిర్వహణలో ఉద్యోగులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. ఔట్ సోర్సింగ్ పోస్టుల భర్తీలో ఉద్యోగుల పిల్లలకు ప్రాధాన్యమిస్తామని స్పీకర్ హామీ ఇచ్చారు. అనంతరం ఉద్యోగులకు హెల్త్ కార్డులను మండలి చైర్మన్ ఫరూక్, స్పీకర్ కోడెల అందజేశారు. సంక్రాంతి, రిపబ్లిక్ డే ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు.

కులమతాల రుగ్మతలు తొలగాలి

- ప్రజలంతా ఏకతాటిపైకి రావాలి: ఆనందబాబు



అమరావతి, జనవరి 26 (మనం ప్రతినిధి): దేశంలో కుల మతాల రుగ్మతలు తొలగిపోవాలని, ప్రజలంతా ఏకతాటిపైకి రావాలని మంత్రి నక్కా ఆనందబాబు కోరారు. అవినీతి పూర్తిగా అంతరించినప్పుడే నిజమైన స్వాతంత్ర్యమన్నారు. శుక్రవారం టీడీపీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన గణతంత్ర వేడుకులకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో అత్యధిక జనాభా ఉన్న దళితుల కోసం చంద్రబాబు ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అంబేడ్కర్ స్ఫూర్తితో దళితులకు మరింత చేరువ అయ్యే విధంగా 'దళిత తేజం- తెలుగుదేశం', చంద్రన్న ముందడుగు కార్యక్రమాన్ని గణతంత్ర దినోత్సవం నాడు శ్రీకారం చుట్టారని మంత్రి ఆనందబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు జీవీ ఆంజనేయులు, మోదుగుల వేణుగోపాలరెడ్డి, ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ, విభిన్నప్రతిభావంతుల కార్పొరేషన్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, రాష్ట్ర కార్యాలయ కార్యదర్శి ఏవీ రమణ తదితరులు పాల్గొన్నారు. పార్టీ కార్యాలయంలో గోనుగుంట్లు కోటేశ్వరరావు జన్మదిన వేడుకలు జరిగాయి. కోటేశ్వరరావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న లారీ

ఐదుగురి దుర్మరణం.. పశ్చిమలో ఘోరం

.. మృతుల్లో నలుగురు ఒకే కుటుంబసభ్యులు

జంగారెడ్డిగూడెం, జనవరి 26 (మనం ప్రతినిధి): పశ్చిమ గోదావరి జిల్లాలో శుక్రవారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఐదుగురు దుర్మరణం పాలయ్యారు. నల్లజర్ల మండలంలోని అనంతపల్లి ఎర్రకాలువ వంతెనవద్ద ఈ దుర్ఘటన జరిగింది. కొవ్వూరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు రాజమహేంద్రవరం నుంచి ఏలూరు వెళ్తుండగా ఎదురుగా వస్తున్న లారీ టైరు పేలడంతో అదుపు తప్పి బస్సును ఢీకొట్టింది. ప్రమాదంలో బస్సు ఒకవైపు పూర్తిగా ధ్వంసమైంది. దీంతో బస్సులో ప్రయాణిస్తున్న గేలం లక్ష్మి(50), కాపుశెట్టి జ్యోతి(37), కాపుశెట్టి అఖిల సత్య(12), కాపుశెట్టి శివసాయి(14), ఒడిశాకు చెందిన పల్లా సావిత్రమ్మ(60) అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో నలుగురు ఒకే కుటుంబానికి చెందిన వారు. తునికి చెందిన కాపుశెట్టి నాగేశ్వరరావు, భార్య జ్యోతి, కుమార్తె అఖిల సత్య, కుమారుడు శివసాయితో కలిసి గురువారం నిడదవోలులోని అత్తవారింటికి వెళ్లాడు. అక్కడి నుంచి తన అత్త లక్ష్మితో కలిసి ద్వారకా తిరుమల గుడికి వెళ్లేందుకు బస్సు ఎక్కిన వీరు మరో పది నిమిషాల్లో గమ్యస్థానానికి చేరుకుంటారనగా ఈ దారణం జరిగింది. భార్య, పిల్లలు, అత్త కళ్లఎదుటే చనిపోవటంతో నాగేశ్వరరావు బోరున విలపించాడు. ఈ విషాద దృశ్యం తోటి ప్రయాణికులను కంటతడి పెట్టించింది. తాడేపల్లిగూడెం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు.

9 మంది ఎర్రచందనం స్మగ్లర్లు అరెస్టు

- నెల్లూరు జిల్లాలో 58 దుంగలు.. 4 బైక్‌లు స్వాధీనం



నెల్లూరు (క్రైం), మనం న్యూస్, జనవరి 26: నెల్లూరు జిల్లాలో తొమ్మిది మంది ఎర్రచందనం స్మగ్లర్లను పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి సుమారు రూ.70 లక్షల విలువ చేసే 58 దుంగలను, 4 బైక్‌లు, పది సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. జిల్లా ఎస్పీ రామకృష్ణ ఆదేశాలతో ఓఎస్డీ విశ్వేశ్వరరావు ఆధ్వర్యంలో జిల్లా టాస్క్‌ఫోర్స్ సిబ్బంది డక్కిలి, సీతారామపురం, కలువాయి మండలాల్లో ఏక కాలంలో మెరుపుదాడి నిర్వహించారు. పక్కా సమాచారంతో జరిగిన ఈ దాడుల్లో మూడు మండల్లాలో ముగ్గురు చొప్పున స్మగ్లర్లను పోలీసులు గుర్తించారు. వీరికి పోలీసులు ఎదురుపడడంతో కర్రలు, ఇనుప రాడ్లతో దాడి చేయబోయారు. పోలీసులు వారి సమర్థంగా ఎదుర్కొని అదుపులోకి తీసుకున్నారు. అరెస్టు చేసిన వారిలో ఏడుగురు తమిళనాడుకు చెందిన వారు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. స్మగ్లర్లను విజయవంతంగా అరెస్టు చేసిన డక్కిలి ఎస్ఐ మరిడినాయుడు, సీతారామపురం ఎస్ఐ రాకేష్, కలువాయి ఎస్ఐ సైదులు, వారి సిబ్బందిని ఎస్పీ రామకృష్ణ అభినందించారు.



ఫోన్‌కాల్‌తో సమస్య పరిష్కారం

రియల్‌టైమ్ గవర్నెన్స్‌తో ఎంతో ఉపయోగం

ప్రిన్సిపల్ సెక్రటరీ రాజశేఖర్

అమరావతి, జనవరి 26 (మనం ప్రతినిధి): రాష్ట్రంలో ప్రతి ఒక్కరూ ఆనందంగా జీవించాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశయమని, అందుకు అనుగుణంగా ఆర్టీజీఎస్ పనిచేస్తోందని ప్రిన్సిపల్ సెక్రటరీ బి. రాజశేఖర్ అన్నారు. ఒక్క ఫోన్ కాల్‌తో సామాన్యుడి సమస్యను పరిష్కరించాలన్న ధ్యేయంతో ప్రభుత్వం పనిచేస్తోందని, అందుకు అనుగుణంగా రియల్‌టైమ్ గవర్నెన్స్‌తో నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. శుక్రవారం గుంటుపల్లిలో 1100 కార్యాలయంలో జరిగిన 69వ గణతంత్ర వేడుకల్లో రాజశేఖర్ పాల్గొని జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వ శాఖల నిర్వహణకు రియల్‌టైమ్ గవర్నెన్స్ ఎంతో సహకరిస్తోందని, మూడు నెలల్లో దేశంలోనే 3వ పెద్ద కాల్‌సెంటర్ 1100ను ఏర్పాటు చేయడం చిన్న విషయం కాదని తెలిపారు. విశిష్ట సేవలందించిన సిబ్బందికి జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేశారు.

జగన్ డైరెక్షన్.. బుగ్గన యాక్షన్

చంద్రబాబు మహా సంకల్పాన్ని ఎవరూ అడ్డుకోలేరు: లంకా దినకర్

అమరావతి, జనవరి 26 (మనం ప్రతినిధి): జగన్‌మోహన్‌రెడ్డి దుష్టసంకల్పంతో ముఖ్యమంత్రి చంద్రబాబు మహా సంకల్పాన్ని అడ్డుకోలేరని టీడీపీ అధికార ప్రతినిధి లంకా దినకర్ అన్నారు. శుక్రవారం టీడీపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రానికి పెట్టుబడులు తెచ్చేందుకు చంద్రబాబు అహర్నిశలు శ్రమిస్తుంటే.. ఎమ్మెల్యేలు బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, రోజాలతో ప్రతిపక్ష నేత జగన్ అసత్య ప్రచారాలు చేయిస్తున్నారని దుయ్యబట్టారు. జగన్ డైరెక్షన్ చేస్తుంటే.. బుగ్గన యాక్షన్ చేస్తున్నారని ఎద్దేవా చేశారు. పట్టిసీమ వల్ల ఉపయోగం లేదన్న బుగ్గనకు కృష్ణా డెల్టాలో రైతుల మధ్య తిరిగితే సమాధానం దొరుకుతుందని సూచించారు. పట్టిసీమ పూర్తికావడంతో రాష్ట్రంలో అదనంగా రూ. 15 వేల కోట్ల విలువైన పంట రాబడి వచ్చిందని లెక్కలు చెప్పారు. రాయలసీమ కరవు ప్రాంతాలకు తమ ప్రభుత్వం నీళ్లు ఇచ్చి రైతులకు కడుపు నింపే పనులు చేస్తుంటే.. ప్రతిపక్ష నాయకులకు కన్నీళ్లు వస్తున్నాయని విమర్శించారు. రాయలసీమలో హంద్రీనీవా పనులను గతంలో వైసీపీ నేతలు కేసులతో అడ్డుకునే ప్రయత్నం చేయడం దారుణమన్నారు. అసెంబ్లీలో ఎమ్మెల్యే రోజా ప్రవర్తనపై కోర్టు ఇచ్చిన తీర్పు చెంపపెట్టని అన్నారు. ఇప్పటికైనా రోజా తన వైఖరి మార్చుకుని స్పీకర్ కోడెల శివప్రసాద్‌కు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

బంగ్లాదేశ్‌లో డ్రెడ్జింగ్

విశాఖపట్నం, జనవరి 26 (మనం న్యూస్ బ్యూరో): డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (డీసీఐ) విదేశాల్లో డ్రెడ్జింగ్ కార్యకలాపాలను ప్రారంభించనుంది. ఈ నెలాఖరులో బంగ్లాదేశ్‌లోని మోంగ్లా పోర్టులో డీసీఐ కార్యకలాపాలు ప్రారంభమవుతాయని సంస్థ సీఎండీ రాజేష్ త్రిపాఠి చెప్పారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా విశాఖలోని సంస్థ ప్రధాన కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి.. ఉద్యోగులను ఉద్దేశించి ప్రసంగించారు. మోంగ్లాతో పాటు బంగ్లాదేశ్‌లోని కుటుబ్దాలో మరో ప్రాజెక్టు కోసం బెక్సింకో సంస్థతో చర్చలు జరుపుతున్నామని ఆయన వెల్లడించారు. ఒప్పందం కుదిరితే ఏడాది పాటు డ్రెడ్జింగ్ పనులు చేయడంతో పాటు మరో 9 సంవత్సరాల పాటు నిర్వహణ పనులు ఉంటాయని చెప్పారు. కోచి పోర్టు పనులు త్వరలో ప్రారంభం కానున్నాయని తెలిపారు.

విశాఖ పోర్టు లక్ష్యం 64 మిలియన్ టన్నులు

ఇప్పటికే 51 మిలియన్ టన్నుల ఎగుమతి, దిగుమతుల మైలురాయిని అధిగమించిన విశాఖ పోర్టు ట్రస్టు ఈ ఆర్థిక సంత్సరాంతానికి 64 మిలియన్ టన్నులను లక్ష్యంగా పెట్టుకొన్నదని సంస్థ చైర్మన్ తిరుమల కృష్ణబాబు చెప్పారు. పోర్టులో జరిగిన గణతంత్రదినోత్సవంలో మాట్లాడిన ఆయన ఎన్నో ఇబ్బందులు ఎదురైనప్పటికీ సమర్థవంతంగా ఎదుర్కొని ఇప్పటికే 1.5 మిలియన్ టన్నుల ఎగుమతి, దిగుమతులను అనదంగా చేయగలిగామని అన్నారు. విశాఖ పోర్టు మెరుగైన పనితీరుతో మంచి ఫలితాలను సాధిస్తుందని అన్నారు. సగటున నౌకలు వేచివుండే సమయం గణనీయంగా 2.73 గంటలకు తగ్గిందని, టర్నెరౌండ్ సమయం 2.56 రోజులని ,రోజుకు 13,647 టన్నుల అవుట్‌పుట్‌ను సాధించామని వివరించారు.

త్వరలోనే ప్రపంచ ప్రఖ్యాత నగరం

- టెక్నాలజీలో అమరావతే ముందుండాలి
- సీఆర్‌డీఏ కమిషనర్ చెరుకూరి శ్రీధర్



అమరావతి, జనవరి 26 (మనం ప్రతినిధి): వచ్చే జూలై అఖరుకు అమరావతిలో సీడ్ యాక్సెస్ రోడ్లు పూర్తవుతాయని, మరి కొద్ది రోజుల్లోనే ప్రపంచ ప్రఖ్యాత నగరంగా అమరావతి రూపుదిద్దుకుంటుందని సీఆర్‌డీఏ కమిషనర్ చెరుకూరి శ్రీధర్ అన్నారు. శుక్రవారం అమరావతిలోని వెల్లూరు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (విట్)లో జరిగిన 69వ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొని జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకోవాలని, ఉన్నత వ్యక్తులను ఆదర్శంగా తీసుకోవాలని, అప్పుడే అగ్రస్థానంలో ఉంటారని సూచించారు. రాబోయే కాలంలో టెక్నాలజీలో అమరావతి నుంచి వచ్చిన వారే ముందుండాలని అన్నారు. ప్రపంచ స్థాయి నగరంగా రూపుదిద్దుకుంటున్న అమరావతిలో ఆ స్థాయి విద్యాసంస్థలు ఉండాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి ఆకాంక్ష అని, అందుకే విట్ యూనివర్సిటీని ఇక్కడ ఏర్పాటు చేయాలని కోరారని తెలిపారు. చంద్రబాబు కోరిన వెంటనే ఇక్కడ కాలేజీ ఏర్పాటు చేసి, నెలల్లోనే సొంతభవనాల్లో క్లాసులు నిర్వహించటం గొప్ప విషయమని శ్రీధర్ అన్నారు. రాబోయే రోజుల్లో అమరావతి టెక్నాలజీ హబ్‌గా మారబోతుందని, ఇక్కడి నుంచే ప్రపంచం గర్వపడే నిపుణులు తయారవుతారన్న నమ్మకం ఉందన్నారు. గత నవంబరు 12న ఫెర్రీ ఘాట్‌లో జరిగిన బోటు ప్రమాదంలో ప్రయాణికులను కాపాడిన మత్స్యకారులు నడికుదితి పిచ్చయ్య, కన్నా శివదుర్గారావులను విట్ కాలేజీ యాజమాన్యం ప్రత్యేకంగా పిలిపించి చెరుకూరి శ్రీధర్‌తో సత్కరించింది. వారధి నుంచి దూకి ఆత్మహత్య చేసుకోబోయే వారిని కాపాడుతున్న తాడేపల్లి పోలీసు స్టేషన్‌కు చెందిన హెడ్ కానిస్టేబుల్ బండ్ల నాగేశ్వరావుని సత్కరించారు. ఈ కార్యక్రమంలో విట్ ఏపీ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ శేఖర్ విశ్వనాథన్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ సంధ్యా పెంటారెడ్డి, వైస్ చాన్సలర్ డాక్టర్ డి.శుభాకర్, రిజిస్ట్రార్ డాక్టర్ సి.ఎల్.వి శివకుమార్, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సచివాలయంలో గణతంత్ర వేడుకలు

అమరావతి, జనవరి 26 (మనం ప్రతినిధి): వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయంలో గణతంత్ర వేడుకలు ఘనంగా జరిగాయి. సచివాలయ సర్వీసెస్ విభాగం ముఖ్య కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహాత్మాగాంధీ చూపిన బాటలో అందరూ పయనించాలని పిలుపునిచ్చారు. ఉద్యోగులు క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలని కోరారు. రాష్ట్ర విభజనతో నవ్యాంధ్రప్రదేశ్ పునాదుల స్థాయి నుంచి నిర్మించుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. ఉద్యోగులంతా కష్టించి పనిచేసి, రాష్ట్రాభివృద్ధికి సహకరించాలని కోరారు. తొలుత ఆయన పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ భద్రతాధికారి కె.కె. మూర్తి, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.


మువ్వన్నెల రెపరెపలు









విజయవాడలో జరిగిన గణతంత్ర వేడుకల్లో జాతీయ జెండాకు వందనం చేస్తున్న గవర్నర్ నరసింహన్.. హైదరాబాద్ హైకోర్టు ప్రాంగణంలో చీఫ్ జస్టిస్ రమేశ్ రంగనాథన్ వందనం.. గాంధీజీ చిత్రపటానికి వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డి పుష్పాంజలి.. జెండాను ఆవిష్కరిస్తున్న జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్.. బెలూన్లు ఎగురవేస్తున్న విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ నివాస్, సినీ నటుడు తరుణ్.. జాతీయ జెండా ఎగుర వేసిన ఏపీసీసీ చీఫ్ రఘువీరా రెడ్డి









టాటా గ్రూప్‌లో మొదటి ఎం.బి.ఓ?

టాటా టెలీ ఫిక్సెడ్ లైన్ వ్యాపారాన్ని బిలియన్ డాలర్ల పైచిలుకు మొత్తానికి చేజిక్కించుకునేందుకు ఉద్యోగుల ప్రయత్నం

చెన్నై: ఇది పూర్తిగా కార్యరూపం ధరిస్తే భారతదేశంలో సిబ్బంది జరిపిన పెద్ద కొనుగోలు అవుతుంది. టాటా సన్స్ ఛీఫ్ ఎథిక్స్ ఆఫీసర్ ముకుంద్ గోవింద్ రాజన్ నేతృత్వంలో టాటా టెలీసర్వీసెస్ లిమిటెడ్ (టి.టి.ఎస్.ఎల్) ఉద్యోగులు కొందరు టాటాల నుంచి టి.టి.ఎస్.ఎల్.ను స్వాధీనం చేసుకునే ప్రయత్నం చేస్తున్నారు. బిలియన్ డాలర్ల పైచిలుకు మొత్తానికి వారు బిడ్ చేస్తున్నట్లు తెలిసింది. ప్రైవేటు ఈక్విటీ (పి.ఇ) సంస్థ టి.పి.జి. క్యాపిటల్ నేతృత్వంలో పి.ఇ. ఇన్వెస్టర్ల కన్సార్టియం మద్దతుతో వారు ఈ ప్రయత్నానికి శ్రీకారం చుట్టారు. కన్సార్టియంలో ఒక ప్రధాన పెన్షన్ ఫండ్ కూడా ఉంది. టి.టి.ఎస్.ఎల్.కు చెందిన వినియోగదార్ల మొబైల్ వ్యాపారాన్ని ఎయిర్‌టెల్‌లో విలీనం చేసేందుకు టాటా సన్స్ గత ఏడాది అక్టోబర్‌లో ఎయిర్‌టెల్‌తో ఒక ఒప్పందం కుదుర్చుకుంది. టి.టి.ఎస్.ఎల్. వద్ద ఇప్పుడు ఫైబర్, ఎంటర్‌ప్రైజ్ వ్యాపారాలు మిగిలాయి. ముకుంద్ రాజన్ 2008 నుంచి 2010 వరకు టి.టి.ఎస్.ఎల్. మేనేజింగ్ డైరెక్టర్‌గా పనిచేశారు. ఆయన టాటా కమ్యూనికేషన్స్ లిమిటెడ్ (టి.సి.ఎల్) బోర్డు సభ్యుడుగా కూడా పనిచేశారు. టి.టి.ఎస్.ఎల్. స్వాధీనానికి టి.సి.ఎల్. ఆసక్తి ప్రదర్శించింది.

ఉద్యోగాలు పోతాయనే భయాలు

టి.టి.ఎస్.ఎల్.లో చాలా కాలంగా పనిచేస్తున్న ఉద్యోగులు, సీనియర్ పదవులలో ఉన్నవారు ఒక గ్రూపుగా ఏర్పడి, ఈ ప్రతిపాదనను ముందుకు తీసుకెళ్ళాల్సిందిగా ముకుంద్ రాజన్‌ను కోరారు. ఒక సంస్థ పనితీరు మెరుగుపరచేందుకు లక్ష్యాలను స్పష్టంగా నిర్వచించుకుని, వాటిని యాజమాన్యం, ఉద్యోగులు ఇద్దరూ ఆమోదించే మేనేజ్‌మెంట్ మోడల్‌ను మేనేజ్‌మెంట్ బై ఆబ్జక్టివ్స్ (ఎం.బి.ఓ) అంటారు. ఈ ఎం.బి.ఓ. బృందం చేసిన రెండు వాగ్దానాలలో ఎవరి ఉద్యోగాలు వారికే ఉంటాయనేది కూడా ఒకటి. టి.సి.ఎల్.తో టి.టి.ఎస్.ఎల్. కుదుర్చుకున్న భాగస్వామ్య ఒప్పందాలన్నింటినీ పాటిస్తామనేది రెండవది. టి.టి.ఎస్.ఎల్.తో కుదుర్చుకున్న ఒప్పందాలు ఏమవుతాయోనని టి.సి.ఎల్. ఆందోళన చెందింది. ఈ అంశమే అది టి.టి.ఎస్.ఎల్. స్వాధీనానికి ఆసక్తి చూపేట్లు పురికొల్పింది. ఎం.బి.ఓ. కనుక నిజంగా కార్యరూపం ధరిస్తే, టాటా గ్రూప్‌నకు అది మొదటిది అవుతుంది. గ్రూప్ కార్యకలాపాలను క్రమబద్ధం చేసి, దాని వ్యాపారాలను పటిష్టపరచడంలో కొత్త ఆలోచనలు అమలుజరపడానికి టాటా సన్స్ ఛైర్మన్ ఎన్. చంద్రశేఖరన్ విముఖత చూపే వ్యక్తి కాదని అంటారు.

TATA
TATA TELESERVICES LIMITED

వచ్చే నెలలో నిర్ణయం

అమ్మకంపై నిర్ణయాన్ని ఫిబ్రవరి మధ్యలో తీసుకుంటామని టి.టి.ఎస్.ఎల్. మేనేజింగ్ డైరెక్టర్ ఎన్. శ్రీనాథ్ ఇటీవల ఉద్యోగుల సమావేశంలో చెప్పారు. ఎం.బి.ఓ. ఆఫరును ఉపేక్షించడం టి.టి.ఎస్.ఎల్. బోర్డుకు కష్టం కావచ్చని టాటా గ్రూప్ కార్యనిర్వహణ శైలిని పరిశీలిస్తూ వస్తున్న విశ్లేషకుడు ఒకరు చెప్పారు. ముఖ్యంగా, ఉద్యోగాలు కాపాడతామని అది చేసిన వాగ్దానాన్ని ఆయన గుర్తు చేశారు. టాటా సంస్థలు ఎప్పుడూ గొప్పగా చెప్పుకునే అంశాలలో ఈ ఉద్యోగ భద్రత అంశం కూడా ఉంది. రుణదాతలకు టి.టి.ఎస్.ఎల్. ఇవ్వాల్సిన మొత్తాలన్నింటినీ తర్వాత చెల్లించేట్లు చేస్తామని చంద్రశేఖరన్ వాగ్దానం చేయడం వల్ల కూడా ఈ బిలియన్ డాలర్ల పైచిలుకు ఆఫరును తిరస్కరించడం కష్టం కావచ్చని భావిస్తున్నారు. మొబైల్ వ్యాపారానికి సంబంధించి ఎయిర్‌టెల్‌తో కుదుర్చుకున్న ఒప్పందం వల్ల నగదు వచ్చిపడే అవకాశం ఏదీ లేదని విశ్లేషకులు చెబుతున్నారు. సిబ్బంది ఆఫరు వల్ల దేశంలోకి, కంపెనీలోకి కొత్తగా నగదు వచ్చి చేరుతుందని, అదే టి.టి.ఎస్.ఎల్.ను టి.సి.ఎల్.కు అప్పగిస్తే, గ్రూపు లోపలే నగదు ఒక చేతి నుంచి మరో చేతికి మారినట్లు మాత్రమే అవుతుందని అభిజ్ఞ వర్గాలవారు వెల్లడించారు. దీనిపై టాటా సన్స్ స్పందిస్తుందని టాటా టెలీ సంస్థ ప్రతినిధి చెప్పారు. వ్యాఖ్యానించేందుకు ఏమీ లేదని టాటా సన్స్ ప్రతినిధి అన్నారు. వ్యాఖ్యానించడానికి ముకుంద్ రాజన్ తిరస్కరించారు.

రికార్డు స్థాయిలో 'నాల్కో' ఉత్పత్తులు

नालको NALCO

న్యూఢిల్లీ: ప్రభుత్వ యాజమాన్యంలోని అల్యూమినియం తయారీ సంస్థ 'నాల్కో' 2016-17 ఆర్థిక సంవత్సరంలో రికార్డు స్థాయిలో 6.825 మిలియన్ టన్నుల బాక్సైట్‌ను ఉత్పత్తి చేసింది. కంపెనీ 2015-16 సంవత్సరంలో ఉత్పత్తి చేసిన 6.340 మిలియన్ టన్నులతో పోల్చుకుంటే, ఇది 7.65 శాతం ఎక్కువ కింద లెక్క. కంపెనీ అల్యూమినియం ఉత్పత్తి అంతకుముందు ఆర్థిక సంవత్సరంలో ఉన్న 0.372 మిలియన్ టన్నులతో పోల్చుకుంటే, గత ఆర్థిక సంవత్సరంలో 4 శాతం పెరిగి 0.387 మిలియన్ టన్నులుగా నమోదైంది. అల్యూమినియంకు చెందిన ముఖ్యమైన ఖనిజం బాక్సైట్. ఈ లోహాన్ని ఆటోమొబైల్ పరిశ్రమ విమానాల తయారీలో విస్తృతంగా ఉపయోగిస్తారు. ఇతర పరిశ్రమల్లోనూ వినియోగిస్తారు. బాక్సైట్ గనులు మునుపెన్నడూ లేనంత గరిష్ఠ స్థాయిలో ఉత్పత్తిని సాధించాయి. ఉత్పాదక సామర్థ్యాన్ని 100 శాతం వినియోగించుకుంటూ 68.25 లక్షల టన్నుల బాక్సైట్‌ను రవాణా చేశాయి. గతంలో వాటి అత్యుత్తమ పనితీరు 2015-16లో 63.40 లక్షల టన్నులుగా ఉంది. అల్యూమినా రిఫైనరీ కూడా మునుపెన్నడూ ఎరుగనంత గరిష్ఠ స్థాయిలో 21 లక్షల టన్నుల అల్యూమినా హైడ్రేట్‌ను ఉత్పత్తి చేసింది. కంపెనీ 2015-16లో 19.53 లక్షల టన్నుల అల్యూమినా హైడ్రేట్‌ను ఉత్పత్తి చేసింది. నాల్కోకు చెందిన కాప్టివ్ పవర్ ప్లాంట్ (సి.పి.పి) 2016-17లో 6,066 మిలియన్ల యూనిట్ల నికర విద్యుదుత్పాదనను సాధించింది. అది 2015-16లో 5,841 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పాదన నమోదు చేసింది. పన్నుల అనంతరం అది గడించిన లాభం అంతకుముందు ఆర్థిక సంవత్సరంలో ఉన్న రూ. 787 కోట్ల నుంచి గత ఆర్థిక సంవత్సరం నాటికి రూ. 669 కోట్లకు తగ్గింది. మొత్తం ఆదాయం మాత్రం రూ. 7,874 కోట్ల నుంచి రూ. 8,458 కోట్లకుపెరిగింది. కంపెనీ మొత్తం వ్యయాలు 2015-16లో ఉన్న రూ. 6,739 కోట్ల నుంచి రూ. 7,453 కోట్లకు పెరిగాయి. గనుల మంత్రిత్వ శాఖ కింద పనిచేస్తున్న కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ నాల్కో 'నవరత్న' హోదా సాధించింది. నాల్కోలో కేంద్ర ప్రభుత్వానికి 60.2 శాతం ఈక్విటీ ఉంది. ఇది దేశంలోని అతిపెద్ద సమీకృత బాక్సైట్-అల్యూమినా-అల్యూమినియం-విద్యుత్ కాంప్లెక్స్‌లలో ఒకటి.

ఆ వాటా కూడా వాటికే

న్యూఢిల్లీ: బంగాళా ఖాతంలో ఇంధన వాయు నిక్షేప బ్లాకు ఎన్.ఇ.సి-25లో నికో రిసోర్సెస్‌కు ఉన్న 10 శాతం వాటాను స్వాధీనపరచుకునేందుకు రిలయన్స్ ఇండస్ట్రీస్, బ్రిటిష్ ఇంధన రంగ దిగ్గజం బి.పి. ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. నగదు కొరతతో బాధపడుతున్న భాగస్వామ్య సంస్థ నికోను ఆదుకునేందుకు అవి ఈ నిర్ణయం తీసుకున్నాయి. ఎన్.ఇ.సి.-25 నుంచి ఉపసంహరించుకోవాలని నికో 2015 మధ్యలో నిర్ణయించుకుంది. ఆ బ్లాకులో ఇప్పటికే ఆర్.ఐ.ఎల్.కు 60 శాతం వాటా, బ్రిటన్‌కు చెందిన బి.పి.కి 30 శాతం వాటా ఉన్నాయి. ఈ 10 శాతం వాటాను అవి వాటికున్న ఈక్విటీ వాటా నిష్పత్తి ప్రకారం పంచుకుంటాయి.



అదనపు కొనుగోళ్ళకు అనుమతి

అహ్మదాబాద్: మరో 4 లక్షల టన్నుల వేరుసెనగ కొనుగోలుకు అనుమతించవలసిందని గుజరాత్ ప్రభుత్వం అభ్యర్థించడంతో, కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ మద్దతు ధర పథకం (పి.ఎస్.ఎస్) కింద లక్ష టన్నుల అదనపు కొనుగోలుకు గురువారం ఆమోదం తెలిపింది. జాతీయ వ్యవసాయ సహకార మార్కెటింగ్ సమాఖ్య (నాఫెడ్) కిందనున్న సంస్థలు గత మూడు నెలల్లో గుజరాత్‌లో ఇప్పటికే 8 లక్షల టన్నుల వేరుసెనగ కొనుగోలు చేశాయి. మరో లక్ష టన్నుల కొనుగోలును ఫిబ్రవరి 10 లోగా పూర్తి చేయవలసి ఉంది. ''ఇప్పటికే కొన్న 8 లక్షల టన్నులుకాక, మరో 4 లక్షల టన్నులు కొనుగోలు చేయవలసిందని కోరాం. ప్రభుత్వం లక్ష టన్నుల అదనపు కొనుగోలుకు అనుమతిచ్చింది. అందుబాటులో ఉన్న గిడ్డంగుల సదుపాయాలను సమీక్షించిన తర్వాత తదుపరి కొనుగోళ్ళ అంశాన్ని పరిశీలిస్తామని మంత్రిత్వ శాఖ తెలిపింది'' అని గుజరాత్ వ్యవసాయ మంత్రి ఆర్.సి. ఫల్దు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ యాజమాన్యంలోని గిడ్డంగులన్నీ పూర్తిగా నిండిపోయాయని, కొత్తగా కొంటున్న వేరుసెనగను లీజుపై తీసుకున్న ప్రైవేటు గిడ్డంగులలో నిల్వ చేస్తామని కూడా ఆయన చెప్పారు. గుజరాత్‌లో జనవరి 22 నుంచి వేరుసెనగ కొనుగోళ్ళు నిలిచిపోయాయి. మరో రెండు రోజుల్లో అవి తిరిగి ప్రారంభం కానున్నాయి. అమ్మేందుకు పేర్లు నమోదు చేసుకుని, ప్రభుత్వ కొనుగోలు పరిమితి కారణంగా వేరుసెనగను అమ్ముకోలేకపోయిన పెద్ద సంఖ్యలోని చిన్న రైతులకు కేంద్ర నిర్ణయం లబ్ధి చేకూర్చనుందని ఫల్దు చెప్పారు.

తగ్గిన చెరకు బకాయిలు

న్యూఢిల్లీ: సాపేక్షంగా చూస్తే, చెరకు ధర బకాయిలను గత చక్కెర సీజన్‌లో కన్నా తక్కువ స్థాయిలకు తీసుకొచ్చినందుకు కేంద్ర ప్రభుత్వం ఇటీవల తనను తాను ప్రశంసించుకుంది. కానీ, చెరకు ధరలు హఠాత్తుగా, తీవ్రంగా పతనమవడం వల్ల ఈ సంతోషకర పరిస్థితి ఎక్కువ కాలం కొనసాగకపోవచ్చని పరిశ్రమ వర్గాలవారు అభిప్రాయపడుతున్నారు.

తగ్గిన చెరకు బకాయిలు

అధిక ఉత్పత్తి, క్షీణిస్తున్న చక్కెర ధరలతో సంబంధం లేకుండా, చెరకు బకాయిలు గత సీజన్‌లో ఇదే కాలంలో ఉన్న రూ. 8,982 కోట్లతో పోల్చుకుంటే, ఈ సీజన్‌లో రూ. 7,826 కోట్లకు తగ్గాయని ఇక్కడ విడుదలైన అధికారిక ప్రకటన తెలియజేసింది. కేంద్రం, చెరకు పండించే రాష్ట్రాలలోని ప్రభుత్వాలు తీసుకున్న చర్యల కారణంగా సాపేక్షంగా చూస్తే, రైతులకు బకాయిలు తగ్గాయని ఆ ప్రకటన తెలిపింది. ''2016-17 చక్కెర సీజన్‌లో చెల్లించవలసి ఉన్న చెరకు బకాయిల మొత్తం రూ. 57,608 కోట్లలో, చెరకు ధర బకాయిలు నిష్పాక్షికమైన గిట్టుబాటు ధర (ఎఫ్.ఆర్.పి) ప్రాతిపదికపై రూ. 52 కోట్లకు, ప్రభుత్వ నియంత్రిత ధర (ఎస్.ఏ.పి ప్రాతిపదికపై) రూ. 1076 కోట్లకు తగ్గాయి'' అని ఆ ప్రకటన వెల్లడించింది.



నష్టాల్లో ఫ్యాక్టరీలు

ప్రస్తుత పరిస్థితి ఎలా ఉన్నప్పటికీ, ఫ్యాక్టరీ వద్ద చక్కెర ధరలు క్షీణిస్తూ, ఫ్యాక్టరీలను నష్టాల్లోకి నెడుతున్నందు వల్ల ఇక ఇప్పటి నుంచి బకాయిలు పెరగవచ్చని భయాలు వ్యక్తమవుతున్నాయి'' అని పరిశ్రమ వర్గాలవారు తెలిపారు. గత ఏడాది అక్టోబర్ 1న కొత్త సీజన్ మొదలైనప్పటి నుంచి చక్కెర ధరల్లో కిలోకు రూ. 6 తగ్గుదల కనిపించిందని వారు చెబుతున్నారు. కిలో చక్కెర ఉత్పత్తి వ్యయం సుమారు రూ. 35 కాగా, ఫ్యాక్టరీల వద్ద అది ఉత్తర ప్రదేశ్‌లో రూ. 32, మహారాష్ట్రలో రూ. 29 పలుకుతోందని వారు తెలిపారు. ఇది పరిశ్రమకు మేలు చేయదని వారు వాపోతున్నారు.

అధిక ఉత్పత్తి

''ఫ్యాక్టరీలకు ప్రస్తుతం చేరుకుంటున్న చెరకు పరిమాణాన్ని బట్టి, దేశంలో చక్కెర ఉత్పత్తి 2017 డిసెంబర్‌లో అంచనా వేసినట్లుగా 2 కోట్ల 50 లక్షల టన్నులు కాక, 2 కోట్ల 60 లక్షల టన్నుల మేరకు ఉండవచ్చని అంచనా. ఇది 2018 చక్కెర సంవత్సరంలో చక్కెర ఉత్పత్తిలో 28 శాతం పెరుగుదలగా బదలీ కాగలదు. 2017 చక్కెర సంవత్సరంలో ఉత్పత్తి 20.30 మిలియన్ టన్నులుగా ఉంది. ప్రధానంగా మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలలో చక్కెర ఉత్పత్తి తిరిగి మునుపటి స్థాయిలో పుంజుకోగలదని భావిస్తున్నారు. సాపేక్షంగా చూస్తే, 2016లో, 2017లో వర్షాలు బాగానే పడడం వల్ల చెరకు దిగుబడి మెరుగుపడింది'' అని ఐ.సి.ఆర్.ఏ.కు చెందిన సవ్యసాచి మజుందార్ చెప్పారు. ఉత్తర ప్రదేశ్‌లో ఈసారి ఎక్కువ దిగుబడినిచ్చే రకం చెరకు వేశారని, చెరకు పంట విస్తీర్ణం కూడా పెరిగిందని, ఫలితంగా, అక్కడ రికార్డు స్థాయిలో 10.2 మిలియన్ టన్నుల చక్కెర ఉత్పత్తి కాగలదని సవ్యసాచి చెప్పారు.

తగ్గుతున్న చక్కెర ధరలు

కొత్త నిల్వలు మార్కెట్లోకి రావడం ప్రారంభించడంతో గత ఏడాది డిసెంబర్ నుంచి చక్కెర ధరలు తగ్గుతూ వస్తున్నాయని రేటింగ్ సంస్థ ఐ.సి.ఆర్.ఏ. పేర్కొంది. పరిశ్రమ అంచనాల కన్నా ఉత్పత్తి అధికంగా ఉండగలదనే ఊహాగానాలు కూడా అందుకు కారణమేనని తెలిపింది. చక్కెర ఉత్పత్తిపై అంచనాలు గతంలోకన్నా పెరిగాయి. చెరకు రైతులకు చెల్లింపులు జరిపేందుకు చాలా భాగం చక్కెర ఫ్యాక్టరీలు ఉన్న చక్కెరను అమ్మేసి నగదుగా మార్చుకోవడంతో, చక్కెర ధరల్లో సర్దుబాటు చోటుచేసుకుంది. ''ప్రస్తుత త్రైమాసికంలో చక్కెర ధరలు ఒత్తిడికి లోనయ్యే అవకాశం ఎక్కువగా ఉంది. ముగింపు నిల్వలు సౌకర్యకరమైన స్థాయిలో దాదాపు 50 లక్షల టన్నుల నుంచి 5.5 మిలియన్ టన్నుల మేరకు ఉండే అవకాశం ఉండడంతో రానున్న త్రైమాసికంలో అవి నిలకడగా ఉండవచ్చు'' అని ఐ.సి.ఆర్.ఏ. తెలిపింది.

ఎగుమతిదార్లకు కాస్త ఊరట

న్యూఢిల్లీ: ఎగుమతిదార్లకు కొంత ఊరట కల్పిస్తూ, డ్యూటీ డ్రాబ్యాక్ రేట్లను (ఎగుమతులపై ఉత్పాదక సామగ్రి పన్నులకు చెల్లించే పరిహారం రేటు) ప్రభుత్వం గురువారం స్వల్పంగా పెంచింది. సైకిళ్ళు, టైర్లు, మెరైన్, సముద్ర ఆహారం, తోలు ఉత్పత్తులు, దారం, హస్తకళా వస్తువులతో సహా వందకు పైగా వస్తువులపై డ్యూటీ డ్రాబ్యాక్ రేట్లను పెంచింది. ఈ రేట్లను గత ఏడాది తగ్గించడంతో నిరసనలు వ్యక్తమైన నేపథ్యంలో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. అన్ని రంగాలలోను ఈ రేటు మరింత గణనీయంగా పెంచాలని ఎగుమతిదార్లు కోరుకుంటున్నారు. ప్రస్తుత లెక్కింపులలో తాపడం చేసిన పన్నులు ఏవీ గణనలోకి రాకుండా చూడాలని వారు కోరుతున్నారు. ''ప్రభుత్వం ప్రకటించిన డ్యూటీ డ్రాబ్యాక్ రేటు చాలా వస్తువులపై 0.2 శాతం నుంచి 0.5 శాతం వరకు మాత్రమే ఉంది. కొన్ని రసాయనాల విషయంలో డ్యూటీ డ్రాబ్యాక్ రేటు వాస్తవానికి తగ్గింది'' అని భారతీయ ఎగుమతి సంస్థల సమాఖ్యకు చెందిన అజయ్ సహాయ్ అన్నారు. జి.ఎస్.టి. అమలులోకి రావడంతో గత ఏడాది కొన్ని రంగాలలో డ్యూటీ డ్రాబ్యాక్ రేట్లు దాదాపు 7 శాతం తగ్గాయి.

పరిహారం సమస్య

తాపడం చేసిన పన్నులకు సంబంధించిన పరిహారాన్ని కూడా డ్యూటీ డ్రాబ్యాక్ రేటులో కలపాలన్న తమ డిమాండ్‌ను పట్టించుకోలేదని సహాయ్ చెప్పారు. ''సంస్తరిత పన్నులను లెక్కలోకి తీసుకుంటే, వివిధ రంగాల్లో డ్రాబ్యాక్ రేట్లు పెరుగుతాయని మేం ఆశాభావంతో ఉన్నాం. టెక్స్‌టైల్స్, గార్మెంట్స్‌తో సహా పెద్ద సంఖ్యలో ఉన్న రంగాలను ఈ రేటు సవరణలో చేర్చలేదు'' అని ఆయన అన్నారు. పన్నులు పడకూడని ఉత్పత్తుల తయారీకి ఉపయోగించుకున్న ఉత్పాదక సామగ్రిపై విధించిన లెవీలను సంస్తరిత పన్నులు అంటారు. ఇవి సదరు ఉత్పత్తిలో ఇమిడిపోయి ఉంటాయి కనుక తాపడం చేసిన పన్నులు అని కూడా అంటూంటారు. ఎగుమతిదార్లకు ఆ ఉత్పత్తులపై ఇన్‌పుట్ పన్ను క్రెడిట్ లభించదు. కనుక, ఆ పన్నులను వస్తువు ధరలో చొప్పించి తీరాలి. ఇది ఎగుమతిదార్ల పోటీ సామర్థ్యంపై ప్రభావం చూపుతుంది. ప్రాచుర్యం పొందిన మర్కండైజ్ ఎగుమతి ప్రోత్సాహక పథకం కింద గత ఏడాది డిసెంబర్‌లో ప్రకటించిన పెంచిన ప్రోత్సాహకాల రేట్ల గడువు ఈ జూన్‌తో ముగుస్తుంది. డ్యూటీ డ్రాబ్యాక్‌కు సంబంధించి తమ సమస్యలను ఆలోగా పరిష్కరించాలని ఎగుమతిదార్లు కోరుతున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో భారతదేశపు వస్తువుల ఎగుమతులు కొంతవరకు తేరుకున్నాయి. 2017-18 ఏప్రిల్-డిసెంబర్ కాలంలో మొత్తం ఎగుమతులు 12.5 శాతం పెరిగి 223.51 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో ఎగుమతులు 300 బిలియన్ డాలర్లకు చేరగలవని ఎగుమతిదార్లు ఆశిస్తున్నారు. అవి కూడా 2013-14లో నమోదైన 314 బిలియన్ డాలర్ల ఎగుమతులతో పోలిస్తే తక్కువే అవుతాయి. పరిశ్రమ లేవనెత్తిన అంశాలను దృష్టిలో పెట్టుకునే గురువారనాటి సవరణను నిర్వహించినట్లు కేంద్రం ప్రకటించింది.




పన్ను తటస్థీకరణ

''ఎగుమతులపై ఉత్పాదక సామగ్రి పన్ను తటస్థీకరణను మరింత ప్రభావశీలంగా రూపొందించేది దిశగా, అన్ని రంగాల పరిశ్రమలకు సంబంధించి 102 టారిఫ్ వస్తువులపై డ్యూటీ డ్రాబ్యాక్ రేటును ప్రభుత్వం పెంచింది'' అని ఆర్థిక మంత్రిత్వ శాఖ విడుదల చేసిన ఒక ప్రకటన వెల్లడించింది. పెంచిన డ్యూటీ డ్రాబ్యాక్ రేట్లు గురువారం నుంచే అమలులోకి వచ్చాయి. హెచ్చు రేట్ల పరిధిలోకి వచ్చిన ఎగుమతి వస్తువులలో ఆటో మొబైల్ టైర్లు, సైకిల్ టైర్లు/ట్యూబులు, దారం, ఊలు వస్త్రాలు, గాజు హస్తకళాఖండాలు కూడా ఉన్నాయి. ''డ్రాబ్యాక్ సవరణ ఎగుమతిదార్లకు ఊరటనిచ్చే స్వాగతించదగిన పరిణామం. దీనితో వారి చేతిలో ఆడే నగదు పరిమాణం మెరుగుపడితీరాలి. రిఫండ్లలో జాప్యం, జి.ఎస్.టి.లో ఉత్పాదక సామగ్రి ధరలు పెరగడం వల్ల వారు కాసులకు కటకటపడ్డారు'' అని ఇ.వై. ఇండియాలో ట్యాక్స్ పార్ట్‌నర్ బిపిన్ సప్రా అన్నారు.

టూరిజానికి ప్రోత్సాహం అవసరం

న్యూఢిల్లీ: అంతర్జాతీయంగా పోటీ పడగలిగిన విధంగా టూరిజం రంగాన్ని పెంపొందించేందుకు పన్ను రేట్లను పునః పరిశీలించవలసిన అవసరం ఉందని రానున్న 2018-19 కేంద్ర బడ్జెట్‌కు ముందు పర్యాటక సంస్థలవారు అభిప్రాయపడుతున్నారు. సానుకూల విధానాలు, తగిన పరిస్థితులు కల్పిస్తే ఈ రంగం వృద్ధి చెందడానికి అవకాశం ఉంటుందని వారు చెబుతున్నారు. ఉపాధి అవకాశాల సృష్టిలో, సమ్మిళిత వృద్ధిని సాధించడంలో కీలక చోదక శక్తులుగా పనిచేసే వాటిలో టూరిజం ఒకటని వారు చెప్పారు. ''అంతర్జాతీయ మార్కెట్‌లో ఈ ప్రాంతంలోని థాయిలాండ్, మలేసియా, సింగపూర్ వంటి దేశాలతో పోటీ పడేందుకు, గ్లోబల్ రేట్లకు సమానంగా ఇండియా కూడా సర్వీసులు ఆఫరు చేయవలసి ఉంది'' అని మేక్‌మైట్రిప్ స్థాపకుడు, గ్రూప్ సి.ఇ.ఓ. దీప్ కల్రా ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మార్కెట్లలో ఆతిథ్య రంగంలో తక్కువగా ఉన్న పన్ను రేట్లు వాటిని ప్రధాన టూరిస్టు గమ్యస్థానాలుగా తీర్చిదిద్దడంలో సహాయపడ్డాయని, అన్నారు. రోజుకు రూ. 2,500 నుంచి రూ. 7,500 మధ్య అద్దె కలిగిన హోటల్ గదులపై ఉన్న 18 శాతం జి.ఎస్.టి. రేటును తగ్గించాలని కాక్స్ అండ్ కింగ్స్ గ్రూప్ సి.ఇ.ఓ. పీటర్ కెర్కర్ కోరారు.

మనం రియల్
శనివారం, 27 జనవరి 2018
www.manamnews.com



సంపన్నులు కావాలని అందరికీ ఉంటుంది. కానీ అది కొందరికే సాధ్యమవుతుంది. ఎంత సంపాదించారన్నది ముఖ్యం కాదు. ఎంత పొదుపు మదుపు చేశామన్నదే కీలకం. అందులోనూ ఎంతకాలం మదుపు కొనసాగితే సంపద సృష్టి సాధ్యమవుతుంది?

సంపద సృష్టికి తెలివైన నిర్ణయాలే కాదు ఓపిక కూడా ముఖ్యమే. దీర్ఘకాలం పాటు మదుపు చేస్తూ వెళితేనే సంపద సృష్టి సాధ్యమవుతుంది. మదుపు విషయంలో సుమారు 5 ఏళ్లు లేదా అంతకన్నా ఎక్కువ కాలాన్ని దీర్ఘకాలంగా చెబుతారు. దీర్ఘకాలిక అవసరాలకు, సంపద సృష్టికి అందుబాటులో ఉన్న అవకాశాలను చూద్దాం...

స్వల్ప పెట్టుబడితో... సంపన్నులు

ప్రజా భవిష్య నిధి (పీపీఎఫ్)

ఇది 15 ఏళ్ల పాటు కొనసాగే పెట్టుబడి పథకం. ఇందులో పెట్టుబడి సురక్షితంగా ఉంటుంది. ఎలాంటి రిస్క్ లేనిది. ప్రభుత్వం నిర్వహించే పథకం. దీర్ఘకాలంలో మధ్యకాలిక రిటర్న్లను ఆశించవచ్చు. పెట్టే పెట్టుబడికి గానీ, కాల వ్యవధి తీరిన తర్వాత వచ్చే రిటర్నులపై గానీ ఎలాంటి పన్ను లేదు. కాకపోతే ఇందులో పెట్టుబడులను పూర్తిగా వెనక్కి తీసుకునేందుకు అవకాశం లేదు. ఆరో ఏడాది చివర్లో కొంత మొత్తాన్ని మాత్రమే తీసుకునేందుకు అనుమతిస్తారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం పీపీఎఫ్ పై 8.7 వడ్డీ ఆఫర్ చేస్తోంది. కావాలంటే 15 ఏళ్ల తర్వాత మరో ఐదేళ్లు పొడిగించుకోవచ్చు. పోస్టాఫీసులు, అన్ని బ్యాంకుల్లోనూ పీపీఎఫ్ సౌకర్యం ఉంది.



మ్యూచువల్ ఫండ్స్

మ్యూచువల్ ఫండ్స్ స్కీములు దీర్ఘకాలంలో మంచి ఫలితాలను ఇస్తాయి. పెట్టుబడి పెట్టేవారి రిస్క్ స్థాయిని బట్టి వచ్చే రాబడులు కూడా ఆధారపడి ఉంటాయని తెలుసుకోవాలి. అందుకే మ్యూచువల్ ఫండ్ సంస్థలు రిస్క్‌ను పరిగణనలోకి తీసుకుని వివిధ రకాల పథకాలను నిర్వహిస్తున్నాయి. ఎక్కువ రిస్క్ తీసుకోగలిగిన వారు ప్యూర్ ఈక్విటీ స్కీములు, మధ్యస్థంగా రిస్క్ భరించేట్లయితే బ్యాలన్స్ ఫండ్స్, రిస్క్ వద్దనుకుంటే డెట్ ఫండ్స్‌ను పరిశీలించవచ్చు. పూర్తిగా ఈక్విటీ పథకాల్లో పెట్టుబడులకు 12 శాతం పైనే రాబడులను ఆశించవచ్చు. రిస్క్ ఉన్న చోటే రాబడీ ఉంటుందన్న నియమాన్ని గుర్తు పెట్టుకోవాలి. బ్యాలన్స్ ఫండ్స్‌లో సగటున 10 నుంచి 12 శాతం రాబడికి అవకాశం ఉంటుంది. డెట్ ఫండ్స్ అయితే 8 నుంచి 9 శాతం రాబడి ఆశించవచ్చు.

సిప్

నెలనెలా క్రమానుగత విధానంలో (సిప్) మ్యూచువల్ ఫండ్స్ పథకాల్లో పెట్టుబడులు పెట్టడం వల్ల కొనుగోలు ధర సగటున తక్కువగా ఉండి అధిక రాబడికి అవకాశం ఉంటుంది. స్టాక్ మార్కెట్లు ఎప్పుడూ ఒకే డైరెక్షన్‌లో వెళ్లవన్న సంగతి తెలిసిందే. ఆటు పోట్లు సహజం. సిప్ విధానంలో అయితే మార్కెట్ ఎక్కువలో ఉన్నప్పుడు, తగ్గినప్పుడు పెట్టుబడి కొనసాగుతుంది కనుక సగటున రిస్క్ తగ్గి ఎక్కువ లాభాలు అందుకోవడానికి అవకాశం ఉంటుంది. నెలనెలా పెట్టుబడి పెట్టలేని వారు త్రైమాసికానికి ఓ సారైనా పెట్టుబడి పెట్టవచ్చు. సిప్ పద్ధతి ఈక్విటీ స్కీమ్స్‌కు సురక్షిత విధానం.



స్టాక్ మార్కెట్లో నేరుగా పెట్టుబడులు

స్టాక్స్ మంచి చెడులను, మార్కెట్ పరిస్థితులను విశ్లేషించగల సామర్థ్యం ఉంటే నేరుగా స్టాక్ మార్కెట్లలో పెట్టుబడి పెట్టడం ద్వారా మ్యూచువల్ ఫండ్స్ కంటే ఎక్కువ రాబడులను అందుకోవచ్చు. అయితే, స్టాక్ మార్కెట్ ఆకర్షణలో పడి ట్రేడింగ్, వార్తల ఆధారంగా స్వల్ప కాలిక పెట్టుబడుల వైపు వెళ్లకుండా నియంత్రించుకోవాలి. అప్పుడే లాభాలు కళ్లజూస్తారు.

ఐపీఓలు

స్టాక్ మార్కెట్లో లిస్టింగ్‌కు వచ్చే కంపెనీలు ఎంచుకునే మార్గం ఐపీవోలు. ఇనీషియల్ పబ్లిక్ ఆఫరింగ్స్‌లో మంచి కంపెనీల షేర్లకు దరఖాస్తు చేసుకోవడం ద్వారా కళ్లు చెదిరే లాభాలు పిండుకోవచ్చు. కొన్ని షేర్లు లిస్టింగ్ రోజే రెట్టింపు అయిన సందర్భాలూ ఉన్నాయి. కాకపోతే మంచి కంపెనీలనే ఎంచుకోవాలి. నేడు ప్రతి ఐపీవో గురించి మార్కెట్లో, ఆన్‌లైన్లో సమగ్రమైన సమాచారం లభిస్తోంది. నిపుణులు ఐపీవో విశ్లేషణలు కూడా అందిస్తున్నారు. వాటిని పరిశీలించడం ద్వారా ఐపీవోలకు వచ్చే కంపెనీల చరిత్ర, అమ్మకాలు, లాభాలు, రేటింగ్ సంస్థలు ఏ రేటింగ్ ఇచ్చాయి? తదితర సమాచారాన్ని తెలుసుకోవడం ద్వారా పెట్టుబడిపై అవగాహనకు రావచ్చు.

రియల్ ఎస్టేట్

భూమిని నమ్ముకున్నోడు ఎన్నడూ ఆగమైపోడు అన్న ఒక నమ్మకం చాలా మందిలో కనిపిస్తుంది. ఎందుకంటే ఇప్పటివరకూ భూమిపై పెట్టుబడి పెట్టిన వారు నష్టపోయిన దాఖలాలు చాలా చాలా తక్కువ. 130 కోట్ల జనాభా ఉన్న దేశంలో భూమికి డిమాండ్ ఎప్పుడూ ఉంటుంది. కనుక సురక్షితమైన పెట్టుబడి విధానమే కాకుండా తగినంత రాబడిని కూడా ఇచ్చేది రియల్ ఎస్టేట్. ప్లాట్, ఫ్లాట్, నివాస భవనం, వాణిజ్య భవనం ఇలా ఏదైనా ఎవరికి వారు వారి ఆదాయ స్థాయినిబట్టి కొనుగోలు చేయవచ్చు. కొనుగోలుకు అవసరమైన మొత్తం దగ్గరుంటే సరి లేదంటే రుణం తీసుకుని కొనుగోలు చేయవచ్చు. నెలనెలా వాయిదాలు చెల్లించడం ద్వారా దీర్ఘకాలంలో రుణం తీరిపోతుంది. కొనుగోలు చేసిన ఆస్తి విలువ కూడా బాగా పెరుగుతుంది.



యులిప్స్

యూనిట్ లింక్డ్ ఇన్సూరెన్స్ పథకాలు పదేళ్లు అంతకంటే ఎక్కువ కాల వ్యవధికి తీసుకునేవారికి మోస్తరు రాబడులను ఇస్తాయి. బీమా నియంత్రణ ప్రాధికార సంస్థ ఏజెంట్ల కమిషన్ తగ్గించడంతో యులిప్స్ పై ఇప్పుడు చార్జీలు తగ్గిపోయాయి. పైగా నిర్ణీత కాలం పాటు వెనక్కి తీసుకునే అవకాశం లేకపోవడం వల్ల వీటిలో ఎనిమిది శాతం వరకు రాబడులను ఆశించవచ్చు. పైగా పెట్టుబడులకు, రాబడులకు ఆదాయపన్ను మినహాయింపు కూడా ఉంది.

బంగారంలో పెట్టుబడి

సురక్షితమైన పెట్టుబడి సాధనాల్లో బంగారం కూడా ఒకటి. ద్రవ్యోల్బణాన్ని కాచుకుని మరీ పెట్టుబడి విలువను కాపాడే సాధనం. బంగారంపై రాబడి ఎంత వస్తుందో ప్రస్తుతం చెప్పడం కష్టసాధ్యమే. అయితే, దీర్ఘకాలంలో మాత్రం ఫిక్స్‌డ్ డిపాజిట్లపై వచ్చే వడ్డీ స్థాయిలో రాబడి ఉంటుందని అంచనా వేయవచ్చు. పెట్టుబడి కోసమే అయితే కేంద్ర ప్రభుత్వం ఆఫర్ చేస్తున్న బంగారం బాండ్లను పరిశీలించవచ్చు. వీటిపై ప్రభుత్వం 2.75 వడ్డీ రేటును వార్షిక ప్రాతిపదికన ప్రతీ ఆరు నెలలకు చెల్లిస్తుంది. గడువు తీరిన తర్వాత ఆ రోజు మార్కెట్లో ఉన్న బంగారం విలువ ఆధారంగా అసలు చెల్లిస్తారు. ఉదాహరణకు గ్రాము 2500 రూపాయల చొప్పున రెండు గ్రాముల బాండ్ ను రూ.5వేలు వెచ్చించి కొనుగోలు చేస్తే... గడువు తీరిన తర్వాత బంగారం గ్రాము 3వేల రూపాయలు ఉందనుకుంటే రెండు గ్రాములుకు ఆరు వేల రూపాయలు చెల్లిస్తారు. మధ్యలో వచ్చే వడ్డీ అదనం.


కంపెనీల ఫిక్స్‌డ్ డిపాజిట్లు

కంపెనీలు తమ పెట్టుబడులు, రుణాల అవసరాల కోసం ఫిక్స్‌డ్ డిపాజిట్లు జారీ చేస్తుంటాయి. ఇవి ఎంత శాతం భద్రమో తెలియజేస్తూ రేటింగ్ సంస్థలు రేటింగ్‌లు ఇస్తుంటాయి. వాటిని పరిశీలించి పెట్టుబడి పెట్టడం ద్వారా బ్యాంకుల కంటే ఎక్కువ వడ్డీని పొందవచ్చు. ప్రస్తుతం బ్యాంకులు మూడేళ్ల కాలానికి 8 శాతానికి మించి వడ్డీ ఇవ్వడం లేదు. కంపెనీల ఫిక్స్ డిపాజిట్లలో ఇంతకంటే ఎక్కువే ఆశించవచ్చు.

పోస్టాఫీస్ పొదుపు పథకాలు

నేషనల్ సేవింగ్ సర్టిఫికెట్లు, కిసాన్ వికాసపత్ర, నెలవారీ ఆదాయ పథకం, రికరింగ్ డిపాజిట్ తదితర పథకాలను తపాలా శాఖ అందిస్తోంది. వీటిలో పెట్టుబడులకు పూర్తి భద్రత ఉంటుంది. రాబడి ఇంచుమించుగా బ్యాంకుల స్థాయిలోనే ఉంటుంది.

అద్దాలతో.. ఇంటికి అందం




గృహ శోభను సంతరించుకోవాలంటే అద్దాలతో అలంకరిస్తే సరి. ఇల్లు అందగా కనిపించడానికి కిటికీలదే ముఖ్యమైన పాత్ర ఉంటుంది. అందుకు కిటికీలకు కూడా అద్దాలతో అలంకరిస్తే అందంగా కనువిందు చేస్తాయి. ఇంట్లో అందమైన ఫర్నిచర్ లేకపోయినా కిటికీలను, అక్కడక్కడ అద్దాలతో అందంగా తీర్చిదిద్దితే ఆ ఇంటికి వచ్చే ఆకర్షణే వేరు. కిటికీల అందాల్ని మన పూర్వికులు ముందే గుర్తించారు. అందుకే పాతకాలపు కట్టడాలకు కచ్చితంగా అందమైన కిటికీలు ఉంటాయి. వీటికి వాడే కర్టెన్లు, గాజుఫలకాలు, వాటికి చుట్టూర డిజైన్లు ఆ తేజస్సు విషయంలో ఎన్నో జాగ్రత్తలు తీసుకుంటారు.



కిటికీలకు, దర్వాజాలకు పూర్తిగా చెక్కనే వాడితే ఖర్చు చాలా అవుతుంది.అంత అందం కూడా రాదు. అందుకే ఫ్రేం వరకు చెక్కను వాడి మిగిలిన భాగం అద్దం వాడితే ఇంటికి కొత్త లుక్ వస్తుంది. ఇటీవల మార్కెట్లో పలు రకాల గ్లాస్లు, డిజైన్లు అందుబాటులో ఉన్నాయి. వీటిల్లో పూర్తిగా పారదర్శకంగా ఉండే గాజు కాకుండా కొంచె రంగుల్లో ఉన్న గాజును (స్టెయిన్ గ్లాస్) వాడాలి. ఇంట్లోని కిటికీలు, తలుపులు, పార్టిషన్ వాల్స్, కప్బోరడ్స్ వంటి వాటికి దీనిని ఉపయోగించవచ్చు. బయట కాంతి ఇంట్లోకి వచ్చే విధంగా వీటిని వాడుకోవాలి. వివిధ రంగుల కాంబినేషన్లలో ఉన్న గాజు ఫలకాలు మరింత శోభను తీసుకొస్తాయి. లివింగ్ రూం వంటి చోట్ల ఉండే చిన్న కిటికీలకు మంచి డిజైన్లు ఉన్న గ్లాస్ అమరిస్తే చూడ్డానికి బాగుంటుంది. పెద్ద కిటికీలు ఉంటే పై భాగంలో వివిధ రంగుల కాంబినేషన్లో ఉన్న గాజును వాడుకోవచ్చు.



గృహ బీమా ఎందుకు?



సొంత ఇంటిని కలిగి ఉండటం చాలా మందికి జీవిత ఆశయం. చాలా ఏళ్లు సంపాదించి, ఎన్నో ఆలోచించి ఇల్లు సొంతం చేసుకుంటారు. అయితే దాన్ని సురక్షితంగా భద్రపరుచుకోవడం చాలా ముఖ్యం. అయితే దేశంలో ఇళ్ల కొనుగోలు పెరుగుతున్నప్పటికీ గృహ బీమా మాత్రం కావాల్సినంతగా వృద్ధి చెందడం లేదు. చాలా మందికి దీనివల్ల ప్రయోజనం ఇందులో ఏమేమి ఉంటాయో తెలియదు. ఇంటితో పాటు ఇంట్లో ఉండే వస్తువులకు సైతం కొన్ని గృహ బీమా కంపెనీలు రక్షణ కల్పిస్తున్నాయి. గృహ బీమా ఉంటే ఏ విధంగా ప్రయోజనం పొందవచ్చో కింద అంశాల ద్వారా తెలుసుకుందాం.

ప్రకృతి, మానవ కల్పిత విపత్తులు

ఉగ్రవాదం, అగ్నిప్రమాదం, సహజ విపత్తులు జరిగి ఇంటికి నష్టం జరిగితే సమగ్ర గృహ బీమా పాలసీలో సూచించిన మేరకు రక్షణ కల్పిస్తుంది. ఎంతో మంది వినియోగదారుల అవసరాలను గుర్తుంచుకుని ఈ గృహ బీమా పాలసీని రూపొందించారు. ఒకవేళ వినియోగదారులు ఎక్కువగా వరద ప్రభావిత ప్రాంతాల్లో ఇల్లు నిర్మించుకుని ఉంటే అటువంటి నష్టం వల్ల ఎక్కువ కవరేజీ లభించేలా పాలసీని ఎంచుకోవచ్చు.

వ్యక్తిగత ఆస్తులు నష్టపోయినప్పుడు, ప్రమాదం వాటిల్లినప్పుడు

గృహ బీమా పాలసీ కేవలం ఇంటికే కాదు, అందులో ఉండే వివిధ ఆస్తులకు సైతం బీమా రక్షణ కల్పిస్తుంది. ఈ జాబితాలో బంగారు,వెండి ఆభరణాలు, ఎలక్ట్రానిక్ వస్తువులు, ఫర్నిచర్, విలాస వస్తువులు, పురాతన వస్తువుల వంటివి సైతం ఉంటాయి. ఈ విధంగా ఉండటం వల్ల దొంగతనం వంటివి జరిగినప్పుడు చాలా ఉపయోగకరంగా ఉంటుంది. ప్రమాదం జరిగినప్పుడు కొత్త వస్తువులను మార్చుకునేందుకు, లేదా ఉన్నవాటిని మరమ్మత్తులు చేసుకునేందుకు సైతం బీమా రక్షణ అవకాశం కల్పిస్తుంది.



తాత్కాలిక నివాస ఖర్చులు

ఇల్లు ప్రమాదానికి గురైనప్పుడు ఒక్కోసారి దాంట్లో నివసించేందుకు వీలుండదు. పునర్నిర్మాణం లేదా మరమ్మత్తు జరిగేంత వరకూ వేరే అద్దె ఇంట్లో నివాసం ఉండాల్సి రావచ్చు. అప్పుడు తాత్కాలికంగా అద్దె చేతి నుంచి చెల్లించి ఎక్కడైనా ఉండాలి. అలాంటప్పుడు కొంత మేరకు అయ్యే ఖర్చులను గృహ బీమా పాలసీ భరిస్తుంది.

గృహ బీమా దరఖాస్తు

గృహ రుణ దరఖాస్తు ప్రక్రియ చాలా సులువైనది. వివిధ కంపెనీలు ఏ విధంగా పాలసీ సౌకర్యాలను కల్పిస్తున్నాయో చూడాలి. దరఖాస్తును నింపడం ద్వారా గృహ బీమా ప్రక్రియ మొదలవుతుంది. పాలసీ కొనుగోలు తుది సంతకం చేసే ముందు నియమనిబంధనలను జాగ్రత్తగా చదవాలి. ముఖ్యంగా పాలసీలో కవరయ్యే అంశాలు, మినహాయింపు అంశాలు ముందే తెలుసుకుంటే మంచిది. అంతే కాకుండా పాలసీ కొన్న 3 లేదా 5 సంవత్సరాల తర్వాత పాలసీని సమీక్షిస్తుండటం అవసరం. ఎందుకంటే ఇంటి పునర్నిర్మాణానికి అయ్యే ఖర్చు క్రమంగా పెరుగుతూ ఉంటుంది.

సెమీఫైనల్లో సైనా నెహ్వాల్

మనం స్పోర్ట్స్
శనివారం, 27 జనవరి, 2018
www.manamnews.com

క్వార్టర్‌ఫైనల్లో సింధుపై గెలుపు
ఇండోనేషియా మాస్టర్స్ బ్యాడ్మింటన్



జకార్తా: ప్రపంచ మాజీ నంబర్ వన్ సైనా నెహ్వాల్ ఒలింపిక్ రజత పతక విజేత పీవీ సింధుపై వరుస సెట్లలో గెలిచి తన ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. శుక్రవారమిక్కడ జరిగిన మహిళల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో సైనా 21-13, 21-19తో సింధును ఓడించి సెమీఫైనల్‌కు చేరుకుంది. మడమ గాయం నుంచి కోలుకున్న సైనా ఈ మ్యాచ్‌లో తన శక్తియు క్తులను ప్రదర్శించింది. వరల్డ్ చాంపియన్‌షిప్‌లో రజత, కాంస్య పతకాలను గెలిచిన సైనా సెమీఫైనల్ మ్యాచ్‌లో థాయ్‌లాండ్‌కు చెందిన నాలుగో సీడ్ రచనోక్ ఇంతనా న్‌తో ఆడుతుంది. మరో క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో గ్లాస్గో వరల్డ్ చాంపియన్ నజొమి ఒకుహరపై ఇంతనాన్ నెగ్గింది. ఇంతనాన్‌తో సైనాకు 8-5 రికార్డు ఉంది. ఇండియా బయట తొలిసారి సింధుతో ఆడిన సైనా అత్యుత్తమ ప్రతిభ కనబరిచింది. తొలి గేమ్‌లో 3-0తో లభించిన ఆధిక్యాన్ని చేజార్చుకోకుండా దాన్నే కొనసాగించింది. సింధు పోరాడి స్కోరును 4-4తో నిలిచినప్పటికీ సైనా మాత్రం ఆధిపత్యాన్ని కొనసా గించింది. విరామం సమయానికి 11-9తో నిలిచింది. విరామం తర్వాత అదే తరహాలో ఆడిన సైనా ఒకానొక దశలో 18-10తో నిలిచింది. కానీ గేమ్‌ను సైనా సొంతం చేసుకునే లోపు సింధు మరో మూడు పాయింట్లు గెలిచింది. ఇక రెండో గేమ్‌లో స్కోరు 3-3 వరకు ఇద్దరి మధ్య హోరాహోరీ పోరు కొనసాగింది. అయితే తర్వాత సీన్ మారింది. సింధు పుంజుకుని 10-5తో నిలిచింది. కానీ సైనా అద్భుతమైన పోరాట పటిమను ప్రదర్శించి స్కోరును 10-10తో సమం చేసింది. తర్వాత సింధు మో పాయింట్ సాధించి 11-10తో బ్రేక్ తీసుకుంది. చివరికి సైనా 15-14 ఆధిక్యాన్ని సంపాదించి 17-14తో నిలిచింది. ఈ మ్యాచ్‌లో రెండో సీడ్‌గా బరిలోకి దిగిన ప్రపంచ 3వ ర్యాంక్ షట్లర్ సింధు మళ్లీ పుంజుకునేందుకు ప్రయత్నించింది. కానీ సింధుకు సైనా ఆ అవకాశమివ్వలేదు.





ఫైనల్లో ఫెదరర్

సెమీఫైనల్లో చుంగ్ హియాన్ రిటైర్డ్ హర్ట్
ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్ శ్లామ్

మెల్‌బోర్న్: డిఫెండింగ్ చాంపియన్, స్విస్ దిగ్గజం రోజర్ ఫెదరర్ ఏడోసారి ఆస్ట్రేలియన్ ఓపెన్ ఫైనల్‌కు చేరుకున్నాడు. సౌత్ కొరియాకు చెందిన యువ ఆట గాడు చుంగ్ హియాన్ గాయం కారణంగా ఆట మధ్యలో తప్పుకోవడంతో ఫెదరర్ తుది పోరుకు సిద్ధమయ్యాడు. శుక్రవారమిక్కడ జరిగిన పురుషుల సింగిల్స్ సెమీ ఫైనల్ మ్యాచ్‌లో ఫెదరర్ 6-1, 5-2తో ఉన్నప్పుడు చుంగ్ కాలి పాదానికి గాయ మెంది. నాలుగు ప్రధాన్ గ్రాండ్ శ్లామ్ టోర్నీలో ఇటు పురుషుల్లోగానీ, మహిళ ల్లోగానీ సెమీఫైనల్‌కు చేరిన సౌత్ కొరియా తొలి ఆటగాడిగా రికార్డుల్లోకెక్కా డు. ఏడోసారి ఆస్ట్రేలియన్ ఓపెన్ ఫైనల్‌కు చేరిన ఫెదరర్ ఆరోసారి టైటిల్ గెల వాలని పట్టుదలగా ఉన్నాడు. ఆదివారం జరగనున్న పురుషుల సింగిల్స్ ఫైనల్లో 20 14 యూఎస్ ఓపెన్ చాంపియన్ మారిన్ సిలిక్‌తో ఫెదరర్ ఆడనున్నాడు. 'అను భూతి కాస్త తియ్యగా ఉంది. ఫైనల్‌కు చేరినందుకు చాలా చాలా సంతోషంగా ఉం ది. కా నీ ఇలా కాకుండావుంటే బాగుండేది. సెమీస్ మ్యాచ్ సాధారణంగా ముగి యాలని కోరుకున్నాను. కానీ పరిస్థితులను అంగీకరించకతప్పదు' అని ఫెదరర్ అన్నాడు.

మహిళల డబుల్స్ విజేత బబోస్, మ్లాదెనోవిచ్

ఐదో సీడ్ టిమియా బబోస్, క్రిస్టినా మ్లాదెనోవిచ్ జోడీ తొలిసారి ఆస్ట్రేలియన్ ఓపెన్ మహిళల డబుల్స్ టైటిల్‌ను సొంతం చేసుకుంది. ఈ హంగేరి, ఫ్రెంచ్ జోడీ 6-4, 6-3తో రష్యాకు చెందిన ఎకటెరినా మకరోవా, ఎలెనా వెస్నినా ద్వయాన్ని చిత్తు చేసింది. 'ఇదొక అసాధారణ అనుభూతి. నా కళ్లవెంట నీళ్లు వచ్చాయి' అని బబోస్ ఉద్వేగంతో చెప్పగా.. 'నీతో కలిసి ఆడడం అద్భుతం' అని మ్లాదెనోవిచ్ పేర్కొంది.

టైటిల్‌కు చేరువైన బోపన్న జంట

కాగా భారత్‌కు చెందిన రోహన్ బోపన్న, అతని భాగస్వామి టిమియా బబోస్ జంట మిక్స్‌డ్ డబుల్స్‌కు మరింత చేరువైంది. శుక్రవారమిక్కడ జరిగిన సెమీఫైనల్ మ్యాచ్‌లో ఈ జోడీ 7-5, 5-7, 10-6తో బ్రెజిల్‌కు చెందిన మార్సెలో డెమొలినెర్, స్పెయిన్‌కు చెందిన మారియా జోస్ మార్టినెజ్ సాంచెజ్ జంటపై పోరాడి గెలిచి ఫైనల్‌కు చేరుకుంది. బోపన్న 2017లో తొలిసారి గ్రాండ్ శ్లామ్ టైటిల్ గెలిచాడు. కెనెడాకు చెందిన గాబ్రియేలా డబ్రోవ్‌స్కీతో కలిసి విజేతగా నిలిచాడు. ఆసక్తికరమైన అంశమేంటంటే.. ఇప్పుడు ఆస్ట్రేలియాన్ ఓపెన్‌లో డబ్రోవ్‌స్కీ ప్రత్యర్థిగా బరిలోకి దిగబోతోంది. మిక్స్‌డ్ డబుల్స్‌లోనూ గెలిస్తే బబోస్‌కు ఇది రెండో టైటిల్ అవుతుంది. ఎందుకంటే ఆమె ఇప్పటికే మహిళల డబుల్స్ టైటిల్ గెలిచింది. మరో సెమీఫైనల్ మ్యాచ్‌లో డొబ్రోవ్‌స్కీ క్రొయేషియాకు చెందిన మటె పవిక్‌తో కలిసి 6-1, 6-4తో బ్రునో సోరెస్, ఎకటెరినా మకరోవా జోడీని ఓడించి ఫైనల్‌కు చేరుకుంది. సానియా మీర్జా, మహేశ్ భూపతి, లియాండర్ పేస్‌ల తర్వాత మేజర్ ట్రోఫీలను గెలిచిన నాలుగో ఆటగాడిగా బోపన్న నిలిచాడు.

వర్కింగ్ గ్రూప్‌లో కపిల్

క్రికెట్ ప్లేయర్స్ అసోసియేషన్ ఏర్పాటుకు సన్నాహాలు



ముంబై: లోధా కమిటీ కీలక సంస్కరణల్లో భాగమైన క్రికెట్ ప్లేయర్స్ అసోసియేషన్ (సీపీఏ)ను ఏర్పాటు చేసేందుకు బీసీసీఐ పనులు ప్రారంభించింది. లెజెండ్ కపిల్ దేవ్, మాజీ బ్యాట్స్‌మన్ అన్షుమన్ గైక్వాడ్, వికెట్ కీపర్ భరత్ రెడ్డి, మాజీ మహిళా కెప్టెన్ శాంతా రంగస్వామిలతో కూడిన ఓ వర్కింగ్ గ్రూప్‌ను ఏప్పటు చేయాలని గత డిసెంబర్ 12న జరిగిన కమిటీ ఆఫ్ అడ్మినిస్ట్రేటర్స్ సమావేశంలో సీఓఏ నిర్ణయం తీసుకుంది. లోధా కమిటీ చెప్పినట్టు ప్లేయర్స్ అసోసియేషన్‌ను ఏర్పాటు చేసే క్రమంలో కొత్త స్టీరింగ్ కమిటీని నెలకొల్పేందుకు దిశానిర్దేశం ఇవ్వాలని సీఓఏ తన నాలుగవ స్థాయీ నివేదికలో సుప్రీం కోర్టును కోరిన సంగతి తెలిసిందే. స్టీరింగ్ కమిటీలోని నలుగురు సభ్యులకు గాను మాజీ బ్యాట్స్‌మన్ మొహిందర్ అమర్‌నాథ్‌తో పాటు మరో ఇద్దరు స్టీరింగ్ కమిటీకి రాజీనామా చేశారు. దీంతో వీరి స్థానంలో కపిల్, గైక్వాడ్, భరత్ రెడ్డిల పేర్లను సుప్రీంకు సీఓఏ సూచించింది. సీపీఏకు మహిళా క్రికెటర్లలో ఎవరిని ఎంపిక చేస్తే బాగుంటుందో చెప్పేందుకు రంగస్వామిని వర్కింగ్ గ్రూప్‌లోకి తీసుకున్నారు.



సౌతాఫ్రికా లక్ష్యం 241

ప్రస్తుతం 17/1 .. రెండో ఇన్నింగ్స్‌లో టీమిండియా 247 ఆలౌట్

- కోహ్లి, రహానే, భువీ సహకారం
- చివరి, మూడో టెస్టు

జొహన్నెస్‌బర్గ్: సిరీస్ కోల్పోయినప్పటికీ ఒక్క మ్యాచైనా గెలవాలన్న టీమిండియా కృషికి అడ్డుకట్ట పడే సూచనలు కనిపిస్తున్నాయి. రెండో ఇన్నింగ్స్‌లో సౌతాఫ్రికా 1 వికెట్ నష్టానికి 17 పరుగులు చేసింది. అయితే బుమ్రా వేసిన బంతి ఓపెనర్ ఎల్గార్ నుదుటిమీద హెల్మెట్‌కు తగలడంతో సౌతాఫ్రికా క్రికెటర్లు, ఫీల్డ్ అంపైర్లు రచ్చ రచ్చ చేశారు. ఈ మ్యాచ్‌లో కోహ్లి సేన గెలిచే అవకాశముంది. కానీ పిచ్ ప్రమాదకరంగా ఉందని అంపైర్లు భావిస్తే మ్యాచ్‌ను అక్కడికక్కడే రద్దు చేసే అవకాశముంది. ఘటన జరిగిన వెంటనే బౌలింగ్ ఎండ్‌లో ఉన్న అంపైర్.. కోహ్లిని పిలిచి మాట్లాడడం ఓవరాక్షన్ చేశాడని మాజీ కెప్టెన్, కామెంటేటర్ గవాస్కర్ అభిప్రాయపడ్డారు.

అండగా నిలిచిన కోహ్లి

మూడో రోజు తొలి సెషన్ ఆరంభంలోనే టీమిండియా రెండు వికెట్లు కోల్పోయింది. ఓవర్‌నైట్ బ్యాట్స్‌మెన్ మురళీ విజయ్, లోకేష్ రాహుల్‌తో పాటు చెటేశ్వర్ పుజారా కూడా అవుటయ్యాడు. ఈ ముగ్గురు కలిసి కెప్టెన్‌తో 93 పరుగుల ఆధిక్యాన్ని అందించారు. 1 వికెట్ నష్టానికి 49 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో మూడో రోజు రెండో ఇన్నింగ్స్‌ను కొనసాగించిన టీమిండియా ఆరంభంలోనే రాహుల్, చెటేశ్వర్ పుజారా వికెట్లను కోల్పోయింది. దీంతో టీమిండియా 57 పరుగులకు 3 వికెట్లను నష్టపోయినట్లయింది. ఓవర్‌నైట్ స్కోరును మరిన్ని పరుగులు జోడించడంలో రాహుల్ విఫలమయ్యాడు. ఫిలాండర్ బౌలింగ్‌లో ఆఫ్ స్టంప్ బయట వెళుతున్న బంతిని రాహుల్ ఆడబోయి రెండో స్లిప్‌లో ఉన్న ప్లెసిస్‌కు క్యాచ్ ఇచ్చాడు. అప్పుడే వచ్చిన పుజారా అదే ప్లెసిస్ బౌలింగ్‌లో మోర్కెల్ చేతికి చిక్కాడు. ఆ తర్వాత వచ్చిన కోహ్లి.. విజయ్‌తో నెమ్మదిగా స్కోరు బోర్డును కదిలించాడు. కోహ్లి 4 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద ఇచ్చిన ఆసాధ్యమైన క్యాచ్‌ను సౌతాఫ్రికా ఫీల్డర్లు అందుకోలేకపోయారు. మోర్కెల్ వేసిన బంతిని కోహ్లి ఫ్లిక్ షాట్ కొట్టాడు. ఫార్ట్ లెగ్ స్థానంలో ఉన్న ఐడెన్ మార్క్రమ్ ఆ బంతిని అందుకున్నాడు కానీ ఒడిసిపట్టుకోలేకపోయాడు. ఆ తర్వాత కోహ్లి తన క్వాలిటి బ్యాటింగ్‌ను ప్రదర్శించాడు. ఎటువంటి బెరుకు లేకుండా డ్రైవ్ షాట్స్ ఆడాడు. మరో ఎండ్‌లో ఉన్న విజయ్ తన డిఫెన్స్ స్కిల్స్‌ను ప్రదర్శించాడు. దీంతో వీరిద్దరూ భారీ భాగస్వామ్యాన్ని అందిస్తారని అందరూ అనుకున్నారు. కానీ భోజన విరామానికి చివరి ఓవర్లో రబాడ వేసిన యార్కర్‌కు విజయ్ క్లీన్ బౌల్డ్ అయ్యాడు. దీంతో భోజన విరామానికి టీమిండియా 4 వికెట్ల నష్టానికి 100 పరుగులు చేసింది.

ఆధిక్యాన్ని పెంచిన రహానే

తొలి ఇన్నింగ్స్‌లో తక్కువ పరుగులకే వెనుదిరిగిన అజింక్య రహానే రెండో ఇన్నింగ్స్‌లో విలువైన పరుగులు అందించాడు. టీ విరామ సమయానికి రహానే 46 పరుగులతో, భువనేశ్వర 23 పరుగులతో క్రీజులో ఉన్నారు. టీమిండియా 6 వికెట్ల నష్టానికి 199 పరుగులు చేసింది. దీంతో 192 పరుగుల ఆధిక్యం లభించింది. భోజన విరామం తర్వాత సౌతాఫ్రికా పేసర్ కగిసో రబాడ రెండు వికెట్లు తీశాడు. విరాట్ కోహ్లి, హార్దిక్ పాండ్యాలను పెవిలియన్ పంపాడు. 4 వికెట్ల నష్టానికి 100 పరుగులతో భోజన విరామం తర్వాత ఇన్నింగ్స్‌ను ప్రారంభించిన టీమిండియా కోహ్లి వికెట్‌ను కోల్పోయింది. టీమిండియా ఇన్నింగ్స్‌ను ప్రారంభించాలనుకున్న కోహ్లికి తాను అవుట్ కావడం తీవ్ర నిరాశకు గురిచేసింది. ఢిల్లీకి చెందిన కోహ్లి 79 బంతుల్లో ఆరు ఫోర్లతో 41 పరుగులు చేశాడు. తర్వాత హార్దిక్ పాండ్యా పేలవమైన షాట్‌తో రబాడకే క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. తర్వాత వచ్చిన భువనేశ్వర్.. రహానేతో కలిసి స్కోరుబోర్డును ముందుకు కదిలించాడు. 60 ఓవర్లో రహానేకు లైఫ్ లభించింది. రబాడ బౌలింగ్‌లో రహానే ఇచ్చిన క్యాచ్‌ను పెహ్లువాయో చేజార్చాడు.

ఆదుకున్న రహానే, భువీ

టీ విరామం తర్వాత రహానే, భువనేశ్వర్ టీమిండియాకు తమ వంతు సహకారం అందించారు. వీరిద్దరూ సౌతాఫ్రికా బౌలర్లు ఏమాత్రం భయపడకుండా దూకుడుగా ఆడారు. దీంతో వీరిద్దరూ ఏడో వికెట్‌కు 55 పరుగుల కీలక భాగస్వామ్యాన్ని అందించారు. 68వ ఓవర్లో మోర్కెల్ వేసిన బంతిని ఫ్లిక్ షాట్ ఆడబోయిన రహానే కీపర్ డికాక్ చేతికి చిక్కాడు. తర్వాత వచ్చిన మహ్మద్ షమీ కూడా దూకుడుగా ఆడుతూ తన వంతు సహకారం అందించాడు. కానీ మోర్కెల్ వేసిన ఓ బౌన్సర్‌కు భువీ కీపర్ డికాక్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. మహ్మద్ షమీని ఎన్‌గిడి పెవిలియన్ పంపాడు. తర్వాత వచ్చిన బుమ్రా ఫిలాండర్ బౌలింగ్‌లో భారీ షాట్ కొట్టబోయి రబాడ చేతికి చిక్కడంతో టీమిండియా రెండో ఇన్నింగ్స్ ముగిసింది. ఇషాంత్ నాటౌట్‌గా నిలిచాడు.

తర్వాత 241 పరుగుల గెలుపు లక్ష్యంతో బరిలోకి దిగిన సౌతాఫ్రికా ఆదిలోనే తొలి వికెట్ కోల్పోయింది. మహ్మద్ షమీ వేసిన బంతికి ఓపెనర్ మార్క్రమ్ కీపర్ పార్థివ్ పటేల్‌కు క్యాచ్ ఇచ్చిన వెనుదిరిగాడు.

స్కోరుబోర్డు

ఇండియా తొలి ఇన్నింగ్స్: 187 ఆలౌట్
సౌతాఫ్రికా తొలి ఇన్నింగ్స్: 194 ఆలౌట్

ఇండియా రెండో ఇన్నింగ్స్ (ఓవర్‌నైట్ స్కోరు: 49/1): మురళీ విజయ్ (బి) రబాడ 25, రాహుల్ (సి) ప్లెసిస్ (బి) ఫిలాండర్ 16, పుజారా (సి) ప్లెసిస్ (బి) మోర్కెల్ 1, విరాట్ కోహ్లి (బి) రబాడ 41, రహానే (సి) డికాక్ (బి) మోర్కెల్ 48, పాండ్యా (సి) అండ్ (బి) రబాడ 4, భువనేశ్వర్ (సి) డికాక్ (బి) మోర్కెల్ 33, షమీ (సి) డివిలియర్స్ (బి) ఎన్‌గిడి 27, ఇషాంత్ నాటౌట్ 7, బుమ్రా (సి) రబాడ (బి) ఫిలాండర్ 0; ఎక్స్‌ట్రాలు: 29; మొత్తం 80.1 ఓవర్లలో 247 ఆలౌట్; వికెట్ల పతనం: 2-51, 3-57, 4-100, 5-134, 6-148, 7-203, 8-238, 9-240, 10-247; బౌలింగ్: ఫిలాండర్: 21.1-5-61-3, రబాడ: 23-5-69-3, మోర్కెల్: 21-6-47-3, ఎన్‌గిడి: 12-2-38-1, పెహ్లువాయో: 3-0-15-0.

సౌతాఫ్రికా రెండో ఇన్నింగ్స్: మార్క్రమ్ (సి) పార్థివ్ (బి) షమీ 4, ఎల్గార్ నాటౌట్ 11, ఆమ్లా నాటౌట్ 2; మొత్తం 8.3 ఓవర్లలో 17/1; వికెట్ పతనం: 1-5; బౌలింగ్: భువనేశ్వర్: 4-0-8-0, షమీ: 4-1-7-1, బుమ్రా: 0.3-0-2-0.

అనవసరమైన డ్రామా

మూడో రోజు ఆట ముగిసేందుకు మరో అరగంట సమయం ఉందనగా వాండరర్స్ మైదానంలో అనవసరమైన డ్రామా కొనసాగింది. 8వ ఓవర్లో మూడో బంతిని జస్‌ప్రీత్ బుమ్రా బౌన్సర్ వేశాడు. ఓపెనర్ ఎల్గార్ ఆ బంతిని డిఫెన్స్ ఆడబోయాడు. కానీ బంతి అతని నుదుటి మీద హెల్మెట్‌కు తగిలింది. దీంతో అందరూ ఆశ్చర్యపోయారు. పిచ్‌పై పడిన బంతి 5.8 మీటర్ల ఎత్తు ఎగిరింది. అందరూ టెన్షన్ పడ్డారు. వెంటనే బౌలింగ్ ఎండ్‌లో ఉన్న ఫీల్డ్ అంపైర్ కెప్టెన్ కోహ్లిని పిలిచి మాట్లాడారు. కోహ్లి హావభావాలు చూస్తే ఇందులో తమ తప్పేముందని అంపైర్‌ను ప్రశ్నించినట్టు కనిపించింది. మ్యాచ్ ఆగిపోయింది. ఇద్దరు అంపైర్లు ఇద్దరు కెప్టెన్లతో దాదాపు 20 నిమిషాలు డ్రెస్సింగ్ రూమ్‌లో సమావేశమై చర్చించారు. ఈలోపు చినుకులు పడడంతో ప్లాస్టిక్ కవర్లతో పిచ్‌ను కప్పేశారు. లోపల ఏం చర్చించారో తెలీదు కానీ.. ఐసీసీ రూల్ ప్రకారం పిచ్ ప్రమాదకరంగా ఉందని అంపైర్లు భావించి మ్యాచ్‌ను అక్కడే నిలిపివేసే అవకాశముంది. అయితే ఇద్దరు అంపైర్లు ఒప్పుకుంటేనే ఇది సాధ్యమవుతుంది. ఒకవేళ కోహ్లి ఒప్పుకోకుండా శనివారం నాలుగో రోజు సౌతాఫ్రికా బ్యాటింగ్‌కు రావాల్సివుంటుంది. టెస్టు సిరీస్‌లో గెలిచేందుకు లభించిన ఏకైక అవకాశాన్ని కోహ్లి వదులుకోడని అందరూ భావిస్తున్నారు. క్రీడా విశ్లేషకులు కూడా పిచ్‌నే తప్పు పడుతున్నారు. బుమ్రా సరైన విధంగానే బౌన్సర్ వేశాడని.. ఇదే సిరీస్‌లో మార్క్రమ్ అనేకసార్లు ఆడలేక బంతిని తన శరీరానికి తగిలించుకున్నాడని కామెంటేటర్స్ కూడా అన్నారు.



మైదానం వదలి వెళ్లండని క్రికెటర్లను కోరుతున్న అంపైర్ గఫ్

సెమీస్‌లో యువ భారత్

క్వార్టర్ ఫైనల్లో బంగ్లాదేశ్‌పై విజయం - శుభ్‌మన్ గిల్, అభిషేక్ శర్మ అర్ధ సెంచరీలు - అండర్-19 క్రికెట్ వరల్డ్ కప్



క్వీన్స్‌టౌన్: అండర్-19 క్రికెట్ వరల్డ్ కప్‌లో యువ భారత్ సెమీఫైనల్‌కు చేరుకుంది. శుక్రవారమిక్కడ జరిగిన క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో ఇండియా 131 పరుగులతో బంగ్లాదేశ్‌ను చిత్తు చేసింది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన ఇండియా 49.2 ఓవర్లలో 265 పరుగులకు ఆలౌట్‌కాగా.. తర్వాత బంగ్లాదేశ్ 42.1 ఓవర్లలో 134 పరుగులకు టపా కట్టేసింది. శుభ్‌మన్ గిల్, అభిషేక్ శర్మ అర్ధ సెంచరీలతో రాణించారు. సెమీఫైనల్లో చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌తో ఇండియా ఆడుతుంది. గురువారం జరిగిన మరో క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో సౌతాఫ్రికాపై గెలిచి పాకిస్థాన్ సెమీఫైనల్‌కు చేరుకుంది. మరో సెమీఫైనల్ మ్యాచ్ ఆఫ్ఘనిస్థాన్, ఆస్ట్రేలియా జట్ల మధ్య జరగనుంది. ఇంగ్లండ్‌తో జరిగిన మ్యాచ్‌లో 125 పరుగుల స్వల్ప స్కోరును నిలబెట్టుకున్న ఇదే పిచ్‌పై టాస్ గెలిచిన భారత కెప్టెన్ పృథ్వీ షా ఎటువంటి సంకోచం లేకుండా బ్యాటింగ్ ఎంచుకున్నాడు. లీగ్ మ్యాచ్‌లన్నీ మౌంట్ మాంగనుయ్ పిచ్‌పై ఆడిన భారత జట్టుకు తొలిసారి ఈ మ్యాచ్‌లో బ్యాటింగ్ పరీక్ష ఎదురైంది. అయినప్పటికీ మిడిలార్డర్ బ్యాట్స్‌మన్ జట్టుకు అండగా నిలిచి స్ఫూర్తిదాయక మొత్తాన్ని అందించారు. వైస్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ మూడోసారి 50కిపైగా పరుగులు సాధించాడు. 94 బంతుల్లో 86 పరుగులు చేశాడు. టాపార్డర్‌లో షా 40 పరుగులు చేయగా.. ఆల్ రౌండర్ అభిషేక్ శర్మ 49 బంతుల్లో 50 పరుగులు సాధించాడు. బంగ్లాదేశ్ బౌలర్లు క్రమశిక్షణతో కూడిన బౌలింగ్ వేయడంతో షా తొలుత ఆచితూచి ఆడాడు. కానీ గిల్ మాత్రం దూకుడును ప్రదర్శించాడు. దీంతో తొలి 10 ఓవర్లలో భారత్ 71 పరుగులు నమోదు చేసింది. అయితే భయపడుతూ ఆడిన షాను మీడియం పేసర్ క్వాజి ఒనిక్ అవుట్ చేశాడు. క్వాజి వేసిన బంతి షా బ్యాట్ అంచును తాకినప్పటికీ వికెట్లపైకి దూసుకెళ్లింది. తర్వాత వికెట్ కీపర్ బ్యాట్స్‌మన్ హార్విక్ దేశాయ్ 34 బంతుల్లో 48 పరుగులు చేసి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దాడు. మిడిల్ ఓవర్లలో బంగ్లాదేశ్ స్పిన్నర్లు భారీగా పరుగులు సమర్పించుకోవడంతో హార్విక్, గిల్ కలిసి నాలుగో వికెట్‌కు 98 బంతుల్లో 74 పరుగుల భాగస్వామ్యాన్ని అందించారు. గిల్ వికెట్ల వద్ద నిలదొక్కుకోవడమే కాకుండా స్ట్రైక్‌ను రొటేట్ చేశాడు. కానీ ఆ తర్వాత బంగ్లాదేశ్ బౌలర్లు ఇండియాను కట్టడి చేశారు. 2 వికెట్ల నష్టానికి 176 పరుగులు చేసిన భారత్ 7 వికెట్లు కోల్పోయి 239 పరుగులు మాత్రమే చేయగలిగింది. స్కోరును నిలబెట్టుకునే క్రమంలో బంగ్లా ఓపెనర్లను అవుట్ చేయడం భారత పేస్ అటాక్‌కు కష్టమైంది. పినాక్ ఘోష్, మహ్మద్ నయీమ్ 8.4 ఓవర్లలో 23 పరుగులు మాత్రమే చేశారు. అయితే శివం మవి తొలి వికెట్ తీయడంతో వీరి భాగస్వామ్యానికి తెరపడింది. ఆ తర్వాత వరుస విరామ సమయాల్లో బంగ్లాదేశ్ వికెట్లు కోల్పోయింది. ఏ ఒక్క జోడీ కూడా విలువైన భాగస్వామ్యాన్ని నెలకొల్పలేకపోయింది.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam publications private limited, Printed at JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, Survey No:127, Plot No:12, Mallapur Village, Nacharam, Medchal District.Telangana state and Published From H.No:6-3-864/4/B, SBN Arcade,4th&5th Floor, Green lands, Opp: Green Park Hotel, Hyderabad - 500016 Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952. Phone No.040-46519999. E-mail Id. manamtelugudaily1@gmail.com.